సాహితీ గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కర్నూలు
: fb.com/vaartha Digital
Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 135 పేజీలు: 10+4 వెల: 6.50

ట్రంప్ వైఖరిపైనే జి-7 దేశాధినేతల ఫోకస్ 5లో

భారీగా పెరుగుతున్న కరోనా కేసులు



## కుప్పకూలిన హెలికాప్టర్

### పైలట్, ఆరుగురు యాత్రికుల మృతి

### ఉత్తరాఖండ్‌లో దుర్ఘటన

**డెహ్రాడూన్,జూన్ 15:** ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన హెలికాప్టర్ కూలిన ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేయనుంది. కేదార్‌నాథ్ పుణ్యక్షేత్రం గుప్త్ కాన్షీ పట్టణంలోని ఆర్యన్ హెలిప్యాడ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్న ఈ హెలికాప్టర్ ఎందుకు కూలిందనే వివరాలను ఎఎఐబి తెలుసుకోనుంది. ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు ఎఎఐబి దర్యాప్తు చేస్తుందని వెల్లడించింది. ప్రమాదంలో మొత్తం ఏడుగురు మృతిచెందారని అధికారికంగా ప్రకటించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా చార్‌ధామ్ మార్గంలో హెలికాప్టర్ సర్వీసులను రెండు రోజుల పాటు నిలిపివేయాలని ఉత్తరాఖండ్ సర్కారు నిర్ణయించింది. వాతావరణ ప్రతికూలతలు, ప్రయాణికుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మహారాష్ట్రలోని యావత్మల్‌కు చెందిన రాజ్‌కుమార్ జైస్వాల్ శ్రద్ధా దంపతులు, వారి రెండేళ్ల కుమార్తె హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వీరితో కూడిన హెలికాప్టర్ ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు కేదార్‌నాథ్ నుంచి గుప్త్ కాన్షీకి >>2



ఆదివారం సైప్రస్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఆదేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్

## సైప్రస్‌లో ప్రధాని మోడీ

### నేడు కెనాడాలో జి-7 సదస్సుకు హాజరు

**న్యూఢిల్లీ:** వివిధ రంగాల అభివద్ధికై సహకారం పెంపొందించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆయా దేశాధినేతలతో చర్చించనున్నారు. ఈ మేరకు ఆదివారం సైప్రస్‌కు చేరుకున్నారు. దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటన అనంతరం ఇక్కడి నుంచి కెనడాలో జరిగే జీ7 సదస్సుకు హాజరుకానున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, కౌంటర్‌టెర్రరిజం తదితర రంగాల్లో తోడ్పాటుకు సంబంధాలు మెరుగుపరిచేందుకు ఆయనతో సమావేశం కానున్నారు. అయితే సైప్రస్ దేశానికి 23ఏళ్ల తరువాత భారత్ ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనకు వెళ్లే ముందు ట్వీట్ చేస్తూ మధ్యధరా, ఈయూ ప్రాంతంలో సైప్రస్‌ను విలువైన భాగస్వామిగా ఉద్ఘాటించారు. మూడు దేశాల పర్యటనలతో ఆయా దేశాలతో వివిధ కీలకరంగాల్లో సంబంధాలను మరింత పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యటన ముగిసిన తర్వాత కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఈ నెల16, 17న జీ7 సదస్సుకు మోడీ హాజరుకానున్నారు. ఇక్కడ అంతర్జాతీయ అధినేతలతో సమావేశమై ఇంధనభద్రత, సాంకేతికత ఆవిష్కరణలపై చర్చలు జరపనున్నారు. తిరుగు ప్రయాణంలో 18న ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లడం కూడా తొలిసారి.



## కూలిపడిన వంతెన

### పుణేలోని ఇంద్రాయని నదిలో దుర్ఘటన

### ఇద్దరు మృతి,15 మంది ఆచూకీ గల్లంతు

### ఆరుగురిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్

**పూణె,జూన్ 15:** పూణెలోని ఇంద్రాయని నదిపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో ఇద్దరు మృతిచెందారు. 15 మందికిపైగా ఆచూకీ గల్లంతయింది. మొత్తం 32మందికి తీవ్ర గాయాలయ్యాయి, వీరిలో ఆరుగురిపరిస్థితి విషమంగా ఉందని మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. పర్యాటక కేంద్రం అయిన కుంద్‌మాలా ప్రాంతంవద్దనే రుతుపవనాల సమయంలో పెద్ద ఎత్తున జలపాతాలు దర్శనమిస్తుంటాయి. వీటిని ఇచూడటంకోసం వందలాదిగా పర్యాటకులు వస్తుంటారు. ఆదివారం కూడా అదేవిధంగా పర్యాటకులు ఈ దృశ్యాలు చూసేందుకు వంతెనపైకి చేరారు. ఆకస్మికంగా వంతెన కూలిపోవడంతో కొందరి ఆచూకీ కూడా గల్లంతయింది. ఎన్‌డి ఆర్ఎఫ్, ఎస్డీ ఆర్ఎఫ్, పోలీస్ అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే ప్రమాదస్థలానికి వెళ్లి ఆరుగురిని రక్షించారు. గల్లంతయినవారి ఆచూకీకోసం గాలిస్తున్నారని, ఎన్డీఆర్ఎఫ్ స్పాట్‌లో >>2

# పొగాకు రైతుకు కేంద్రం అండ

### సిఎం చంద్రబాబుకు కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ హామీ

### పొగాకు కొనుగోళ్లకు రూ. 150 కోట్లు కేటాయించండి

### ఆయిల్‌పాం దిగుమతి సుంకం తగ్గింపుపై పునరాలోచన చేయండి

### ఆక్వా ఎగుమతుల సుంకాల తగ్గింపుపై కేంద్ర మంత్రికి సిఎం వినతిపత్రం



ఆదివారం అమరావతిలో కేంద్రమంత్రి పీయూష్‌గోయలకు వినతిపత్రం అందజేస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** టొబాకో బోర్డు ద్వారా ఎపిలో పొగాకు కొనుగోళ్లకు 150 కోట్ల రూపాయలు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి అంశాలను టొబాకో బోర్డు ద్వారా నియంత్రించేలా చట్టసవరణ చేయాలని సూచించారు. ఆయిల్ పాం దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించడంపై పునరాలోచన చేయాలన్నారు. ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల విషయంలో ఆ దేశంతో చర్చలు జరపాలని సిఎం సూచించారు. మ్యాంగో పల్ప్‌పై జిఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని సిఎం ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భేటీ అయ్యారు.రాష్ట్రంలోని వివిధ అంశాలపై ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి చర్చించారు. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై జిఎస్టీ తగ్గింపుపై అంశాలపై వినతి పత్రం అందించారు. సిఎం చంద్రబాబుతో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ ఈ సమావేశంలో పలు అంశాలు ప్రస్తావించారు. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, పామాయిల్‌పై దిగుమతి సుంకంతగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై జిఎస్టీ తగ్గింపు, టొబాకో బోర్డు ద్వారా ఎపిలో పొగాకు కొనుగోళ్ల నిమిత్తం రూ.150 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి వినతి పత్రం అందజేసారు. పొగాకు ధరలు తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.300 కోట్లతో 20 మిలియన్ కేజీలు కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు.బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఏడు చోట్ల పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సిఎం చంద్రబాబు వివరించారు. పొగాకు కొనుగోళ్ల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసే రూ. 300 కోట్లలో టొబాకో బోర్డు రూ.150 కోట్లు భరించేలా చూడాలని పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి అంశాలను >>2

# మరో 2 స్పేస్ పార్కులు

### శ్రీహరి కోట, లేపాక్షి వద్ద ఏర్పాటు యోచన

### 2028-30 కల్లా వైజాగ్ మెట్రో ప్రాజెక్టు

### 'క్లీన్ ఎనర్జీ'కి రూ. 5.78 లక్షల కోట్ల పెట్టుబడుల రాక: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో 2 చోట్ల అంతరిక్ష పార్కుల ఏర్పాటుదిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో అంతరిక్షపార్కులు ఇతర అంశాలపై భవిష్యత్తు కార్యచరణపై సిఎం చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా సమాచారాన్ని వెల్లడించారు. సిఎంవోనుండి అంతరిక్షపార్కులుపై స్పష్టత నిస్తున్న ప్రకటన విడుదలయింది. ప్రస్తుతం అంతరిక్ష కేంద్రం ఉన్న శ్రీహరికోట సమీపంలోనే ఒక పార్కు, అనంతపురం జిల్లాలోని లేపాక్షిలో మరోక పార్కు ఏర్పాటు చేయాలనిచూస్తున్నారు. వీటిని దృష్టిలోఉంచుకునే ఇస్రో మాజీఅధిపతి డాక్టర్ సోమనాథ్‌ను ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. ఆయన ఆధ్వర్యంలోనే అంతరిక్ష రంగంపై ప్రభుత్వం అడుగులు వేస్తుంది. శ్రీహరికోట దగ్గర్లో వాహక నౌకలతోపాటు కీలకమైన ప్రొపెలెంట్ లాజిస్టిక్ తయారీ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లేపాక్షి వద్ద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అంతరిక్ష పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు.

శ్రీసిటీలో రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన విఆర్‌వి (స్వదేశీ ద్రవ హైడ్రోజన్ నిల్వ ట్యాంక్), డానియేల్ ఇండియా (మొబైల్ లాంచ్ పెడెస్టల్స్ బిల్డర్లు), రోటోలోక్ (ఘన ఇంధన ఇంజిన్ల కోసం వాల్వులు), టిహెచ్‌కే ఇండియా (చంద్రయాన్3లో వినియోగించిన లీనియర్ మోషన్ గైడ్‌లు), నోవాఎయిర్ (ద్రవ ఆక్సిజన్ సరఫరా), వాల్ మెట్ ఇంజినీరింగ్ (ఏరోస్పేస్ గ్రేడ్ మిశ్రమ లోహాల ప్రాసెసర్లు), సిద్ధార్థ లాజిస్టిక్స్(సున్నితమైన ఇస్రో పేలోడ్ లాజిస్టిక్‌లు) సంబంధించిన పరిశ్రమలు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఆంధ్రా షుగర్స్ ప్రొపెలెంట్ యూనిట్ ఉంది. వీరు ఇస్రోకు ఎప్పటి నుంచో రాకెట్ ఇంధనం (ఎంఎంహెచ్, యూడీఎంహెచ్)ను సరఫరా చేస్తున్నారు. తమిళనాడు, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలు తమ సొంత అంతరిక్ష పాలసీల రూప కల్పనలో ముందు వరుసలో ఉన్నాయి. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్‌స్పేస్) కూడా అక్కడ వాహకనౌకలు, ఉపగ్రహాలు, పరికరాల తయారీపై దృష్టి పెట్టాయి. గుజరాత్ ఉపగ్రహాలు, పేలోడ్‌లపై, తమిళనాడు వాహకనౌకలపై దృష్టి పెట్టాయి.

కర్ణాటక ఇప్పటికే ఇస్రోకు సంబంధించిన కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారింది. దేశంలోనే ఏకైక స్పేస్ పోర్టు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం రావాల్సినంత గుర్తింపు ఇంకా రాలేదు. అందుకే సిఎం చంద్రబాబు ప్రతిష్మాత్మకంగా తీసుకొని నూతన పాలసీతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం అంతరిక్ష కేంద్రం ఉన్న శ్రీహరికోట సమీపంలోనే ఒక పార్కు, అనంతపురం జిల్లాలోని లేపాక్షిలో మరోక పార్కు ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకునే ఇస్రో మాజీ అధిపతి డాక్టర్ సోమనాథ్‌ను ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. ఆయన ఆధ్వర్యంలోనే అంతరిక్ష రంగంపై ప్రభుత్వం అడుగులు వేస్తుంది.

శ్రీహరికోట దగ్గర్లో వాహక నౌకలతోపాటు కీలకమైన ప్రొపెలెంట్ లాజిస్టిక్ తయారీ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లేపాక్షివద్ద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అంతరిక్ష పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు.తిరుపతి జిల్లాలోని శ్రీహరికోటలో రాకెట్ కేంద్రం ఉన్నప్పటికీ దానికి కావాల్సిన సామగ్రి తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్నారు. అక్కడ నుంచి శ్రీహరికోటకు తీసుకొచ్చేందుకు ఎక్కువ సమయం పడుతోంది. ఇంకా దీనివల్ల ప్రయోగాలు ఆలస్యం అవుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్‌లోనే అంతరిక్ష పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.ఇందుకు కేంద్రం నుంచి సానుకూలత లభించిందన్నారు. దేశంలోని టాప్ 3 స్టీల్ పరిశ్రమలతో స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దడం, అలాగే పెట్రో కెమికల్స్, గ్యాస్‌గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్స్ మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, >>2

## ప్రభుత్వ బడుల్లో 'విలువల విద్య' పుస్తక పంపిణి

**విజయవాడ, జూన్15,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి 'విలువలతో విద్య(మోరల్ ఎడ్యుకేషన్)' పుస్తకాలను అందించనున్నారు. విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణామండలి (ఎస్‌సిఇఆర్టీ) ఈ పాఠ్య పుస్తకాలను రూపొందించింది. ఆరో తరగతికి 'తోరణాలు',ఏడోతరగతికి 'మనోవికాసం' ఎనిమిది, తొమ్మిది తరగతులకు 'సూక్తి సుధ',పదో తరగతికి 'అమృతధార' పేరుతో ఈ పుస్తకాలను తీసుకొచ్చారు. ఇవి దాదాపు 39 పేజీల వరకు ఉన్నాయి. పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ పెట్టారు. ఆయా పాఠ్యాంశాల వీడియోలు కావాలనుకునేవారు వాటిని స్కాన్ చేయొచ్చు.సుప్రసిద్ధ కాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు,ప్రసిద్ధ చిత్రకారులు బాపు గురించి క్లుప్తంగా ఇచ్చారు. పదోతరగతిలో విద్య విలువ, సజ్జన సహవాసం,కీర్తి శరీరం,సహజ గుణాలు, నింద చెందకు, మాటతూలకు అనే పాఠ్యాంశాలున్నాయి.తొమ్మిదిలో కోపం-శాంతం, వాగ్భూషణం, పథం, తస్మాత్ జాగ్రత్త పాఠాలున్నాయి. ఎనిమిదో తరగతి పుస్తకంలో ఓర్పుతో విజయం,అందమైన అలవాటు,సాయానికి సిద్ధం, శిక్షణ, దుర్గుణాలు, గౌరవం పాఠాలు తీసుకొచ్చారు. >>2

# పటిష్టంగా కరకట్టలు



### గరిష్ట వరదను తట్టుకునేలా నిర్మాణం

### ప్రకాశం బ్యారేజి గేట్ల ఎత్తు పెంపు

### రూ. 8,740 కోట్లతో ప్రతిపాదనలు

### - మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నదికి గరిష్ట వరదను తట్టుకునే దిశలో కరకట్టలను నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టినట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.ఇందుకు సంబంధించి ఆయన ఒక సమాచార పత్రాన్ని విడుదల చేసారు.కృష్ణా నదికి చరిత్రలో ఎన్నడూ రానంత వరద గతేడాది ప్రకాశం బ్యారేజీ వద్ద పోటెత్తింది. ఈ అనుభవంతో అత్యధిక వరద వచ్చినా, తట్టుకునేలా నదీ వ్యవస్థను మెరుగుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. 15లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని కూడా తట్టుకునేలా ప్రకాశం బ్యారేజీని ఆధునీకరిస్తామని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తదనుగుణంగా జలవనరుల శాఖ దీర్ఘకాలిక కార్యాచరణతో పాటు తాత్కాలిక పనులు చేపట్టింది. రూ.8470కోట్ల అంచనా వ్యయంతో పూర్తి స్థాయి ప్రతిపాదనలు రూపొందించి గత జనవరిలోనే నివేదించింది. ఇవి ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయి. మరో వైపు ప్రస్తుత వరద కాలంలో అత్యధికవరద వచ్చినా తట్టుకునేందుకు చేయాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. బ్యారేజీ వద్ద తుప్పు పట్టిన హాయిస్ట్ ప్లాట్‌ఫాం మరమ్మత్తులతో పాటు ఇతర పనులకు ప్రభుత్వం తాజాగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. నది పొడవునా కరకట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి,అక్కడ ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

కిందటేడాది సెప్టెంబరు 2న ప్రకాశం బ్యారేజీకి గతంలో ఎన్నడూ రానంత వరద పోటెత్తింది. నదిలో ఎగువ నుంచి వచ్చిన ప్రవాహానికి బుడమేరు వరద తోడై బ్యారేజీ వద్ద సముద్రాన్ని తలపించింది. మొత్తంగా 11.40 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదైంది. 2009 అక్టోబరు 5న 11.10 లక్షల క్యూసెక్కుల వరదే...అప్పటి దాకా ఉన్న గరిష్ట రికార్డు.1954లో కొత్త బ్యారేజీ కట్టాక ఇంతటి ప్రవాహం రెండు సందర్భాల్లోనే వచ్చింది. 1903లో పాత ఆనకట్ట ఉన్నప్పుడు 10.60 లక్షల క్యూసెక్కులు,1952లో 8 లక్షల క్యూసెక్కుల వరద నమోదైంది. కృష్ణా నది >>2



ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లో మిస్సైల్ పేలిన దృశ్యం

# ఇరాన్, ఇజ్రాయెల్ హోరాహోరీ

### వరుసగా మూడోరోజున దాడులు ముమ్మరం

### దూసుకువస్తున్న క్షిపణులు, డ్రోన్‌లు

### దాదాపు 100 మంది మృతి

### అమెరికాపై తెగబడితే తీవ్ర పరిణామాలంటూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

**టెహ్రాన్,జూన్ 15:** ఇజ్రాయెల్ ఇరాన్ మూడోరోజు కూడా పరస్పరం భీకరంగా దాడులు చేసుకుంటున్నాయి. నెతన్యాహు సేనలు దాడుల తీవ్రతను మరింత పెంచాయి. మూడో రోజు ఇరాన్ ఇంధన పరిశ్రమ, రక్షణ కార్యాలయం లక్ష్యంగా క్షిపణులతో విరుచుకుపడ్డాయి. తాజాగా టెహ్రాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లో నలుగురు మృతిచెందారు. 3 రోజులుగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో 80మంది మృతి చెందినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలే లక్ష్యంగా రెండ్రోజుల క్రితం ఇజ్రాయెల్ ప్రారంభించిన దాడులు మూడో రోజు కూడా కొనసాగుతున్నాయి. ఇరుదేశాలు పరస్పరం భారీఎత్తున క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకుంటున్నాయి. టెహ్రాన్‌నగరం పేలుళ్ల శబ్దాలతో దద్దరిల్లింది. ఇరాన్ క్షిపణులు గలీలి రీజియన్‌లో ఓ అపార్‌మెంటును తాకినట్లు ఇజ్రాయెల్ అత్యవసర విభాగం అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో నలుగురు చనిపోయినట్లు తెలిపారు. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలకు ఇంధనం సరఫరాచేసే కేంద్రాలే లక్ష్యంగా దాడులు >>2



## ఎపిలోనూ త్వరలో ఫిలిం అవార్డులు

### ప్రభుత్వ కార్యక్రమాలకు సినీ పరిశ్రమ ప్రాధాన్యత ఇవ్వాలి: దిల్ రాజు

2లో



ఆదివారం కేరళలోని కొల్లం జిల్లాలో జరిగిన 'ఒచిరా కాలీ' వేడుకల దృశ్యం



ఆదివారం లక్నోలో ఓ సమావేశంలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# అమేథిలో ఘోర ప్రమాదం

## పికప్‌వాన్‌ను ఢీకొన్న అంబులెన్స్

### ఐదుగురు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

**అమేథి,జూన్ 15:** ఉత్తరప్రదేశ్‌లోని అమేథిలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో ఐదుగురు చని టపోయారు. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై జరిగిన ఈప్రమాదంలో మరొకరు గాయ పడ్డారు. లక్నోనుంచి ఘాజిపూర్ బీహార్‌కు మృతదేహాలను తీసుకెళుతున్న ఒక అంబు లెన్స్ వాహనం ఈ ప్రమాదానికి గురయింది. షుకుల్‌బజార్‌పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈప్రమాదంలో తీవ్ర గాయాలపాలయిన వారిని ఆసుపత్రులకు తరలించారు. అంబు లెన్స్ వాహనం ఒక పికప్ వ్యాన్‌ను ఢీకొనడం వల్లనే ఈ ప్రమాదం సంభవించింది. అంబు లెన్స్ డ్రైవర్‌తోపాటు వాహనంలో ఉన్న ఐదుగురు చనిపోయారు. అమేథి ప్రమాదంపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన సంతాపంప్రకటించారు.

# ఢిల్లీలో కూలిన 100 అడుగుల మొబైల్ టవర్!

**న్యూఢిల్లీ,జూన్ 15:** నగరంలోని సఫ్దర్‌జంగ్ ఎంక్లేవ్‌వద్ద ఉన్న బి-2 బ్లాక్‌వద్ద 100 అడు గుల ఎత్తయిన మొబైల్ టవర్ కుప్పకూలింది. సంపన్నులు నివాసం ఉండే ఈ ప్రాంతంలో ఆదివారం ఉదయం కురుస్తున్న భారీ వర్షాలకు ఈ టవర్ కూలినట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు జరిగిన ఈసంఘటనలో ప్రజలెవ్వరూ రోడ్లపైకి రాకపోవడం వల్ల అందరూ ఇళ్లలోనే ఉండే సమయం కావడంవల్ల పెనుప్రమాదం తప్పిందని చెపుతున్నారు.

# పొగాకు రైతుకు కేంద్రం అండ

>> టొబాకో బోర్డు ద్వారా నియంత్రించేలా చట్టసవరణ చేయాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను సిఎం చంద్రబాబు కోరారు. ఆయిల్ పాం దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించడంపై పునరాలోచన చేయాలని పీయూష్ గోయల్‌ను చంద్రబాబు కోరారు. దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రాష్ట్రంలోని పామాయిల్ రైతులకు సరైన ధర రావడం లేదని.. తీవ్రంగా నష్టపోతారని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం.. కేంద్రం నిర్దేశించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ లక్ష్యాలకు కూడా ఇబ్బందికరంగా ఉంటుందనే విషయాన్ని సిఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల విషయంలో ఆ దేశంతో చర్చలు జరపాలని సిఎం చంద్రబాబు సూచించారు. సీఫుడ్‌పై అమెరికా విధించిన 27 శాతం సుంకాలు ఏపీలోని 8 లక్షల మంది ఆక్వా రైతులపై ప్రభావితం చూపుతోందని సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఎపి ఆక్వా రైతులపై ఈ భారాన్ని తగ్గించేలా చొరవ తీసుకోవాలని, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ని సిఎం చంద్రబాబు కోరారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్టు పీయూష్ గోయల్ కు సిఎం చంద్రబాబు తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఎపి ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఆ దిశలో చర్యలు తీసుకుంటామన్నారు.పొగాకు రైతుకు కేంద్రం అండగా ఉంటుందని తెలిపారు. భేటీకి ముందు కేంద్రమంత్రి పియూష్ గోయల్ సీఎం చంద్రబాబు ఇంట్లో భోజనం చేసారు. అనంతర విరామ సమయంలో కేంద్రమంత్రిని సిఎం చంద్రబాబు ఘనంగా సన్మానించారు.ఆయనకు ఎపి ప్రభుత్వం తరపున జ్ఞాపికను అందజేసారు.

# పటిష్టంగా కరకట్టలు

>> నైసర్గిక స్వరూపం,మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బ్యారేజీ వద్ద ఎప్పుడైనా 15.60 లక్షల క్యూసెక్కుల వరద రాగా,అదంతా ఎగువనున్న నాగార్జునసాగర్ నుంచి వచ్చిందే. సాగర్‌కు దిగువున పులిచింతల,ప్రకాశం బ్యారేజీ మధ్యనున్న వాగులు,వంకల్లోంచి అప్పట్లో పెద్దగా ప్రవాహం లేదు. ఈ స్థానిక వాగులు,వంకల పరీవాహకంలో ఇంత వరకు గరిష్టంగా 4,20,000 క్యూసెక్కుల వరద వచ్చినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అంటే సాగర్‌కు ఎగువన కృష్ణాలో వచ్చే 11.10 లక్షలు,దిగువనున్న మూసీ,పాలేరు,మునేరు,బుడమేరు తదితర వాగుల ద్వారా తోడయ్యే 4.20 లక్షల క్యూసెక్కులు ఇతరత్రా కలిపి మొత్తంగా 15.60 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరద ఎప్పుడైనా రావొచ్చన్నది జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ప్రకాశం బ్యారేజీని 11.90 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా నిర్మించారు. గరిష్ట నీటిమట్టం 22.12 మీటర్లు (72.60 అడుగులు).అయితే,ఇక్కడున్న పరిస్థితుల దృష్ట్యా 11.90 లక్షల క్యూసెక్కుల వరదనుకూడ నియంత్రించవచ్చన్నది జలవనరుల శాఖ అభిప్రాయం. అత్యధిక వరద తట్టుకోవాలంటే బ్యారేజీని ఆధునీకరించడంతో పాటు కరకట్టల సామర్థ్యం పెంచాల్సి ఉంటుంది.బ్యారేజీకి,పైన ఉన్న వంతెనకు మధ్య 9 అడుగుల మేర ఖాళీ ఉంది. గేట్లు ఎత్తే హాయిస్టింగ్ వ్యవస్థను మరో 2 మీటర్లు పైకి లేపాలన్నది ప్రణాళిక. ఇందుకు రూ.86 కోట్లు ఖర్చవుతుందని అంచనా.తద్వారా బ్యారేజీపై ఒత్తిడి పడకుండా మరింత వరదను దిగువకు వదిలేయవచ్చు.బ్యారేజీతో పాటు 335 కి.మీ పొడవునా కుడి,ఎడమ కరకట్టల సామర్థ్యాన్ని 15 లక్షల క్యూసెక్కులు తగినట్లుగా పటిష్ట పరచాలి. వాటి ఎత్తు 8 అడుగులకు పెంచాలి. వెడల్పు కూడ పెంచడంతో పాటు పైన రహదారిని 7.5 మీటర్లకు విస్తరించాలి. ఈ పనులకు సుమారు రూ.8,300 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తోంది.

## నీట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సిఎం అభినందనలు

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** నీట్ (యూజీ-2025)లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అద్భుతంగా రాణించారన్నారు. దేశవ్యాప్తంగా 18వ ర్యాంకు సాధించిన తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్‌సాయి కుమార్, 19వ ర్యాంకు సాధించిన ఎపికి చెందిన దర్బా కార్తీక్‌రామ్‌లకు అభినందనలు తెలిపారు. మీ కృషి ఫలించిందని, వైద్య వృత్తి కలను నెరవేర్చుకోవాలనుకునే కోరుకున్న వారందరికీ ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.

# హెలికాప్టర్

>> బయలుదేరింది. గౌరీ కుండ్ అడవులకు దాదాపు 5 కి.మీ ఎగువ ఉన్న కొండ ప్రాంతానికిచేరుకోగానే అది కూలిపోయింది. మహారాష్ట్రలోని వణికి చెందిన మాజీ ఎమ్మెల్యే విశ్వాస్ నందేకర్ ఈవిషయాన్ని విలేకరులకు తెలియజేశారు. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసే రాజ్ కుమార్ జైస్వాల్ ఫ్యామిలీ ఈనెల12న యావత్మల్ నుంచి కేదార్‌నాథ్‌కు బయలుదేరి వెళ్లిందని అని ఆయన చెప్పారు. ఈ ప్రమాదంలో చనిపోయిన ఏడుగురిలో నలుగురు భక్తులతో పాటు శిశువు, హెలికాప్టర్ పైలట్, బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ ఉద్యోగి ఉన్నారు. ఈ ప్రమాదంలో చనిపోయిన హెలికాప్టర్ పైలట్ పేరు రాజ్‌వీర్ సింగ్ చౌహాన్ భారత ఆర్మీలో దాదాపు 15 ఏళ్లకుపైగా సేవలు అందించారు. హెలికాప్టర్ నడపడంలో మంచి అనుభవం ఉంది. దట్టమైన పొగమంచు వల్ల పైలట్‌కు మార్గం సరిగ్గా కనిపించక ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ విభాగం అధికారి నందన్ సింగ్ చెప్పారు.

# కూలిపడిన వంతెన

>> రక్షణ కార్యకలాపాలు ప్రారంభించినట్లు ఫడ్నవిస్ ట్వీట్‌చేసారు. పూణె, పింప్రి చించ్‌వాడ్‌ప్రాంతాల్లో ఇప్పటికే ఆరంజ్ అలర్ట్ జారీ అయింది. ఒకమోస్తరునుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఘాట్‌ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ కూడా హెచ్చరించింది. వంతెన భద్రతపైనా, వంతెన పటిష్టతపైనా స్థానికులు ఆందోళన వ్యక్తం చేసారు.

నాలుగైదేళ్లక్రితం ఈ వంతెనను ఆధునీకరించారని, అయితే ఎక్కువమంది పర్యాటకులు ఈ వంతెన పరిస్థితి తెలియకనే పైకి వచ్చారని స్థానికులు చెపుతున్నారు. ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెన 30 ఏళ్లక్రితం నిర్మించారు. ఇది కేవలం కాలినడకకు మాత్రమే ఉపకరిస్తుంది. ప్రమాదం సమయంలో సుమారు 100 మందికిపైగా ఉన్నారు. వారిలో కొందరు ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారు.

## వారం - వర్జ్యం

తేది : 16-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
పంచమి మ.3.28
ధనిష్ఠ రా.1.11
వర్జ్యం ఉ.8.29-ఉ.9.55
దు.మ.12.35-1.27, 2) మ.3.13-సా.4.05
శుభముహూర్తం : ఉ.5.15-5.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగావకాశాలు పొందుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం :** సంతానం నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**మిథునం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**కర్కాటకం :** పారిశ్రామిక, కళారంగాలవారికి ప్రభుత్వం నుండి కీలక సమాచారం అందుతుంది.

**సింహం :** ఉద్యోగులకు అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**కన్య :** సన్నిహితుల నుండి ఆహ్వానాలు అందుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు.

**వృశ్చికం:** రాజకీయ, కళ, పారిశ్రామిక రంగాలవారికి కొంత అనుకూలంగా వుండును.

**ధనుస్సు:** ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తారు. వాహనయోగం.

**మకరం:** ఆరోగ్యం, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కుంభం :** మీ మాటకు విలువ పెరుగుతుంది. బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకొంటారు.

**మీనం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి - వ్యాపారాలు విస్తరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## కూర్మ గ్రామం అగ్ని ప్రమాదంపై పోలీసులు

# లోతైన విచారణ చేయాలి

## డిసిఎం పవన్ కల్యాణ్ ఆదేశం

**విజయవాడ,జూన్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లా హిరమండలం కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతైన విచారణ చేయాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు.ఈ మేరకు డి సిఎంవో నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలన్నారు. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ధార్మిక సంస్థలకు, ఆలయాలకు ఇబ్బందులు కలిగిస్తే సహించమని, అరాచక శక్తులను అణచివేస్తామని హెచ్చరించారు.భక్తుల మనోభావాలను దెబ్బతీసి, సున్నిత పరిస్థితులను రెచ్చగొట్టాలంటే సహించమన్నారు. కూర్మ గ్రామ ఘటనపై విచారణ అనంతరం ఎవ్వరైన అందుకు బాధ్యులని గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# మరో 2 స్పేస్ పార్కులు

>> డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్, లేబర్ ఇంటెన్సివ్ మాన్యుఫాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. వచ్చే 7 ఏళ్లలో ఐటీ రంగంలో కనీసం 4 నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరగడం లక్ష్యంగా నిర్దేశించారు. డేటా సెంటర్లు, స్టార్టప్‌లుఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 4 రైల్వే ప్రాజెక్టులతో పాటు అదనంగా 2032 కల్లా మరో 7 కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయనున్నారు. తమది కూటమి ప్రభుత్వమైనా పరిమితులేం లేవని, ఒకే మాట మీద ముందుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎంత ముఖ్యమో, అరాచకాల్ని అడ్డుకోవడమూ అంతే ముఖ్యమని చెప్పారు. ఎంతో బాధ్యతగా మంచి పనులు చేస్తున్నామని, కూటమి అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించామని తెలిపారు. అదేవిధంగా అమరావతి పనుల్ని గాడిలో పెట్టామని, రూ.11,000 కోట్ల కేంద్రసాయం తెచ్చి, విశాఖ ఉక్కును నిలబెట్టామన్నారు. అవన్నీ కూటమి ప్రభుత్వం వల్లే జరిగాయన్న విషయాన్ని గుర్తించాలని, వాటిని పట్టించుకోకుండా ఇంకా ఏమీ చేయట్లేదంటే ఎలా అని ప్రశ్నించారు. కూటమిలో మూడు పార్టీల మధ్య క్షేత్రస్థాయి వరకూ సమస్యలు లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని సీఎం పేర్కొన్నారు.

న్యుఫాక్చరింగ్ నోడ్స్, పోర్టులకు అనుకూలించేలా కొత్తగా 9 రోడ్డు ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఎవరి విద్యుత్ వాళ్లే ఉత్పత్తి చేసుకుంటే విద్యుత్ సరఫరా నష్టాలు అనేవి ఉండవని సిఎం అభిప్రాయపడ్డారు. ఇవి వాహనాలకు అందరూ మళ్లితే రవాణా ఖర్చులు కూడా పూర్తిగా తగ్గిపోతాయన్నారు. సోలార్, విండ్ పవర్‌తో పాటు పంప్డ్ ఎనర్జీ, బ్యాటరీ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఇందుకుతగ్గ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆశయం నెరవేరేందుకు నీతి ఆయోగ్ సహకారం కూడా కోరారు.

## యోగాను జీవితంలో భాగం చేసుకుందాం: చంద్రబాబు

**విజయవాడ జూన్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచానికి భారత దేశం ప్రసాదించిన దివ్య వరం యోగా అని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆరోగ్యాన్నే కాకుండా ఆయుష్షును పెంచే యోగా మన జీవన విధానం కావాలి. ఈ నెల 21న విశాఖపట్నంలో 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. రండి మీరు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనండి. యోగాను జీవితంలో భాగం చేసుకుందాం. ఆరోగ్యంగా జీవిద్దాం అని సిఎం పిలుపునిచ్చారు.

## నా మెంటార్, బాస్ మా నాన్నే: మంత్రి లోకేశ్

**విజయవాడ జూన్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** మంత్రి నారా లోకేశ్ తన తండ్రి, సిఎం చంద్రబాబుకు ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. నాకు స్ఫూర్తి , మెంటార్, మార్గదర్శి, బాస్ మా నాన్నే. హ్యాపీ ఫాదర్స్ డే నాన్న అని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో కలిసున్న ఓ ఫోటోను షేర్ చేశారు.

# 'విలువల విద్య' పుస్తక పంపిణి

>> ఏడో తరగతిలో నిషిద్ధం,దృష్టికోణం,సుజనుడు,కుటుంబ విలువలు,దివ్యాంగులకు చేయూత,ధృఢచిత్తం పాఠాలను పెట్టారుఆరో తరగతిలో సాయం చేద్దాం,యోగ్యతకే అధికారం,సాటిలేని మేటి, నడత, గుణము, చిన్ననాటి పాఠాలు తీసుకొచ్చారు.లింగ సమానత్వం,రాజ్యాంగం పుస్తకాలు సిద్ధం చేసారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులకు ఈ ఏడాది లింగ సమానత్వం, రాజ్యాంగంపైనా పుస్తకాలు అందించనున్నారు. వ్యవసాయ పనుల్లో మహిళల భాగస్వామ్యం, ఇంటి పనుల్లో మహిళలకు పురుషుల సాయం లాంటి వాటిని లింగ సమానత్వం పుస్తకాల్లో తీసుకురానున్నారు. బాల్య వివాహాలపై పిల్లలకు అవగాహన కల్పించేలా పాఠ్యాంశాన్ని తీసుకొస్తున్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధుల్లాంటి అంశాలతో మరో పుస్తకాన్ని తీసుకొస్తున్నారు. పిల్లల్లో నైతిక విలువలు,ప్రశ్నించే తత్వం,సమాజం పట్ల అవగాహన కల్పించేలా మూడు పుస్తకాలను తీసుకొస్తున్నారు.

# ఎపిలోనూ త్వరలో ఫిలిం అవార్డులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్15:** ప్రభుత్వాలు నిర్వహించే సినిమా అవార్డుల కార్యక్రమాలకు చిత్ర పరిశ్రమ ప్రముఖులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు సూచించారు. శనివారం అట్టహాసంగా జరిగిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం విజయవంతమైన నేపథ్యంలో, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఆయన ఆదివారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్ర పరిశ్రమ ప్రభుత్వంతో కలిసి ప్రయాణించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ప్రకటించనుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుతున్నాయంటే, వాటిని ఎంతో గౌరవంగా స్వీకరించాలని సూచించారు. ఎక్కడ ఉన్నా, షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా సరే, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రభుత్వంతో కలిసి ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వాళ్లందరిపైనా ఉందన్నారు. 'ఇకపై ప్రభుత్వం తరఫున అవార్డుల వేడుక ప్రకటన వచ్చినప్పుడు, దయచేసి మీ డైరీలలో ఆ తేదీని నోట్ చేసుకోండి. మీకు వచ్చిన అవార్డును తప్పకుండా స్వీకరించండి. ఇది చిత్ర పరిశ్రమకు నా వ్యక్తిగత విజ్ఞప్తి. అందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అని దిల్ రాజు అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక ఎంతో ఘనంగా జరిగిందని, ఇందుకు ఆనందంగా ఉందని దిల్ రాజు అన్నారు. మొదట 2024 చిత్రాలకే పురస్కారాలు ఇవ్వాలని అనుకున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి అవార్డులు ఇస్తే బాగుంటుందని పలువురు సూచించడంతో ఆ దిశగా కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఏటా మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం సవాలుతో కూడుకున్న పని అని ఆయన వివరించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గంట సమయం కేటాయించినప్పటికీ, కార్యక్రమ ప్రణాళిక నాలుగున్నర గంటలు ఉండటంతో, తాను వ్యక్తిగతంగా ముఖ్యమంత్రిని కలిసి, కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉండాలని కోరినట్లు దిల్‌రాజు తెలిపారు. ఈ పురస్కారాల వేడుకకు మార్గనిర్దేశం చేసిన డి.సిఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఇరాన్, ఇజ్రాయెల్ హోరీహోరీ

>> చేసినట్లు ఇరాన్ మిలిటరీకి చెందిన రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొంది.ఇజ్రాయెల్‌పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించినట్లు ఇరాన్ ప్రకటించింది. ఆదివారం జరిపిన క్షిపణి దాడిలో హాజ్ ఖాస్సేం గైడెడ్ బాలిస్టిక్ మిసైల్‌ను వినియోగించినట్లు తెలిపింది. ఇరాన్ రక్షణమంత్రి అజీజ్ నసీర్‌జాదా మాట్లాడుతూ తమవద్ద సరికొత్త బాలిస్టిక్ మిసైల్ సిద్ధమైనట్లు ప్రకటించారు. అది అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించగలదన్నారు. ఈ సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లు అని ఇరాన్ పేర్కొంది. దీని వార్ హెడ్ తన గమనాన్ని మార్చుకోగలదని అందుకే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదిస్తుందని వెల్లడించింది. దీనికి ఖుద్స్ ఫోర్స్ జనరల్ ఖాసిం సులేమానీ పేరు పెట్టినట్లు తెలిపింది. ఇరాన్‌కు చెందిన ఇంధనపరిశ్రమ, రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం, అణుశుద్ధి కార్యక్రమాలతో సంబంధాలు కలిగిన వారిని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దాడులు చేపట్టింది. అయితే ఇరాన్‌లో ఎంతమంది చనిపోయారనే సమాచారం లేదు. కానీ టెహ్రాన్ తగులబడుతోందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్‌అమెరికా మధ్య ఒమన్‌లో ఆదివారం జరగాల్సిన చర్చలు రద్దయ్యాయి. దీంతో రెండ్రోజుల క్రితం ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య మొదలైన దాడులు ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించటం లేదు.

**ఇరాన్ గగనతలంపై పూర్తి పట్టు సాధించాం: ఇజ్రాయెల్**

ఇరాన్‌పై భారీ వైమానిక దాడుల అనంతరం, టెహ్రాన్ గగనతలంపై తమకు పూర్తి స్వేచ్ఛ లభించిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ రాజధాని ఇకపై తమ దాడుల నుంచి తప్పించుకోలేదని, ఆ నగరం ఇప్పుడు తమ లక్ష్యాలకు బహిర్గతమైందని ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) స్పష్టం చేశాయి. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసేలా ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ అతిపెద్ద దాడుల్లో ఒకటి నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో 70కి పైగా యుద్ధ విమానాలు పాల్గొన్నాయని ఐడీఎఫ్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ తెలిపారు. రెండున్నర గంటలకు పైగా సాగిన ఈ దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమాన్ని, కీలక సైనిక, క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆయన వివరించారు. సుమారు 40 ప్రాంతాలపై దాడులు జరిగాయని, వీటిలో ఇరాన్ వాయు రక్షణ వ్యస్థలు, వాటికి సంబంధించిన ఆస్తులు కూడా ఉన్నాయని డెఫ్రిన్ పేర్కొన్నారు. టెహ్రాన్‌పై మా యుద్ధ విమానాలు, డ్రోన్లు స్వేచ్ఛగా సంచరించాయి. ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థల ముప్పును తొలగించడం వల్లే ఇది సాధ్యమైంది. ఇరాన్ అంతర్భాగంలో ఇజ్రాయెల్ వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటివరకు చేపట్టిన అత్యంత లోతైన ఆపరేషన్ ఇదే" అని డెఫ్రిన్ అన్నారు. టెహ్రాన్ ఇకపై సురక్షితం కాదు; ఇజ్రాయెల్ దాడులకు ఆ నగరం పూర్తిగా అందుబాటులోకి వచ్చిందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతమైందని ప్రకటించిన ఐడీఎఫ్, ఇరాన్ సైనిక, అణు సామర్థ్యాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఈ ప్రణాళికాబద్ధమైన దాడులు కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

**ఊహకందని స్థాయిలో ప్రతిస్పందిస్తా: ట్రంప్ హెచ్చరిక**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడుల్లో అమెరికా ప్రమేయం లేదని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అయినా లెక్కచేయకుండా అమెరికాపై దాడికి తెగబడితే.. తమ సాయుధ దళాలు మునుపెన్నడూ కనీవినీ ఎరుగుని స్థాయిలో.. టెహ్రాన్‌పై విరుచుకుపడతాయని హెచ్చరించారు. ఇరాన్ ఏ రూపంలో దాడి చేసినా తాము పూర్తి శక్తితో వాటిని తిప్పి కొడతామన్నారు. టెహ్రాన్-టెల్‌అవీవ్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడం తనకు చాలా ఈజీ అని ట్రంప్ పేర్కొన్నారు. తాను తలుచుకుంటే ఈ సంఘర్షణను వెంటనే ముగించగలనని తెలిపారు.

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పూర్తిగా నాశనం కాకముందే తమతో అణు ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ ఇప్పటికే టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఈ మారణ హోమం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో ఏమీ మిగలదన్నారు. ఒకప్పుడు ఇరానియన్ సామ్రాజ్యంగా పేరొందిన దేశాన్ని కాపాడుకోవాలంటే అక్కడి పాలకులు ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రరాజ్యంతో చర్చలు అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఒకవైపు తమపై దాడులకు మద్దతునిస్తూ.. మరోవైపు అణు ఒప్పందంపై చర్చలకు ఆహ్వానించడం సరికాదని అన్నారు. తాము ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యుకె, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌కు సహకరిస్తే ఆయా దేశాలకు చెందిన స్థావరాలపై దాడులు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు.కొద్దిరోజులుగా ఇరాన్, అమెరికా మధ్య అణుఒప్పందం కోసం ఒమన్ మధ్యవర్తిత్వంలో చర్చలు జరుగుతున్నాయి. దీనిపై ఇప్పటివరకు ఇరు దేశాల మధ్య 5 భేటీలు జరిగినప్పటికీ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఒమన్‌లో ఆదివారం జరగాల్సిన ఆరో విడత చర్చలను రద్దు చేసుకున్నారు.

# ఉచిత పంటల బీమాతో రైతులకు ప్రయోజనం

## - మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** ఉచిత పంటల భీమా అమలు ద్వారా రైతు వాటా రూపంలో ఏడాదికి ప్రభుత్వంపై పడే అదనపు భారం రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్లు మాత్రమేనని వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. దీనివలన 50 లక్షల రైతు కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

చిన్న,సన్నకారు రైతులపై ప్రీమియం భారం తగ్గుతుంది. సాగుచేసిన ప్రతి ఎకరానికీ భీమా ఉందనే భరోసా లభిస్తుంది. గత ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో కూటమి ప్రభుత్వం 2024-25 రబీ నుంచి ఉచిత పంటల భీమాను పక్కన పెట్టింది. 2019 ఎన్నికల సమయంలో టిడిపి, వైకాపాలు...తాము వస్తే ఉచిత పంటల భీమా అమలు చేస్తామని ప్రకటిం చాయి. గెలిచిన వైకాపా.. ప్రతి ఎకరానికీ అమలు చేస్తామని చెప్పి.. సగంమంది రైతులకు అన్యాయం చేసింది. రాష్ట్రంలో 69% రైతులు రెండున్నర ఎకరాల లోపు వారే. ఐదెకరాలలోపు రైతుల సంఖ్య 75.50 లక్షలు...అంటే 88% మంది రైతులు అన్న మాట.90% మంది సాగుకు అప్పులే ఆధారం...అందువల్ల చేతిలో నగదు లేక ప్రీమియం చెల్లించలేరు. ఇలాంటి రైతుల కోసం ప్రభుత్వమే భీమా అమలు చేస్తే...వీరికి ఊరట లభిస్తుంది. ఒక సంస్థలో పనిచేసే వ్యక్తి తనకో, కుటుంబానికో భీమా తీసుకుంటే చెల్లించాల్సిన ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. అదే సంస్థలో పనిచేసే వారందరికీ కలిపి గ్రూపుగా తీసుకుంటే ప్రీమియం తగ్గుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా యూనివర్సల్ పంటల భీమా అమలు చేస్తే ప్రీమియం తగ్గుతుంది.ఇక పోతే ఒక జిల్లాలో కనీసం 5 వేల ఎకరాల్లో (వరుసగా మూడేళ్లు) సాగైతేనే ఆ పంటకు భీమా వర్తింపజేస్తారు. 26 చిన్న జిల్లాలు కావడంతో విస్తీర్ణం అంత ఉండటం లేదు. పంట 5వేల ఎకరాలలోపు ఉంటే భీమా వర్తించదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. వాటిని పరిగణనలోనికి తీసుకుంటామని మంత్రి అచ్చెన్ననాయుడు తెలిపారు.రైతు స్వయంగా రైతు సేవా కేంద్రానికి వెళ్లి వ్రేలిముద్ర వేసి నామమాత్ర రుసుము (సుమారు ఎకరానికి రూ.100)తో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలి. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్,రబీల్లోకలిపి సుమారు 1.50కోట్లఎకరాల్లో పంటసాగుచేస్తారనిఅంచనా. 2022-23లో ఉచితభీమా అమలు చేసినప్పటికి ప్రీమియం చూస్తూ ఖరీఫ్,రబీ కలిపి రైతు,రాష్ట్ర వాటా రూ.1,500 కోట్లుగా ఉంది. కేంద్ర వాటా రూ.350 కోట్లు కలిపినా మొత్తం రూ.1,850 కోట్లు మాత్రమే. దీన్ని మరింత విస్తరించి...సాగు చేసినప్రతి ఎకరానికీఅమలుచేసినా రూ.2,500 కోట్లకు మించదు. అన్న దాతా సుఖీభవ రూపంలో ఏడాదికి సుమారు రూ.7వేల కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెడుతోంది. రైతులకోసం మరో రూ.700 కోట్లభారం పడుతుంది. కూటమి దీనిపై పునరాలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

# రోజుకు 2.5లక్షల మందికి అన్నప్రసాదం

## ఒకరోజుకు రూ.44లక్షలు



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశవిదేశాల నుండి వస్తున్న భక్తులకు తిరుమల,తిరుపతిలో కలిపి రోజుకు సరాసరి 2.50లక్షలమంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు. లక్షలాదిమంది భక్తులకు రుచిగా,శుచిగా నాణ్యతతో కూడిన పదార్థాలతో అన్నప్రసాదాలను తిరుమల తిరుపతి దేవస్థానం అందిస్తోంది. భక్తుల రద్దీ,అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తుల సంఖ్య కూడా పెరగడంతో అవసరమైన మేరకు దాతలైన భక్తుల కోరిక మేరకు అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఒకరోజు విరాళ పథకం ప్రారంభించిన విషయం విదితమే.

**అన్నప్రసాద వితరణకు విరాళాల వివరాలు:** ఏడ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు వడ్డించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. అంతేగాక పుట్టినరోజు, వివాహవార్షికోత్సవం, ఇతరత్రా ప్రాధాన్యత రోజుల్లో దాతలైన భక్తులు తమ పేరున భక్తులకు అన్నప్రసాద వితరణ చేసే అవకాశం కల్పించారు. ఇందుకు ఒకరోజు పూర్తిగా 44లక్షలు రూపాయలు విరాళం అందించాల్సి ఉంటుంది. ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపాయలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు. విరాళం అందించిన దాత పేరును మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రదర్శిస్తారు. దాతలు కోరిక మేరకు వారే స్వయంగా ఒకరోజు ఇక్కడ అన్నప్రసాద వితరణ చేయొచ్చు. తిరుమలకొండకు వచ్చిన భక్తులు ఆకలి అనేది తెలియకుండా అక్షయపాత్రలా వచ్చిన ప్రతి ఒక్క భక్తుడికి రుచిగా అన్నప్రసాదాలు మాతృశ్రీ తరిగొండ వెంగ మాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక మరికొన్నిప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు.

**తిరుమలలో అన్నప్రసాదాలు ప్రాంతాలు:** దేశవిదేశాల నుండి ఏడుకొండలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు తిరుమలలో రుచిగా, శుచిగా పలు ప్రాంతాల్లో అన్నప్రసాదాల కౌంటర్లు ఏర్పాటుచేసి పంపిణీ చేస్తున్నారు. మాతృశ్రీ వెంగమాంబ అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1,2,లోని కంపార్టుమెంట్లు, వృద్ధులు,దివ్యాంగులు వేచి వుండే కాంప్లెక్స్, 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన కంపార్టుమెంట్లు, ప్రదాన కల్యాణకట్టలో టీ,కాఫీ, పాలు అందిస్తున్నారు. అన్నప్రసాద భవనంలో ఉదయం 8.30గంటల నుండి 10.30గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ,తిరిగి సాయంత్రం 5గంటల నుండి రాత్రి 11గంటల వరకు చక్కెరపొంగలి, చట్నీ,అన్నం, కూర,సాంబారు, రసం,మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. అన్నప్రసపాదాల తయారీకి రోజుకు 14నుండి 16.5టన్నుల బియ్యం, 6.5 టన్నుల నుండి 7.5టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు. తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం, శ్రీనివాసం వసతిసముదాయం, విష్ణునివాసం కాంప్లెక్స్‌లు,రుయా ఆస్పత్రి, స్విమ్స్, ప్రసూతి ఆస్పత్రి,బర్డ్, ఎస్వీయూ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాలు అందిస్తున్నారు.



## నేరాలు చేసి తప్పించుకోలేరు: హోం మంత్రి అనిత

### మాజీ సీఎం జగన్ కుట్రలు సాగనివ్వం

విజయవాడ,జూన్ 15,ప్రభాతవార్త ప్రతినిధి: వైకాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్‌రెడ్డి రాజకీయాల ముసుగులో ఉన్న నేరాలు ప్రోత్సహిస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు.ఏ ముసుగు వేసుకున్నా,చేసిన నేరాల నుంచి తప్పించుకోలేరన్నారు. కూటమి హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ఆయన ఓర్చుకోలేకపోతున్నారని. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించాలని చూస్తున్న ఆయన కుట్రలు సాగనివ్వబోమని హెచ్చరించారు. పొదిలిలో జగన్ పర్యటన నేపథ్యంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలు,పోలీసులపై వైకాపా కార్యకర్తల రాళ్ళదాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. 'కిలో పొగాకు ధర కూడ తెలియకుండా రైతుల పరామర్శకు వెళ్ళిన జగన్ మానసికస్థితి అర్థం చేసుకోవాలి.అమరావతి మహిళల గురించి కొందరు చేసిన అసభ్యకర వ్యాఖ్యల్ని ఆయన సమర్థించడం సిగ్గుచేటు. కొమ్మినేని శ్రీనివాసరావును నిర్దోషిగా విడుదల చేయలేదు. షరతులతో కూడిన బెయిలు మీదే ఆయన్ను వదిలిపెట్టారని జగన్‌గుర్తుంచుకోవాలి' అని అనిత పేర్కొన్నారు.

## గుంతకల్లు రైల్వే డివిజన్ సమస్యలు పరిష్కరించండి

### నేడు తిరుపతిలో పర్యటించనున్న దక్షిణకోస్తా రైల్వే జిఎం మాధుర్



జిఎం మాధుర్

**గుంతకల్లు రైల్వే, జూన్ 15,ప్రభాతవార్త:** రాష్ట్ర విభజన జరిగిన దశాబ్దకాలంగా సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 2024సార్వత్రిక ఎన్నికలలో కేంద్ర,రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వాలు ఏర్పడటంతో విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. ఫలితంగా ఈ ఏడాది జనవరి 8న ప్రధాని నరేంద్రమోడీ విశాఖపట్నంలోని ముడసర్లోవ ప్రాంతంలో నిర్మించనున్న దక్షిణ కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేయడం, ఇటీవల జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథూర్‌ను నియమించడం ఆయన దక్షిణ కోస్తా రైల్వే జోన్ తొలి జీఎంగా బాధ్యతలు చేపట్టిన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో దక్షిణ కోస్తా రైల్వే జీఎం హోదాలో సందీప్ మాథూర్ సోమవారం గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని తిరుపతికి తొలిసారిగా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమకే తలమానికమైన గుంతకల్లు రైల్వే డివిజన్‌లో కీలకమైన సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోక "ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్నది" అన్న చందంగా ఉన్నాయి. విశాఖ కేంద్రంగా రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బి)ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవ స్థీకరణ చట్టం-2014ప్రకారం ఏర్పడినందున ఈ జోన్‌లో ఉద్యోగ నియామ కాలను కూడా కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిరుద్యోగులతోనే భర్తీకి చర్యలు తీసుకోవాలని సీమాంధ్ర ప్రజలు కోరుతున్నారు.

గుంతకల్లు రైల్వే డివిజన్ దక్షిణ మధ్య రైల్వేలో ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిరుద్యోగులకంటే కూడా ఇతర రాష్ట్రాల అభ్యర్థులే అధికంగా ఉద్యోగాలు పొందారు. గత మూడు దశాబ్దాలుగా(1996)నుంచి కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఉత్తరాది వారికే ఉద్యోగాలు దక్కిన విషయం జగమెరిగిన సత్యం. (ఇందుకు సంబంధించిన ఆధారాలు రైల్వే పర్సనల్ విభాగంలోనే లభిస్తాయి.) దీంతో వెనుకబడిన రాలయసీమ ప్రాంతవాసులకు దశాబ్ధాలుగా ఉద్యోగ నియామకాలలో అన్యాయమే జరుగుతోంది. కావున ఈ విషయమై ప్రత్యేకంగా దృష్టిసారించి దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పడిందే ఆంధ్రప్రదేశ్ కోసం కాబట్టి ఏపి నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే ఏపి అభ్యర్థులతోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అలాగే రైల్వే డివిజనల్ కేంద్రమైన గుంతకల్లు నుంచి జోనల్ ప్రధాన కార్యాలయం అయిన విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించేందుకు రైలు సర్వీసులను ప్రవేశపెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ తర్వాత మరుసటిరోజు సాయంత్రం అమరావతి వరకు ఒక్క రైలు లేదు. ప్రతిరోజు రాత్రి 10గంటల సమయంలో గుంతకల్లు-విశాఖ-గుంతకల్లు మధ్య ఇరువైపులా ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని డిమాండ్ ఉంది. ప్రధానమైన, అత్యంత కీలకమైన ఈ రెండు సమస్యలు కూడా కేవలం మీ పరిధిలోనివే కావున వీటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని గుంతకల్లు డివిజన్ ప్రజానీకం కోరుకుంటుంది.



## నీట్ టాపర్స్‌కు మంత్రి లోకేష్ అభినందనలు

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ యూజీ పరీక్షా ఫలితాల్లో టాప్100లో రాష్ట్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించిన వారికి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 19వ ర్యాంకు సాధించిన డి.కార్తీక్ రామ్ కిరీటి, 56వ ర్యాంకు సాధించిన కె.మోహిత శ్రీరామ్, 59వ ర్యాంకు సాధించిన డి.సూర్యచరణ్, 64వ ర్యాంకు సాధిం చిన పి.అవినాష్, 70వ ర్యాంకు సాధించిన వై.సమీర్ కుమార్, 92వ ర్యాంకు సాధించిన టి.శివమణిదీప్‌లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశస్థాయిలో నిర్వహించిన పోటీపరీక్షల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు తమ ప్రతిభతో జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. వైద్యవృత్తి ద్వారా భవిష్యత్‌లో ప్రజలకు సేవలందించాలని లోకేష్ ఆకాంక్షించారు.

## కృష్ణా తూర్పు డెల్టాకు సాగునీరు విడుదల



తూర్పు డెల్టాకు సాగునీరు విడుదల సందర్భంగా పూజలు చేస్తున్న ఎంఎల్ఏలు మండలి బుద్దప్రసాద్.యార్లగడ్డ వెంకట్రావు, బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా తూర్పు డెల్టాకు సాగునీరు విడుదల చేశారు. ఆదివారం ఉదయం విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బ్యారేజ్ వద్ద ప్రత్యేక పూజలు చేసి కాలువలకు వెయ్యి క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. పంట కాలువల్లోకి చేరుకుంటున్న సాగునీటికి పసుపు కుంకుమ, పూలు జల్లి, పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఖరీఫ్ తరుణం ఆరంభమైనందున సాగు నీటి అవసరాల దృష్ట్యా డెల్టాకు షెడ్యూల్ దృష్ట్యా నీరు విడుదల చేసినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

## పనిగంటల పెంపును వ్యతిరేకిస్తూ 20న రాష్ట్ర వ్యాప్త నిరసన

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పనిగంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా పెద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. విజయవాడ ఎంబి భవన్‌లో జరిగిన కార్మిక, ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కేంద్రాలతో పాటు, నియోజకవర్గ, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఈ సమావేశం పిలుపునిచ్చింది. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తూ కార్మిక హక్కులను హరిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పనివిధానాన్ని 10గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు మహిళలు రాత్రి వేళల్లో పని చేయవచ్చని పేర్కొనడమంటే కార్మికులను వెట్టిచాకిరి చేయించుకునే విధానానికి నెట్టివేయడమేనన్నారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జిఓ వల్ల కార్మికులు, ఉద్యోగుల్లో అభద్రతా భావం నెలకొందన్నారు. లేబర్ కోడ్ లాంటి చట్టాల వల్ల కనీస వేతనాలు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు కోల్పోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, శ్రామికమహిళా రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి, ఇప్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌భాబు, వైఎస్ఆర్‌టియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్‌రవి, సిఐటియు రాష్ట్ర నాయులు కె.ఉమామహేశ్వరరావు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రినాద్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా స్ట్రీట్ వెండర్ సర్వే

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** నగరాలు, పట్టణాల్లో రోడ్లకు ఇరువైపులా తోపుడుబళ్లు, దుకాణాలు పెట్టి కూరగాయలు, పళ్లు, పూల వ్యాపారం చేసే వారి కోసం ప్రత్యేకంగా హాకర్ జోన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రధాన నగరాల్లో కనిష్ఠంగా ఐదు, గరిష్ఠంగా ఎనిమిది హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో ఎక్కువగా ప్రారంభించే అవకాశం ఉంది. ఒక్కో జోన్‌లో దాదాపు 10 నుంచి 20 మంది వ్యాపారులకు చోటు కల్పిస్తారు. వీటి ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతలను పట్టణ స్థానిక సంస్థలు నిర్వహిస్తాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్లు, సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రస్తుతం చిరు వ్యాపారుల సర్వేను చేస్తున్నారు.

### యూపిఎస్ పెన్షన్ పథకంలో చేరాలనుకునే రైల్వే సిబ్బంది

## నెలాఖరులోగా ఆప్షన్లను ఇవ్వాలి

### డిపిఓ కో-ఆర్డినేటర్ హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్

**గుంతకల్లు రైల్వే, జూన్ 15,ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న యూపిఎస్ పెన్షన్ పథకంలో చేరులనుకునే రైల్వే సిబ్బంది తమ తమ నిర్ణీత దరఖాస్తులను ఈ నెలాఖరులోగా తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో అందచేయాలని డిపిఓ కో-ఆర్డినేషన్ హెచ్‌ఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. భారతీయ రైల్వే సహా కేం ద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలలో పనిచేస్తున్న 23లక్షల మంది సిబ్బందికి వారు పొందే వేతనంలో 50శాతం పెన్షన్‌గా పొందే కేంద్ర ప్రభుత్వ ఏకీకృత పెన్షన్ స్కీమ్(యూనిఫైడ్ పెన్షన్ పథకం) అమలు చేయనున్నట్లు ఆయన అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాదిలో ఆగస్టులో సిబ్బంది పెన్షన్ సంస్కరణల కోసం కేంద్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ టివి సోమనాథన్ అధ్యక్షతన ప్రధాని నరేంద్రమోడీ కమిటీ ఏర్పాటు చేశారని, ఈ కమిటీ వందకు పైగా ప్రభుత్వ ఉద్యోగుల సంస్థలతో సంప్రదింపులు జరిపిన పిమ్మట చేసిన సిఫారసుల మేరకు ఏకీకృత పించన్ పథకాన్ని కేంద్రప్రభుత్వం ఆమోదించిందన్నారు. పాతికేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగికి అతని సర్వీసులో చివరి ఏడాదికి ముందు ఉన్న సగటు మౌలిక వేతనంతో లెక్క కట్టి ఇందులో సగభాగం యాభై శాతం వరకు కేంద్రప్రభుత్వ సిబ్బందికి పెన్షన్‌గా నిర్ధారించనున్నట్లు ఆయన తెలిపారు. గత ఆగస్టు నాటికి గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం 15,013 సిబ్బంది ఉండగా వీరిలో 3,313మంది పాత పెన్షన్ పథకంలో కొనసాగుతుండగా, 2004జనవరి 1 తర్వాత ఎంపికైన 11,700మంది సిబ్బందికి 2025ఏప్రిల్ 1నుంచి అమలులోకి వచ్చిన యుపిఎస్ పథకం ద్వారా 75శాతం మందికి లబ్ది చేకూరుతుందని వివరించారు. పదేళ్ల సర్వీస్ చేసిన సిబ్బందికి కనీస పెన్షన్‌గా రూ.10వేలు పెన్షన్ లభిస్తుందన్నారు. సర్వీసులో ఉండి మృతిచెందిన ఉద్యోగి భార్యకు 60శాతం పెన్షన్ చెల్లించడం జరుగుతుందన్నారు.


ఈ నేపథ్యంలో రైల్వే సిబ్బంది తాము నేషనల్ పెన్షన్ పథకంలోనే కొనసాగుతారా..?లేక కొత్తగా అమలులోకి వచ్చిన యుపిఎస్ పథకంలో చేరుతారా..అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. యుపిఎస్ పథకంలో చేరాలనుకునే వారు తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో నిర్ణీత దరఖాస్తులను ఈ నెల 30లోగా భర్తీ చేసి అందచేయాలని కోరారు.

# తిరుమల సమాచారం

## యేడాది అభివృద్ధిపై చర్చించుకుంటున్న ప్రజలు

### కుటుంబసభ్యులతో కలసి సినిమాలు చూసే పరిస్థితి లేదు

### గద్దర్ అవార్డు ప్రదానం శుభపరిణామం: సినీనటుడు సుమన్



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై, చేసిన అభివృద్ధిపై ప్రజలు చర్చించుకుంటున్నారని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజల మన్ననలను కూటమి ప్రభుత్వం అందుకుంటోందని సినీనటుడు సుమన్ తెలిపారు. ఒక్క ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అంధకారంలో ఉన్న ఏపిని వెలుగులోకి తీసుకువచ్చిన సిఎం చంద్రబాబు అని ఆయన కొనియాడారు. సిఎంగా చంద్రబాబు పరిపాలన దక్షుడని, దేశంలోనే బెస్ట్ సిఎం అని సుమన్ పేర్కొన్నారు. సినిమారంగం నుండి రాజకీయాల్లోకి వచ్చి ఉపముఖ్యమంత్రి హోదాలో పాలనసాగిస్తున్న పవన్‌కల్యాణ్ ప్రజలు మెచ్చిన నేతగా పనిచేస్తున్నారని అన్నారు.ఆయన చేస్తున్న ప్రజాసేవను స్వాగతిస్తున్నానని సుమన్ తెలిపారు. సినీరంగంలోని వాళ్ళు రాజకీయాల్లో రాణించగలరని ఇప్పుడు పవన్ నిరూపించారని తెలిపారు. ఎన్నోఏళ్ళ తరువాత తెలంగాణ లో గద్దర్ సినిమా అవార్డు రావడం శుభపరిణామమని, అభినందించిదగిన విషయమన్నారు. ఈ అవార్డులు ప్రదానం చేసిన తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ధన్యవాదాలు చెప్పారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య నటులు, నటీమణులు హాజరై ఉంటే బావుండేదని అభిప్రాయం తెలిపారు. ప్రేక్షకులు ఆదరించిన సినిమాలకు అవార్డులు వచ్చాయన్నారు. కుటుంబసభ్యులతో కలసి సినిమా చూసే పరిస్థితి ప్రస్తుతం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబకథా చిత్రాలు రావడం లేదన్నారు. ఆదివారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన సుమన్‌తో అభిమానులు ఫోటోలు, సెల్ఫీ దిగేందుకు ఉత్సాహంచూపారు.

## స్వామి ఆశీస్సులతో సంక్షేమపథకాలు అమలు చేస్తున్నాం

### లబ్ధిదారుల కళ్లలో ఆనందం: మంత్రి అచ్చెన్నాయుడు



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రాష్ట్రప్రజలు అన్ని విధాలా సంతోషంగా ఉండాలని రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏడాదిపూర్తిచేసుకుని, పేదలందరికీ ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందం చూడాలనేది చంద్రబాబు ఆశయమన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం వెంకన్న ఆశీస్సులు కోరానన్నారు. ఆంధ్రప్రదేశ్ ఏడాది కాలంలో అద్భుతమైన ప్రగతి సాదించిందని మంత్రి తెలిపారు.జిల్లాలో మామాడిరైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.గిట్టుబాటు ధర కూటమి ప్రభుత్వంలోనే రైతులకు లబ్ధిచేకూరేలా చేశామన్నారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## స్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

### శ్రీవారిసేవలో న్యాయమూర్తులు

**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో న్యాయమూర్తులు ఒడిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ హరీశ్‌టాన్‌డన్,జడ్జి డిక్సిట్ కృష్ణశ్రీపద్ కుటుంబంతో కలసి,తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ బిఆర్ మధుసూదన్ కుటుంబం,2025 ఐఏఎస్ బ్యాచ్ అధికారులు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## విమానాలు వెళ్తున్నా పట్టించుకోరా!?

### తిరుమలపై 'నోఫ్లయింగ్‌జోన్' అమలేదీ!

### టిటిడి,రాష్ట్రప్రభుత్వం చొరవ అవశ్యం



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల క్షేత్రంపై విమానాలు గానీ, హెలికాప్టర్లుగానీ ఎటువంటివి ఆలయంపై భాగంలో ప్రయాణించకూడదని నిబంధన ఉంది. వైఖానస ఆగమంప్రకారం తిరుమలలో ఆనందనిలయంలో వేంచేసిన ఏడుకొండల వేంకటేశ్వరుడు విమానవేంకటేశ్వరుడుగా భక్తులకు దర్శనమిస్తున్నాడు. అదేగాక హిందూపుణ్యక్షేత్రం భద్రత దృష్ట్యా శేషాచలంకొండల్లోని తిరుమలపైభాగంలో ఎటువంటి విమానాలు వెళ్ళరాదు. ఇదే నిబంధనలు గతంలో కొన్నేళ్ళు అమలయ్యాయి. ఇటీవల దశాబ్ధకాలంగా ఇవేమీ పట్టనట్లు కేంద్రవిమానయానశాఖ అనేక విమానాలు తిరుమల ఆలయం మీదుగా ప్రయాణిస్తున్నా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనేది అటు శ్రీవారి భక్తులు ఇటు ఆలయ అర్చకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి(రేణిగుంట)అంతర్జాతీయ విమానాశ్రయానికి పలు నగరాలనుండి వస్తున్న విమానాలు సంఖ్య కూడా పెరిగింది. ఈ విమానాలు రెండు మూడు వరకు రోజూ తిరమల ఆలయం మీదుగా వెళుతున్నాయి. ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుండటంతో అసలు ఆ విమానాలు ఏమిటనేది కూడా ఆందోళన కలిగిస్తున్న అంశం. తిరుపతి విమానాశ్రయం ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు కేంద్రవిమానయానశాఖ నుండి ఆదేశాలు రాకపోవడంతో యధేచ్ఛగా విమానాలు ఆలయంపై భాగంలోనే రాకపోకలు సాగిస్తున్నాయి. తిరుమల ఆలయంపై విమానాలు ప్రయాణించడాన్ని నిషేధించాలని, దీన్ని పటిష్టంగా అమలు చేయడంలో టిటిడి అధికారులు ఓ కమిటీ వేసుకుని ఢిల్లీలో మంత్రిని కలసి విజ్ఞప్తిచేయాలని శ్రీవారి భక్తుడు నవీన్‌కుమార్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. చంద్రగిరివైపు ఉన్న హోల్డింగ్ పాయింట్ మార్చితే ఆలయంపై భాగంలో విమానాలు రాకపోకలు ఆగిపోతాయని చెబుతున్నారు. తిరుమల ఆలయంపై నోఫ్లయింగ్ జోన్‌అమలు చేయాలని కోరుతున్నారు.

## మెట్లదారిలో యువకుడు గుండెపోటుతో మృతి



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలవెంకన్న దర్శనానికి కాలినడకన మెట్లదారిలో వచ్చిన అనంతపురం కల్యాణదుర్గం యువకులు జాఫర్(25) గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషాదంతో మెట్లదారిలో భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్యాణదుర్గం నుండి బంధువులతో కలసి జాపర్ కాలినడకన వస్తుండగా మెట్లు ఎక్కు తున్న సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. కుప్పకూలిపోయాడు. వెంటనే బంధువులు ఆస్పత్రికి తరలించేలోపు ప్రాణాలు కోల్పోయాడు.

## 20 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ కౌన్సిలింగ్‌కు సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. కౌన్సిలింగ్‌కు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించేందుకు ఈ నెల 20-27 ధృవపత్రాల పరిశీలనకు ఈనెల 21,-28, కోర్సులు, కళాశాలల ఎంపికకు ఐచ్ఛికాల నమోదుకు ఈ నె 25 నుంచి 30 వరకు అవకాశం కల్పించింది. జులై 1న ఐచ్ఛికాల మార్పు, సీట్ల కేటాయింపు 3న చేయనున్నట్లు వెల్లడించింది. సీట్లు పొందిన అభ్యర్థులు జులై 4 నుండి8లోపు కళాశాలల్లో చేరాలని సూచించింది.

వార్త

జీవితంలో స్వయంగా పైకి వెళ్లినవాడు వినమ్రంగా ఉంటాడు. అణుకువగా జీవించే వాడే పైకి వెళ్లగలడు.

న-జార్జిమూల్

# పౌష్టికాహారలేమిలో భారతావని!


స్వా తంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవై శాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఏనాటి నుంచో చెప్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టినవారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన పోషకవిలువలతో కూడిన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలక పెద్దలే. తల్లీబిడ్డకు పోషకాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తుంది. అందుకోసం దేశవ్యాప్తంగా కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోతే పోయారు. ఉన్న పథకాలు ఏమేరకు అర్హులకు అందుతున్నాయో అధ్యయనాలే కాదు పర్యవేక్షణ కూడా అవసరం. ఈ పర్యవేక్షణ లోపం కారణంగా కోట్లాది రూపాయల విలువైన ఈ పోషకాహారాలు పక్కదారి పడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పోషకాహార లోపం పెచ్చరిల్లిపోతుందని చెప్పొచ్చు. తాజాగా కరోనా మళ్లీ విస్తరిస్తుందనే వార్తలతో రోగనిరోధకశక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందని వైద్యనిపుణులు చెప్తున్నారు. ఇది కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో డాక్టర్లు ఈ విషయాన్ని పదేపదే స్పష్టం చేస్తున్నారు. అందుకు పౌష్టికాహారాలే ముఖ్యం. కానీ పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు కనీసం కడుపునిండా తినేందుకు కూడా నోచుకొని అభాగ్యులు కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఇటీవల ప్రపంచ ఆహార నివేదిక వెల్లడించిన సమాచారం ప్రకారం పౌష్టికాహారంతో బాధపడేవారి సంఖ్య దాదాపు ఎనభై కోట్లకు పైగా ఉంది. 2014తో పోలిస్తే ముప్ఫైశాతం అధికం. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకాహార సమస్య అధికంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిలో మూడోవంతు భారత్‌లో ఉన్నారని ప్రపంచఆరోగ్య సంస్థ గతంలో వెల్లడించింది. వాస్తవంగా భారత్‌లో పౌష్టికాహారలోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. 1975లో ఆరేళ్లలోపు పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఆనాటి కేంద్రప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధి పథకాన్ని (ఐసిడీఎ) ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం తదితర కార్యక్రమాలు ఎన్నో కొనసాగుతున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. అయినా భారత్‌లో పౌష్టికాహారలోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. 2022లో ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 121 దేశాల్లో 107స్థానంలో ఉంది. పౌష్టికాహారలోపం కారణంగా ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళల్లో, చిన్నారుల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు ముప్ఫైశాతానికిపైగా వయసుకు తగిన ఎత్తుకు పెరగడం లేదు. మరో పంతొమ్మిది శాతం ఎత్తుకు తగిన బరువు ఉండడం లేదు. ముప్ఫైరెండుశాతం లోపు పిల్లలు ఎదుగుదల లోపాన్ని ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, అసోం తదితర రాష్ట్రాల్లో ఈ పౌష్టికాహార సమస్య అధికంగా ఉన్నది. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికల నుండి యాభైఏడులోపు మహిళలలో యాభైఏడు శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాలు ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తున్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం అందించడంతో పేదలకు ఎంతో మేలు జరుగుతున్నది. గతంలో ప్రభుత్వం సబ్సిడీకింద ఇచ్చే బియ్యాన్ని కిలో ఐదు, పదిరూపాయలకు అమ్ముకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టినా కూడా కోట్లాది మందికి ఉపయోగపడుతుంది. 2030 నాటికి పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మూడువేల కోట్ల రూపాయలకుపైగా వ్యయంతో ప్రత్యేక పథకాన్ని ఒడిశా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఆ కోణంలో ఆలోచించి ప్రవేశపెడుతున్నాయి. పథకాలు, ఉద్దేశాలు అన్నీ సక్రమంగా ఉన్నా సంతృప్తికలిగించే విధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి కాగితాలకే పరిమితమవుతున్నాయి. దళారులప్రమేయం పెరిగిపోతున్నది. వాస్తవంగా చూసినా భారత్‌లో గత దశాబ్దకాలంగా ఆహారోత్పత్తులకు కొరత లేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఇలా ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా అందరికి రెండుపూటల ఆకలి తీర్చుకునేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. సమగ్రశిశు అభివృద్ధి పథకం కింది, మాతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని కాగ్ ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నది. ఇప్పటికైనా పాలకులు కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా ఉన్న పథకాల్లోని లోపాలను సవరించి పర్యవేక్షణ పెంచితే కొంతవరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుంది అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్న చిన్న పనుల వల్లనే.



వివేకానంద


# తికమక రాజకీయ ఆరోపణలతో ఒరిగేదేమిటి?

**తెలంగాణ రాజకీయాల్లో సామాన్య ప్రజలనే కాదు రాజకీయ విశ్లేషకుల మేధస్సును సైతం తొలుస్తున్న చిక్కు ప్రశ్నలివేనని చెప్పక తప్పదు. ఐతే ఓ వినూత్న రాజకీయ క్రీడగా మారిన ఈ మూడు పార్టీల మధ్య ఆరోపణలూ, ప్రత్యారోపణలతో ప్రజలకు ఒనగూడే ప్రయోజనం శూన్యమేననేది రాజకీయ విశ్లేషకుల నిశ్చితాభిప్రాయం. నిజానికి ప్రజలు విస్పష్టమైన రాజకీయ నీతితో, ప్రజారంజకమైన పాలనా విధానాలతో రాష్ట్ర ప్రజల అభివృద్ధికీ, సంక్షేమానికి రాజీలేని కృషి చేసే రాజకీయ పార్టీలే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజ కీయ పార్టీలు మెజారిటీ ప్రజల అభీష్టానికి అనుగుణంగా తమని తాము తీర్చిదిద్దుకుంటూ వారి మనస్సులను గెలవాలే తప్ప తమ ప్రత్యర్థి పార్టీలు రెండూ ఒకటై అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో సాధించేది శూన్యమేనని చెప్పక తప్పదు.**



డాక్టర్ నీలం సంపత్

ని జానికి ఎవరికి వారు తమ పార్టీ స్వంత రాజకీయవిధానంతో ఎన్నికలలో గెలిచి అధికారాన్ని చేజిక్కించుకోవడం సాధ్యం కాదనుకున్నప్పుడు భావసారూప్యత గలిగిన మరో పార్టీతో కలిసి ఎన్నికల బరిలోనిలబడడం రాజకీయాల్లో సహజంగా కనపడే ప్రయోగాత్మక ప్రక్రియగా, ఆనవాయితీగా కొనసాగుతున్నదేనని చెప్పక తప్పదు. ఐతే ఆ సాంప్రదాయానికి భిన్నంగా మూడు రాజకీయ పార్టీలు అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసంలేదా వున్న అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం తమ రాజకీయ ప్రత్యర్థులైన రెండు పార్టీలలో ఒకటి మరొకపార్టీతో కలిసి పని చేస్తున్నాయనే ఆరోపణలతో పొద్దు గడుపు తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దేశ సమకాలీన రాజకీయాల్లో ఉప్పు, నిప్పుగా కొనసాగుతున్న కాంగ్రెస్, బిజెపిలు కలిసి బిఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్నాయనే బిఆర్ఎస్ ఆరోపణల్లో నిజమెంత ? బిఆర్ఎస్, బిజెపిలు కలిసి కాంగ్రెస్‌పై రాజకీయ దాడులు చేస్తున్నాయనే కాంగ్రెస్ వాదనల్లో నిజమెంత? కాంగ్రెస్, బిఆర్ఎస్ రహస్య అవగాహనతో బిజెపిపై విరుచుకుపడుతున్నాయనే బిజెపి ఆరోపణల్లో నిజాయితీ ఎంత? ఇందులో ఏదినిజం ?ఏది అబద్ధం? తేలేదెలా? తేల్చాల్సిందెవరు?ఈ రోజు తెలంగాణ రాజకీయాల్లో సామాన్య ప్రజలనే కాదు రాజకీయ విశ్లేషకుల మేధస్సును సైతం తొలుస్తున్న చిక్కు ప్రశ్నలివేనని చెప్పక తప్పదు. ఐతే ఓ వినూత్నరాజకీయ క్రీడగా మారిన ఈ మూడు పార్టీల మధ్య ఆరోపణలూ, ప్రత్యారోపణలతో ప్రజలకు ఒనగూడే ప్రయోజనం శూన్యమేననేది రాజకీయ విశ్లేషకుల నిశ్చితాభిప్రాయం. నిజానికి ప్రజలు విస్పష్టమైన రాజకీయ నీతితో, ప్రజారంజకమైన పాలనా విధానాలతో రాష్ట్ర ప్రజల అభివృద్ధికీ, సంక్షేమానికి రాజీలేని కృషి చేసే రాజకీయ పార్టీలే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మెజారిటీ ప్రజల అభీష్టానికి అనుగుణంగా తమని తాము తీర్చిదిద్దుకుంటూ వారి మనస్సులను గెలవాలే తప్ప తమ ప్రత్యర్థి పార్టీలు రెండూ ఒకటై అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో సాధించేది శూన్యమేనని చెప్పక తప్పదు. రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న పార్టీ తనకున్న సంస్థాగత కారణాల దృష్ట్యా పదిహేను నెలల తర్వాత 96 మందితో జంబోపార్టీ కార్యవర్గంతోపాటు ముచ్చటగా ముగ్గురితో మంత్రివర్గ విస్తరణను పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత మిగతా మూడింటిని పూర్తిచేస్తామని ముక్తాయించినా పదవులురాని నేతలు పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో అసమ్మతి రాగాలను ఆలపిస్తున్న వారిని ఉటంకిస్తూ తమ పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఆరోప్రాణంగా భావిస్తుందని, ఈ క్రమంలో వారు వ్యక్తపరుస్తున్న భావాలను తప్పకుండా గౌరవిస్తుందనే అధినాయ కత్వపు అభిప్రాయాలు సైతం ఆహ్వానించదగినవే. మరోవైపు కేంద్రంలో అధికారాన్ని చెలాయిస్తూ రాష్ట్రంలోప్రతిపక్షపాత్రలో కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీలో కూడా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆపార్టీ రాష్ట్రఅధ్యక్ష పదవిలో సమర్థులైన వ్యక్తులను నియమించే ప్రక్రియకు సంబంధించి ఆ పార్టీనేతల నుండి భిన్న స్వరాలు వినపడుతుండడం బహిరంగ రహస్యమే. ఈ ప్రక్రియలో ప్రధాన ప్రాతిపదికగా కొన్నిప్రత్యేక అంశాలు పరిశీలనలోకి వస్తాయి. విస్తృతమైన జనాకర్షక శక్తియా?సంపన్నత, హిందుత్వభావజా లమా? సీనియారిటీనా అనే అంశాలపై అధినాయకత్వానిదే తుదినిర్ణయం కాగలదు. ఐతే ఆ పార్టీకి



సంబంధించిన ఓ సీనియర్ మోస్ట్ శాసన సభ్యుడు ఒకరు పార్టీని, నాయక త్వాన్ని టార్గెట్‌చేస్తూ పత్రికలకు లీకేజీలు ఇవ్వడమేకాకుండా అలా చేస్తున్నందుకు తన ప్రాణాలకే ప్రమాదముందని ఘోషిస్తున్న వైనంతో క్రమశిక్షణకు మారుపేరుగా భావించే ఆ పార్టీలో ముసలం పుట్టిందేమోననే భావన ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. మరో వైపు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ముందస్తు చర్యగా ఇతర పార్టీలనుండి ఈపార్టీలో చేర్చుకున్న ప్రజాదరణ కలిగిన కొత్త అభ్యర్థులు ఆది నుండి పార్టీలో కొనసాగుతున్న సీనియర్ పార్టీల అభ్యర్థుల మధ్య చిటపటలతో ఆ పార్టీకి సంబంధించిన పోటీదారులను తొక్కిపెట్టడానికి వారిపై కువిమర్శలను ఎక్కుపెడుతూ పార్టీకి కొంతమేరకు నష్టాన్ని కలిగిస్తున్నా అవివారి వ్యక్తిగత అభిప్రాయాలే తప్ప మరోటికాదు వారు సర్వదా పార్టీకి విధేయులుగానే వుంటా రంటూ ఆ పార్టీ రాష్ట్ర అధినాయకత్వం సరిపెట్టుకుని గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారాన్ని చెలా యించి మూడోసారి అధికారానికి దూరమైన భారత రాష్ట్రసమితిలోనూ నిన్నటివరకూ అధినాయకత్వం పట్ల వీరవిధేయతే తప్ప అసంతృప్తికి ఆస్కారమే లేని పరిస్థితి నెల కొంది. ఉద్యమ పార్టీగా ఆపార్టీ అధినేత అభిప్రాయాన్ని వేదవాక్కుగా భావించే ఆ పార్టీక్యాడర్‌లో ఆశ్చర్యకరంగా తొలిసారి ఆపార్టీ శాసనమండలి సభ్యురాలు, ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు తనయ ఓ వైపు పార్టీ అధినేత దేవుడంటూనే ఆయన చుట్టూదయ్యాలు ఆవరించివున్నాయంటూ చేస్తున్న తీవ్ర వ్యాఖ్యలతో ఉద్యమ పార్టీ ఒకింత ఉక్కపోతకు గురౌతుందన్న సంకేతాలు వెల్లువెత్తు తున్నాయని చెప్పక తప్పదు. ఈ నేపథ్యంలో ఆమె సంధి స్తున్న ప్రశ్నల పట్ల ఆపార్టీ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షులిద్దరు మౌనవ్రతాన్ని పాటిస్తుండడం ఆ పార్టీ శ్రేణులను ఒకింత ఆందోళనకు గురిచేస్తుందని చెప్పక తప్పదు. కేంద్ర మంత్రి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులలో కొంత మంది బి.ఆర్.యస్ పార్టీ శాసనమండలి సభ్యురాలి లేఖ ఉదంతంపై పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేస్తుండడం గమనార్హం. తమ పార్టీని బి.ఆర్.యస్‌గా మార్చినందుకే కక్షసాధింపు చర్యలోభాగంగా తమ కూతురు కవితను లిక్కర్ కుంభకోణంలో ఇరికించారని ఆ పార్టీ అధినేత బహిరంగంగా ప్రకటించడంతో పాటు ఆ తర్వాత దేశ ప్రధాని రాష్ట్రపర్యటనకు వచ్చినప్పుడు ప్రొటోకాల్ ప్రకారం ఆయనను కలవక పోవడం తెలిసినదే. ఈ నేపథ్యంలో కేంద్రంతో సయోధ్యచెడి రాష్ట్రానికి అభివృద్ధిపరంగా సమస్యలు ఎదురైనా పార్టీ శ్రేణులు సదరు చర్యను ఆమోదించక తప్పలేదు. జాతీయ స్థాయిలో ఉప్పు, నిప్పులా కొనసాగుతున్న భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్‌పార్టీల మధ్య రాజకీయ సాన్నిహిత్యముందంటూ బిఆర్ఎస్ ఆరోపిస్తోంటే బిజెపి, బిఆర్ఎస్‌ల మధ్యలోనే ఫెవికాల్ బంధం కొనసాగుతోందని మరో పార్టీ ప్రవచిస్తోంది. అందులో భాగంగానే లిక్కర్ కేసులో బి.ఆర్.యస్ యమ్.ఎల్.సి కవిత జైలు నుండి బయటకు రాగలిగిందంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలు న్యాయవ్యవస్థను కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ ప్రభావితం చేసిందనే అర్థాన్నివ్వడం బాధాకరమే. ఈ సంఘటన పై స్పందించిన న్యాయస్థానం ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. తదనంతరం పార్లమెంట్ ఎన్నికలలో నా ఓటమికి కారణం పార్టీలోనే వున్న కొన్ని దయ్యాలేనని ఆరోపణలు చేసిన కవిత తాను జైలులో వున్నప్పుడు బిజెపితో చెలిమికి బిఆర్ఎస్ చేసిన ప్రయత్నాలను నేను వ్యతిరేకించాననడం తోపాటు తాను పార్టీ అధ్యక్షుడికి ఇటీవల వ్రాసిన లేఖలో ఎలకతుర్తిలో జరిగిన పార్టీ రజతోత్సవ సభలో కె.సి.ఆర్ ఉద్దేశిస్తూ డాడీ మీరు బిజెపిపై ఎందుకు ఎక్కువ విమర్శలను చేయలేదనే ప్రశ్న బిఆర్ఎస్, బిజెపిల మధ్య ఏదో సౌహార్ద సంబంధం ఉందేమోనన్న విశ్లేషకుల అభిప్రాయం సహజమే. బి.జె.పి, బిఆర్ఎస్ పార్టీలుమూడూ ఒకరిపై ఇంకొకరు మీరు ఫలనా రాజకీయ పార్టీతో చీకటి ఒప్పందం లో భాగస్వాములుగా కొనసాగుతున్నారంటూ చేసుకుంటున్న ఆరోపణల తో ప్రజలను గందరగోళంలోకి నెట్టివేసే ప్రయత్నంచేస్తూ అందులో నుండి రాజకీయప్రయోజనాలను పొందడం కోసం తహతహలాడుతున్నారు. ●

# రైతు 'ఆత్మగౌరవం' పెంచే చర్యలు అవసరం

జి.అజయ్ కుమార్

పం టకి మద్దతు ధర లేదు, వస్త్రధారణకి గౌరవం లేదు, పెళ్లికి అంగీకారం లేదు, చివరికి ప్రాణానికి విలువ లేదు. మట్టిపై మమకారంతో జీవితాంతం బ్రతికే రైతు చివరికి ఆ మట్టిలో కలిసే దాకా అయినా ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం అందరి బాధ్యత. స్వేదాన్ని ఆయుధంగా మార్చి శ్రమను పెట్టుబడిగా మలిచి సేద్యం అనే యుద్ధంలో నిత్య శ్రామికుడిగా పోరాడుతూ అందరి ఆకలిని తీర్చే అన్నదాతల పట్ల ఈ వ్యవస్థల వైఖరి ఏంటి?. రైతు ఉనికే ఈ దేశానికి ధైర్యం. రైతు చేతిలో పుట్టిన విత్తనమే ఈ దేశానికి ప్రాణం. రైతు చేతితో తడిసిన నేలే ఈ దేశానికి అన్నపూర్ణ. కానీ ప్రస్తుత సమాజం రైతును చూసే కోణం మాత్రం చాలా దారుణంగా ఉంటుంది. ఇది నేటి సమాజపు మానసిక వైకల్యానికి నిదర్శనంగా మారుతుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలలో వడ్లు తడిసి మొలకెత్తిన సంఘటనలు చాలా చోట్ల జరిగాయి. చాలా రోజులుగా వడ్లు కొనుగోలు కేంద్రాలలోనే ఉండడం ఈదుస్థితికి కారణం ఇలాంటి పరిస్థితులలో వడ్లను కొనాలని మహబూబాబాద్‌లో మహిళా రైతులు అధికారాల కాళ్లు మొక్కడం రైతుల ఆత్మగౌరవానికి ఆటంకంగా మారింది. ఇలాంటి పరిస్థితులు రైతులకునిత్యం ఎక్కడో అక్కడ ఎదురవుతూనే ఉన్నాయి. ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి నిదర్శనంగా నిలుస్తాయి. ఇలాంటివి పార్టీలతో సంబంధం లేకుండా ఏ పార్టీ అధికారంలో ఉన్నా జరగడం ఆమోదించతగినది కాదు ఆ మధ్యకాలంలో కర్ణాటకాలో రైతు పంచకట్టుకొని ఉన్నాడని, బట్టలు మాసిపోయి ఉన్నాయని మెట్రో రైలులోకి అనుమతించలేదు. అలాగే మరో రైతును షాపింగ్ మాల్‌లోని థియేటర్‌లోకి అనుమతించలేదు. ఈ సంఘటనలు దేశవ్యాప్తంగా నిత్యం ఎక్కడో అక్కడ జరుగుతూనే ఉన్నాయి. ఇవి రైతుల పట్ల సమాజ వైఖరిని తెలుపుతున్నాయి. దేశానికే గర్వకారణమైన అన్నదాతను అగౌరవపరచడం వ్యవస్థ వినాశనానికి దారి తీస్తుంది. ఇటీవల కాలంలో వ్యవసాయం చేసే చాలామంది యువకులకు పెళ్ళిళ్లు కావడం కష్టంగా మారింది. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగించే యువతకు పెళ్లికి అమ్మాయిని ఇవ్వడానికి చాలా మంది తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. కారణం ఉద్యోగ భద్రత లేదని, స్థిరమైన ఆదాయం లేదని అమ్మాయిల తల్లిదండ్రులు తిరస్కరిస్తున్నారు. పంటలకు పెట్టుబడులు పెరిగాయి, దిగుబడులు తగ్గాయి, వచ్చిన పంటకు మద్దతు ధరలు లేకపోవడం, వంటి అనేక సమస్యల వలన రైతు అప్పులఊబిలో చిక్కుకుపోయి చివరకు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నాడు. ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి అద్దంపడుతుంది. రాజకీయ వేదికలపై 'రైతేరాజు' అనే మాటలు కాదు క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవడం కావాలి. నాయకుల ఉపన్యాసాలలో రైతును గౌరవించడంకాదు దేశంగర్వపడేలా రైతును ఆర్థికంగా అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రతి రాజకీయపార్టీ, నాయకులపై ఉంది. మద్దతు ధరలు ఖచ్చితంగా అమలు చేయాలి. కనీస లాభంతోపాటు స్థిరమైన ధరలను నిర్దేశించాలి. రైతులే నేరుగా వారి ఉత్పత్తులను అమ్ముకునే వీలు కల్పించాలి. దానికి తగినట్టుగా సమీపంలోనే మార్కెట్ యార్డ్స్‌నీ నిర్మించాలి. వ్యవసాయంలో పంటలకు, రైతులకు బీమా పూర్తి స్థాయిలో అమలవాలి. బీమా మొత్తం రైతుకు, రైతు కుటుంబ సభ్యులకు స్వయంగా, సమయానికి చెల్లించాలి. తడిసిన ధాన్యాలను, ప్రభుత్వం మద్దతు ధరతో పాటే కోనుగోలు చేయాలి. ●

# ప్రజావాక్కు



## రేషన్ షాపులపై నియంత్రణ!

పవిత్రపుణ్యక్షేత్రమైన తిరుపతిలోని రేషన్‌షాపులు అధ్వాన్నస్థితిలో, అధోగతిలో నడుస్తున్నాయి. దానిలో భాగంగా తిరుపతి నగర పరిధిలో సుమారు 100 రేషన్‌షాపులు పనిచేస్తున్నాయి. అందులో కొన్నిఎప్పుడు తీస్తారో, ఎప్పుడు మూస్తారో, ఎప్పుడు రేషన్ ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. కొన్ని షాపులకు నోటీసు బోర్డులు ఉండవు. మరికొన్ని షాపులు మాత్రం 1వ తేది నుండి తూతూ మంత్రంగా 2,3 రోజులు ఇచ్చి సరుకు అయిపోయిందని, డీలర్లు మూసివేస్తారు. అందులో కొన్ని షాపులు కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి మిగిలినవి లేవు పోండి అంటారు. కాబట్టి ఈ రేషన్‌షాపుల డీలర్లను అదుపులో పెట్టాలి. తరువాత బ్లాకుల్లో అమ్మే కస్టమర్లను అదుపులో పెట్టాలి

- వి.ఆర్.కె.మూర్తి, తిరుపతి

## వెల్‌నెస్ సెంటర్లో సేవలను మెరుగుపరచాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా హనుమకొండలోని మెటర్నిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయబడ్డ వెల్ నెస్ సెంటర్‌లో నిత్యం వచ్చే వారికి పూర్తి స్థాయిలో అందడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి ములుగు మహబూబాద్ జనగాం వరంగల్ హనుమకొండ ప్రాంతాల్లోని ప్రభుత్వఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టులు నిత్యం వెల్‌నెస్ సెంటర్‌కి వస్తారు. కానీ అన్ని సేవలు అందుబాటులోకి రావడం లేదు. న్యూరో డాక్టర్ పీడియాట్రిక్ డాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్ల నానా యాతన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెల్‌నెస్ సెంటర్లో అన్ని విభాగాల వైద్యులను ఏర్పాటు చేసి బలోపేతం చేయాలి. ఇక్కడికి వచ్చే వారికి అన్ని రకాల సదుపాయాలు, మంచినీటి వసతి కల్పించాలి.

- కె. సతీష్, భూపాల్ పల్లి జిల్లా

## ఆయకట్టు స్థిరీకరణ

ఇప్పటికే సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆయకట్టుకు నీరు అందించడంతోపాటు సరికొత్త ఆయకట్టును సాగులోకి తేవడంతో పాటు ఆయకట్టు స్థిరీకరణ చేయడం తద్వారా సరికొత్త రూపురేఖలను ఖమ్మం జిల్లాకు అందించడం సాధ్యం అవుతుంది. ఇవన్నీ గత ప్రభుత్వం తెచ్చినప్రపోజల్స్ అనిగుర్తుపెట్టుకోవాలి. ఏది ఏమైనా తక్కువఖర్చుతో సాగులోకి తేవడం గొప్ప విషయమే.

- బి.అవినాష్, జనగామ

## పెరుగుతున్న సమస్యలు

చైనా దశాబ్దాల క్రితమే భారత్‌లోని తూర్పు భాగాన ఉన్న అరుణాచలప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 38వేల చదరపు కిలోమీటర్ల స్థలాన్ని చట్టవ్యతిరేకంగా ఆక్రమించుకుని తన స్థావరాలను ఏర్పరుచుకుంది. ఆక్రమించుకన్న ప్రదేశాలకు చైనా తమ దేశానికి చెందిన పేర్లను పెడుతోందని నిన్న మొన్నటి వార్త. వెంటనే మన విదేశాంగశాఖ రంగంలోకి దిగి పేర్లు పెట్టుకున్నంత మాత్రాన అవి భారత్ భూభాగానికి చెందకుండా పోతాయా అని చప్పిడిమాటలు మాట్లాడుతోంది. చైనా ఆక్రమించిన మొద ట్లోనే ఎందుకు ఖండించలేదు? మళ్ళీ మొదటి కోస్తే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌నూ తెలిగ్గా తీసుకుంటూ అది భారత్ లోనిదే అంటూ కాలాయాపన చేసారు. సమస్యలు ఉత్పన్నమయినప్పుడే వాటిని వెంటనే పరిష్కరించుకోవాలి.

-ఎన్. పి.రాజేష్, నల్గొండ

## దారికి అడ్డంగా గృహనిర్మాణ మెటీరియల్

గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలు వాహనాలతో ప్రయాణించే రోడ్లపై గృహ నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్‌ను నెలలు, సంవత్సరాల కొద్దీ రోడ్లపై ఉంచడం వలన ప్రయాణికులకు, వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్లపై చెత్త చెదారం, కంకర రాళ్లు వేసిన వారిపై స్థానిక సంస్థలు అధికారులు నోటీసు జారీ చేసి వాటిని తొలగించి సులభమైన ప్రయాణానికి కృషి చేయాలి. రాత్రిపూట ఇలాంటి రోడ్లపై నడవడం వాహనాలు ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుంది. రోడ్లపై వేసిన గృహనిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ తీసివేయాలని ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేయాలి.

- ఈ.వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## నియంత్రణ అవసరం

మద్యం సేవించి డ్రైవింగ్ హైదరాబాద్‌లో ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారింది. వాహనదారులే కాకుండా, అమాయక ప్రయాణికులు, బాటసారులు కూడా ఈ ప్రమాదానికి గురవుతున్నారు. పట్టుబడినవారిలో ఎక్కువ మంది 18 నుండి 40 ఏళ్ల మధ్యవారే. వారిరక్తంలో మద్యం స్థాయిలు ప్రమాదకరంగా ఎక్కువగా ఉన్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం సేవించి డ్రైవింగ్ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం. మద్యం సేవించి వాహనం నడపడం కేవలం చట్ట ఉల్లంఘనే కాదు, ఇది ప్రాణాలకు ప్రమాదకరం.

-వి.కృష్ణ కుమార్, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నిరంతర అభివృద్ధితో తెలంగాణ ప్రస్థానం

డాక్టర్ తిరునహరి శేషు

తె లంగాణ ఉద్యమ నేల అనేక ఉద్యమాలకి పురుడు పోసిన తెలంగాణ ధిక్కారమే సహజ ఆభరణంగా నాటి నైజాం వ్యతిరేక ఉద్యమం నుండి నేటి తెలంగాణ ఉద్యమం వరకు దేశంలోనే తెలంగాణది ఒక ప్రత్యేక వరవడి. చరిత్ర పుటలలో తెలంగాణ రాష్ట్రం ఒక భౌగోళిక రాష్ట్రమే కాదు అది ప్రజల ఉద్యమ ఆకాంక్ష ఉద్యమకారుల త్యాగాలపునాది కాబట్టి రాష్ట్రం ఏర్పాటై 11వసంతాలు పూర్తిచేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న తెలంగాణ రాష్ట్రం అనేక మైలురాళ్లను అధిగమిస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో నిధులు నీళ్ల నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయం, వివక్షత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి బీజాలు వేసింది. 1969లోరాష్ట్ర ఏర్పాటు కోసం 369మంది ఉద్యమకారులు పోలీస్ తూటాలకు ఎదురు నిలిచి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేశారు. అలాగే మలిదశ ఉద్యమంలో 1200 మంది ఉద్యమకారులు రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను లెక్క చేయకుండా బలిదానం చేసుకున్న తెగువ తెగింపు లాంటి అరుదైన ఘటనలు ఒక్క తెలంగాణ ఉద్యమంలోనే కనపడతాయి. 1960 నుండి గుజరాత్‌తో మొదలు 2014లో తెలంగాణతో సహా దేశంలో 15 రాష్ట్రాలు ఏర్పాటయినాయి. ఉద్యమాలతో విభజిత రాష్ట్రంగా తెలంగాణ మనగలుగుతుందా అనే సందేహాలను పటాపంచలు చేస్తూ విమర్శకుల నోళ్లను మూయిస్తూ ఈ 11 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అనేక పెద్ద రాష్ట్రాలతో పోటీపడుతూ అనేక విషయాలలో, వివిధ రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందనే చెప్పాలి. ఆర్థికంగా ఈ 11 సంవత్సరాలలో అనేక ఆర్థిక, ఆర్థికాభివృద్ధి సూచికలలో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన మెరుగుదలనే సాధించింది. రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి ఐదు లక్షల కోట్ల రూపాయలుగా ఉన్న రాష్ట్ర ఆదాయం (జిఎస్ డి పి) 16 లక్షల కోట్ల రూపాయలకు పెరగడమే కాదు జీఎస్ డిపి వృద్ధిరేటులో తమిళనాడు ఉత్తరప్రదేశ్ తర్వాత దేశంలోనే తెలంగాణది మూడవస్థానం. 2014-15లో 1,24,104 రూపాయలుగా ఉన్న తలసరి ఆదాయం 2024-25 నాటికి 3,79,757 రూపాయలకు పెరిగి తెలంగాణ దక్షిణాదిలో మొదటి స్థానం, దేశంలోనే మూడో స్థానంలో నిలబడింది. అలాగే ఈ 11సంవత్సరాల కాలంలో రాష్ట్ర బడ్జెట్ లక్షకోట్ల రూపాయల నుండి మూడు లక్షల కోట్ల రూపాయలకి పెరిగింది. తెలంగాణ దేశ జీడీపీలో ఐదుశాతం వాటాను కలిగి దేశ అభివృద్ధిలో కూడా తెలంగాణ కీలక భాగస్వామిగా మారిందనే చెప్పాలి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో (ఎస్‌డిఎస్) తెలంగాణ దేశంలో ఆరో స్థానంలో నిలిచి మిగతా రాష్ట్రాలకి ఆదర్శంగా నిలబడిందనే చెప్పాలి. ఈ పదకొండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ఆదాయం, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగినప్పటికీ రాష్ట్ర అభివృద్ధి ఫలాలు కింది వర్గాల ప్రజలకి అందకపోవటం వలన రాష్ట్రంలో పెరిగిన సంపద,




ఆదాయం నిజమైన అభివృద్ధిని ప్రతిబింబించడం లేదు. రాష్ట్ర ఆదాయం లక్షల కోట్ల రూపాయలకు పెరిగినా ఆ పెరిగిన ఆదాయంలో 51శాతం ఒక్క హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నుండే రావడం అదేవిధంగా తలసరి ఆదాయంలో కూడా జిల్లాల మధ్య పెద్దఎత్తున అంతరాలు ఉండటం వలన ఆర్థికాభివృద్ధి సూచికలు వాస్తవ అభివృద్ధిని ప్రతిబింబించలేకపోయినాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పా టైన తర్వాత మూడు పర్యాయాలు శాసనసభ ఎన్నికలు జరిగితే రెండు సామాజిక వర్గాలకే రాజకీయ అధికారం దక్కింది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కానీ ప్రత్యేక రాష్ట్రాలలో కానీ మెజార్టీ వర్గాలైన బలహీన వర్గాలు రాజ్యాధికారం దక్కించుకోలేకపోగా వారి రాజకీయ ప్రాతినిధ్యం కూడా తగ్గిపోవడంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలలో కానీ అధికారంలో కానీ గుణాత్మక మార్పులు రానట్లుగానే కనిపిస్తుంది. సామాజిక అంశాలలో విద్యా, ఆరోగ్యం, వైద్యం లాంటి కీలక రంగాలలో పేదరికం, నిరుద్యోగం లాంటి ప్రధాన సమస్యలను అదుపు చేయడంలో ఈ 11 సంవత్సరాలలో తెలంగాణ చెప్పుకోదగ్గ ఫలితాలనే సాధిస్తుందనే చెప్పాలి. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణ రాష్ట్రంలోమూడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉంటే నేడు 32మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసుకొని పదివేల మెడికల్ సీట్లను తెలంగాణ కలిగి ఉంది. గురుకులాల సంఖ్యను 1023కి పెంచి రెసిడెన్షియల్ విద్యని కింది వర్గాలకు అందించే ప్రయత్నాలు జరిగినాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా 25 వేల కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ని నిర్మిస్తుంది కానీ ప్రభుత్వ హాస్పిటల్స్ లోప్రభుత్వ పాఠశాలలో ఆశించినస్థాయిలో సౌకర్యాలు మెరుగుపడకపోవటం విద్యా, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారటం అసంతృప్తిని కలిగిస్తుంది. వీటిపైన ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించే నిధులు పెంచి ఈ రెండు రంగాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందనే భావన వ్యక్తం అవుతుంది. తెలంగాణరాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి 13.18శాతంగా ఉన్న పేదరికం 3.76 శాతానికి తగ్గి పేదరికంతక్కువగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ 5 వ స్థానంలో నిలవడం 5.1 శాతం నిరుద్యోగితతో తెలంగాణ నిరుద్యోగం తక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఎనిమిదో స్థానంలో ఉన్నది కానీ ఉద్యమ ఆకాంక్షలలో అత్యంత బలమైన ఆకాంక్ష నియామకాల విషయంలో గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వాలు రెండు కలిసి కూడా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కూడా భర్తీ చేయకపోవడం పెద్ద వైఫల్యంగానే చూడాలి. ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ భర్తీ చేస్తుంది కానీ కొత్త నోటిఫికేషన్స్ విడుదలలో మరింత వేగంగా పని చేయాలని యువత ఆకాంక్షిస్తుంది. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మూడు కోట్ల మందికి సన్న బియ్యం, 70 లక్షల మందికి రైతు భరోసా, 25 లక్షల మంది రైతులకు చేసిన రైతు రుణమాఫీ లాంటి పథకాలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అలాగే ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేసినప్పుడే క్రిందివర్గాల ప్రజలకి సంక్షేమ ఫలాలు అందుతాయి. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలోనూ పెట్టుబడుల ఆకర్షణలో దేశంలో నాలుగు స్థానంలోనూ ఐటీ లాంటి కీలక రంగంలో తెలంగాణ రాష్ట్రం అత్యంత వేగంగా వృద్ధినిసాధించి తనసత్తా చాటుతుంది. తెలంగాణలోమొదటి సారిగా అనారోగ్యకరమైన రాజకీయ వాతావరణం కనిపిస్తుంది కాబట్టి తెలంగాణ రాష్ట్రం నిబద్ధత, అంకితభావంతో కూడిన రాజకీయాలతో పారదర్శకమైన, సమర్థవం తమైన పాలనతో భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని తెలంగాణ దేశంలోనే ఒక అత్యున్నత రాష్ట్రంగా ఎదగాలని ఆశిద్దాం. ●


# ట్రంప్ వైఖరిపైనే జీ7 దేశాధినేతల ఫోకస్

## అమెరికాతో ద్వైపాక్షిక చర్చలవైపే అధికుల మొగ్గు




**టొరంటో, జూన్ 15 :** కెనడాలోని ఆల్బర్టా ప్రావిన్స్‌లో ఉన్న కననస్కిస్ వేదికగా జరిగే జీ7 కూటమి సమావేశాలకు అధినేతలు మొత్తం చేరుకున్నారు. ఈనెల 17 వరకు జరగనున్న ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కేంద్ర బిందువుగా నిలువనున్నారు. ఈసారి సదస్సుకు హాజరుకానున్న ప్రపంచ దేశాల ప్రభుత్వాధినేతలు ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. అందుకే జీ7 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. సదస్సు చివర్లో జీ7 దేశాలు సంయుక్త ప్రకటన చేసే సంప్రదాయాన్ని ఈసారికి ఆపేయాలని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ డిసైడ్ చేశారు. ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాలు, హెచ్చరికలతో విరుచుకుపడుతున్న ప్రస్తుత తరుణంలో ఐక్యతను ప్రదర్శించడం కంటే అమెరికాతో ద్వైపాక్షిక చర్చలకే పెద్దపీట వేయడం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. జీ7 సదస్సు వేదిక కననస్కిస్‌కు ట్రంప్ చేరుకుంటారు. ఇప్పటికే చాలా దేశాల ప్రభుత్వాధినేతలు అక్కడికి చేరుకున్నారు. ఏకకాలంలో పెద్దసంఖ్యలో ప్రపంచ దేశాల నేతలతో రౌండ్ టేబుల్ తరహా భేటీకి అమెరికా అధ్యక్షుడు ఒప్పుకునే ఛాన్స్ లేదని తెలుస్తోంది. ఒక్కొక్క దేశాధినేతతో కాసేపు ద్వైపాక్షిక సమావేశానికే ట్రంప్ మొగ్గుచూపుతారని అంటున్నారు. జీ7 కూటమిలో లేనప్పటికీ కెనడా నుంచి ఆహ్వానం అందుకున్న దేశాల జాబితాలో భారత్, ఉక్రెయిన్, యూఏఈ, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, మెక్సికో, బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఈదేశాలతో పాటు జీ7 సభ్య దేశాలు తమపై వీలైనంత మేరకు సుంకాల భారాన్ని తగ్గించాలని ట్రంప్‌తో మొరపెట్టుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే ట్రంప్ ఎలా స్పందిస్తారనేది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, కెనడాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా చేస్తానన్న ట్రంప్ ప్రకటన, గ్రీన్ లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని అమెరికా చేసిన అనౌన్స్‌మెంట్‌లు ఈ సదస్సులో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం తీవ్రరూపు దాల్చిన ప్రస్తుత తరుణంలో ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ భేటీ కానున్నారు. చివరిసారిగా అమెరికాలోని వైట్ హౌస్‌లో ఉన్న ఓవల్ ఆఫీస్ వేదికగా వీరిద్దరూ సమావేశమయ్యారు. అప్పట్లో మీడియా ఎదుటే జెలెన్‌స్కీని కించపరిచేలా ట్రంప్ నానా మాటలు అన్నారు. ఉక్రెయిన్‌లోని సహజ వనరులను అమెరికాకు అప్పగిస్తేనే సైనికసాయం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. ఈసారి జరిగే భేటీ లోనూ ఆఅంశాన్ని ట్రంప్‌లేవనెత్తే అవకాశం లేకపోలేదు. ఐరోపా దేశాల ఎజెండాలో ఉక్రెయిన్‌కు సైనిక భద్రత ప్రస్తుతం ఉక్రెయిన్‌కు యూకే, పలు ఐరోపా దేశాలు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఈసారి రెండు ప్రధాన అంశాలపై ట్రంప్‌తో చర్చలు జరిపే అవకాశం ఉంది. యూరోపియన్ యూని యన్‌పై అమెరికా సుంకాల భారం, ఉక్రెయిన్ భవిష్యత్ భద్రత గురించి ఈ ఇద్దరూ డిస్కస్ చేసే ఛాన్స్ ఉంది. ఒకవేళ రష్యాతో ఉక్రెయిన్‌కు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే ఐరోపా దేశాలు, అమెరికా కలిసి ఉక్రెయిన్‌కు సైనిక భద్రత కల్పించాలనే ప్రతిపాదనను గతంలోనే మెక్రాన్ తెరపైకి తెచ్చారు. అయితే అప్పట్లో ట్రంప్ అందుకు నో చెప్పారు. ఈసారి చర్చల్లో దీనిపై ఎలాంటి ఫలితం వస్తుందో వేచిచూడాలి. జీ7 సదస్సుకు బయలుదేరిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మార్గం మధ్యలో డెన్మార్క్‌లోని గ్రీన్ లాండ్ ప్రాంతంలో దిగారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన అక్కడ ల్యాండ్ అయ్యారు. గ్రీన్‌లాండ్ ప్రాదేశిక నేతలు, డెన్మార్క్ ప్రధానితో మెక్రాన్ భేటీ అయ్యారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో కలుపుకుంటామని ఈసారి అమెరికా అధ్యక్షుడు కాగానే ట్రంప్ ప్రకటించారు. అది సాధ్యమయ్యే విషయం కాదని, ఐరోపాదేశాలు ఐక్యంగా ఉంటాయనే సందేశాన్ని ట్రంప్‌కు ఇచ్చేందుకే గ్రీన్‌లాండ్‌కు మెక్రాన్‌వెళ్లారని పరిశీలకులు అంటున్నారు.

# మహాత్మాగాంధీ మునిమనుమరాలికి ఏడేళ్లు జైలు!



**దర్బన్, జూన్ 15:** మహాత్మాగాంధీ మునిమనువరాలు ఆశిష్ లతా రామ్‌గోబిన్(56)కు సౌతాఫ్రికా కోర్టు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు దర్బన్‌లోని స్పెషలైజ్డ్ క్రైమ్ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రముఖ మానవహక్కుల కార్యకర్త ఇలా గాంధీ, దివంగత మెవా రామ్‌గోబిన్‌ల కుమార్తె అయిన లతా రామ్‌గోబిన్ అక్కడ ఎస్ఆర్ మహరాజ్ అనే వ్యాపారవేత్తను 6 మిలియన్ రాండ్స్ (రూ.3.22 కోట్లకు) మోసం చేసిన కేసులో ఈ శిక్ష పడింది. నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష ఖరారు చేస్తూ అప్పీలు చేసుకునే అవకాశాన్నీ నిరాకరించింది. లతా రామ్‌గోబిన్ ఒక ఎన్‌జీఓ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేస్తూ తన పలుకుబడిని ఉపయోగించి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. లతా రామ్‌గోబిన్ 2015లో ఎస్ఆర్ మహరాజ్ అనే వ్యాపారిని మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. న్యూ ఆఫ్రికా అలయన్స్ ఫుట్‌వేర్ డిస్ట్రిబ్యూటర్స్ డైరెక్టర్‌గా ఉన్న మహారాజ్‌ను లత డబ్బులు అడిగారు. దీనికోసం లతా రామ్‌గోబిన్ తాను భారత్ నుంచి మూడు కంటైనర్ల లైనెన్ దిగుమతి చేసుకుంటున్నానని వాటిని దక్షిణాఫ్రికాలోని ప్రైవేట్ హెల్త్‌కేర్ గ్రూప్ నెట్‌కేర్‌కు పంపుతానని నమ్మబలికారు. దిగుమతి సుంకాలు, కస్టమ్స్ క్లియరెన్స్ కోసం డబ్బు కావాలని అడిగారు. అయితే మహారాజ్‌ను నమ్మించడానికి లతా రామ్‌గోబిన్ కొన్ని నకిలీ పత్రాలు చూపించారు. వాటిలో సంతకం చేసిన పర్చేజ్ ఆర్డర్, ఇన్వాయిస్, నెట్‌కేర్ నుంచి డెలివరీ నోట్ ఉన్నాయి. అంతేకాకుండా నెట్‌కేర్ తనకు డబ్బులు కూడా చెల్లించినట్లుగా ఒక బ్యాంకు ధ్రువీకరణ పత్రాన్ని కూడా చూపించారు. వీటికి తోడు లతా రామ్‌గోబిన్ ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త ఎలా గాంధీ కుమార్తె కావడంతో మహారాజ్ సహాయం చేయడానికి అంగీకరించారు. తనకు లాభాలలో వాటా వస్తుందని ఆశించారు. అయితే, ఆ పత్రాలన్నీ నకిలీవని తర్వాత తేలింది. అసలు భారత్ నుంచి ఎలాంటి వస్తువులు దిగుమతి కాలేదని తెలిసింది. దీంతో మహారాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలో నేషనల్ ప్రాసిక్యూటింగ్ అథారిటీ (ఎన్‌పిఎ) బ్రిగేడియర్ హంగ్వాని ములాడ్జీ మాట్లాడుతూ లతారామ్ గోబిన్, తాను అల్లిన కథను నిజమని నమ్మించ డానికి నకిలీ పత్రాలు సృష్టించిందని చెప్పారు. లత నకిలీ ఇన్వాయిస్‌లు, ఇమెయిల్‌లను ఉపయోగించి మహారాజ్‌ను మోసం చేసిందని ధృవీకరించారు. దీంతో కోర్టు ఆమెను దోషిగా తేల్చి లత అప్పీల్ చేయడానికి చేసిన అభ్యర్థనను కూడా తిరస్కరించింది. 2015లో ఆమెకు 50,000 రాండ్ల పూచీకత్తుతో బెయిల్ లభించింది. ఆసమయంలో లతా రామ్‌గోబిన్ "పార్టిసిపేటివ్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్" అనే కార్యక్రమాన్ని నడిపేవారు. అప్పుడు తాను సామాజిక, రాజకీయ, పర్యావరణ సమస్యలపై దృష్టిసారించే కార్యకర్తగా చెప్పుకున్నారు. మరో వైపు, లతా రామ్‌గోబిన్ తల్లి ఎలాగాంధీకి భారత దేశం, దక్షిణాఫ్రికానుంచి అనేక జాతీయ పురస్కారాలు లభించాయి. శాంతికోసం ఆమె చేసిన కృషికిగుర్తింపుగా ఈ అవార్డులు వచ్చాయి. ఆమె బంధువులు కీర్తి మీనన్, సతీష్ ధూపేలియా, ఉమా ధూపేలియామెస్త్రి కూడా సామాజిక సేవ, ఉద్యమాలతో పేరు తెచ్చుకున్నారు.

## ప్రాణాల మీదికి తెచ్చిన జిప్‌లైన్ అడ్వెంచర్!

**మనాలి, జూన్ 15:** సెలవుల్లో సరదాగా గడుపుదాని వెళ్లిన విహారయాత్ర విషాదంగా మారింది. మనాలిలో ఓ 12ఏళ్ల బాలిక జిప్‌లైన్ అడ్వెంచర్ చేస్తుండగా 30 అడుగుల ఎత్తు నుంచి అమాంతం కింద పడిపోయింది. కింద నదిలో మొత్తం బండరాళ్లు ఉండటంతో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే జిప్ లైన్ నిర్వాహకుల నిర్లక్ష్యమే ఇందుకు కారణం అని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వేసవి సెలవులు కావడంతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ప్రఫుల్ల బిజ్వే, అతని భార్య, కుమార్తె త్రిషతో విహారయాత్రకు వెళ్లారు. టూర్‌లో భాగంగా మనాలిని సందర్శించారు. ఈ క్రమంలో జిప్‌లైన్ అడ్వెంచర్‌పై త్రిష్ ఆసక్తి కనబర్చింది. కూమార్తె కోరిక మేరకు బిజ్వే.. ఆమెను జిప్‌లైన్ ఎక్కించారు. అయితే కొంత దూరం వెళ్లగానే.. ఒక్కసారిగా కేబుల్ తెగిపోయింది. దీంతో త్రిష దాదాపు 30 అడుగుల ఎత్తు నుండి కింద నదిలో పడిపోయింది. అందరూ చూస్తుండగానే ఈ ప్రమాదం జరిగింది. నదిలో బండరాళ్ళు ఉండటంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన త్రిష వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు ఆమెను ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ప్రమాదంలో త్రిష కాలు విరిగింది. మొదట మనాలిలోని ఆమెకు ఒక ఆసుపత్రిలో చికిత్స అందించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం చండీగఢ్‌లోని ఒక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం త్రిష నాగ్‌పూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యులు ఆమె పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. అయితే ప్రమాదం జరిగిన ప్రదేశంలో తగిన భద్రతా చర్యలు లేవని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో సహాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని వారు వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పర్యాటకుల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు.



# భారీగా పెరుగుతున్న కరోనా కేసులు

## ఢిల్లీలో ఒకే రోజు ముగ్గురి మృతి

**న్యూఢిల్లీ, జూన్ 15:** దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మళ్లీ విస్తరిస్తున్నది. ఢిల్లీలోనూ కరోనా విధ్వంసం కొనసాగుతున్నది. తొలిసారిగా దేశ రాజధానిలో కరోనా వైరస్‌తో ఒకే రోజులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు ఢిల్లీలో కరోనా కారణంగా 11 మంది మరణించారు. ఢిల్లీలో మరణించిన ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. 57 ఏళ్ల మహిళకు డయాబెటిస్, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. మరో వ్యక్తికి సైతం ఇవే సమస్యలున్నట్లుగా గుర్తించారు. అలాగే, 83 ఏళ్ల మహిళకు డయాబెటిస్, హై బీపీ, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. అయితే, యాక్టివ్ కరోనా రోజుల్లో తగ్గుదల కనిపించింది. యాక్టివ్ రోగుల సంఖ్య 672కి తగ్గింది. జనవరి నుంచి ఇప్పటి వరకు ఢిల్లీలో కొవిడ్‌తో 11మంది ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురి మరణానికి కొవిడ్ మాత్రమే కారణం కాదని.. వారికి ఉన్న దీర్ఘకాలిక వ్యాధులు సైతం కారణమని వైద్యులు తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వివరాల 24గంటల్లో 212 మందికి కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. దేశంలో నమోదైన మొత్తం కేసుల్లో ఢిల్లీ రెండోస్థానంలో ఉన్నది. కొవిడ్ కేసులకు కొత్త వేరియంట్ కారణమని భావిస్తున్నారు. అయితే, వాటితో అంతగా ప్రమాదమేమీ లేదని.. గతంలో వేరియంట్ల తరహాలో ప్రాణాంతకం కావని పేర్కొన్నారు. అయితే, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తేలికపాటి లక్షణాలు కనిపించినా.. ఆ తర్వాత తీవ్రమైన శ్వాసకోశ సమస్యల వరకు పెరగవచ్చని పేర్కొంటున్నారు. కరోనా సాధారణ లక్షణాలో చలిగా ఉండడం, పొడిదగ్గు, గొంతునొప్పి, ఒంటినొప్పులు, అలసట, వాసన, రుచి చూసే సామర్థ్యం తగ్గిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా అనిపిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే, కొవిడ్ కేసులు పెరుగుతున్నాయని భయపడాల్సిన, ఆందోళన చెందాల్సిన పని లేదని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, జలుబుతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో బాధపడుతున్న రోగులు వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకొని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# ఫాల్కన్ రాకెట్ లోపాన్ని గుర్తించిన ఇస్రో

## ఎట్టకేలకు 19న రోదసిలోకి శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ, జూన్ 15:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సహా నలుగురు అంతరిక్ష యాత్రికులను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఐఎస్ఎస్ తీసుకెళ్లనున్న స్పేస్ఎక్స్ ఫాల్కన్9 రాకెట్‌లో తలెత్తిన తీవ్ర సాంకేతిక లోపాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సమయస్ఫూర్తితో గుర్తించి, పెను ప్రమాదాన్ని నివారించింది. యాక్సియమ్4 మిషన్ ప్రయోగం తొలుత వాయిదా పడింది. లోపాలను సరిదిద్దిన అనంతరం, జూన్ 19న ప్రయోగాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యాక్సియమ్4 మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతున్న ఫాల్కన్9 రాకెట్ మొదటి దశలోని ఆక్సిడైజర్ లైన్‌లో పగుళ్లు ఉన్నట్లు వెల్లడైంది. స్పేస్ఎక్స్ సంస్థ మొదట దీనిని ఒక చిన్న లీక్‌గా పరిగణించి, తాత్కాలిక పర్జ్ పరిష్కారంతో ప్రయోగానికి ముందుకు వెళ్లాలని భావించింది. అయితే, ద్రవ ఆక్సిజన్ అత్యంత వేగంగా మండే స్వభావం కలిగినందున, ఈ లోపం ప్రయోగ సమయంలో రాకెట్ గాల్లోకి లేచే సమయంలోనే భారీ వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్లిష్టపరిస్థితుల్లో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ వ్యోమగాముల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. రాకెట్‌లో పూర్తిస్థాయి తనిఖీలు చేసి, లోపాన్ని సమూలంగా సరిదిద్దాలని, తక్కువ ఉష్ణోగ్రతల వద్ద లీకేజ్ పరీక్షలతో సహా అన్ని భద్రతా పరీక్షల ద్వారా ధృవీకరించాలని ఆయన స్పేస్ఎక్స్‌ను డిమాండ్ చేశారు. ఇస్రో చూపిన ఈ దృఢ వైఖరితో స్పేస్ఎక్స్ వెనక్కి తగ్గి, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టగా, ఆక్సిడైజర్ లైన్‌లో వెల్డ్ క్రాక్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అవసరమైతే మిషన్ నుంచి వైదొలగడానికి కూడా భారత్ సిద్ధపడింది. ఇస్రో పట్టుదల, సమన్వయంతో స్పేస్ఎక్స్ బృందాలు పగిలిన భాగాన్ని మార్చి, అవసరమైన అన్ని మరమ్మతులు, పరీక్షలు పూర్తిచేశాయి. ఫాల్కన్9 వాహనంలోని లోపాన్ని విజయవంతంగా పరిష్కరించినట్లు ఇస్రో, యాక్సియమ్ స్పేస్, స్పేస్ఎక్స్ సంయుక్తంగా ధృవీకరించాయి. వ్యోమగాముల భద్రతకు పెద్దపీట వేస్తూ, యాక్సియమ్4 మిషన్‌ను జూన్ 19న ఫ్లోరిడాలోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించేందుకు ప్రస్తుతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇస్రో తీసుకున్న నిర్ణయాత్మక చర్యలు, భద్రతా నిబద్ధత అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

# ప్రధానికి విదేశ పర్యటనలపైనే మోజు


## మణిపూర్ వెళ్లడానికి మాత్రం విముఖం: జైరామ్ రమేష్ ధ్వజం



**న్యూఢిల్లీ, జూన్ 15:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు ప్రధానికి ఎనర్జీ(శక్తి), ఎగ్జైట్‌మెంట్(ఉత్సుకత), ఉత్సాహం అనే 3ఈలు మాత్రమే ఉన్నాయని విమర్శించింది. తల్లడిల్లుతున్న మణిపూర్‌కు వెళ్లేందుకు ఎంపథీ (సానుభూతి) అనే నాలుగో 'ఈ' లేదని . ఆదివారం సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల పర్యటనకు మోదీ వెళ్లిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

2023 మే నుంచి ప్రధానమంత్రి విదేశీ పర్యటనలకు వెళ్లడం ఇది 35వ సారి అని, ఇంత సుదీర్ఘ వ్యవధిలో ఒక్కసారి కూడా మణిపూర్‌కు వెళ్లే తీరిక మోదీకి దొరకకపోవడం దారుణం. మణిపూర్ రాష్ట్రాన్ని అత్యంత దారుణ రీతిలో ప్రధాని మోదీ విస్మరిస్తున్నారు. అక్కడి ప్రజల గోడును వినాలనే ఆసక్తే ఆయన లేదు. 2023 మే 3 నుంచి మణిపూర్‌కు చెందిన ఏ ఒక్కరినీ మోదీ కలవలేదు. సానుభూతి భావన నాలుగో 'ఇ' ఉన్నవాళ్లు ఎవరైనా సరే మణిపూర్ ప్రజల బాధను తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కానీ, ప్రధాని మోదీకి నాలుగో ఈ లేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కెనడా, భారత్‌లు ఎల్లప్పుడూ కలిసిమెలిసి ఉంటాయని 2015లో ప్రధాని చెప్పారు. మోదీ చెప్పింది అక్షరాలా తప్పు అని కాలక్రమంలో తేలిపోయింది. మారిన పరిస్థితులే అందుకు నిదర్శనమని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశంపై 2015లో మోదీ చేసిన వ్యాఖ్యలతో కూడిన ఒక వీడియో క్లిప్‌ను ఆయన తన ట్వీట్‌లో షేర్ చేశారు. భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టే జీ7 సదస్సుకు ఆహ్వానించామని ఇటీవలే కెనడా ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని 2025 మే 24న నీతి ఆయోగ్ సీఈఓ ప్రకటన చేశారు. ఈ రెండు వ్యాఖ్యల మధ్య ఉన్న తేడాను ప్రధాని మోదీ గుర్తించాలి. జీ7 సదస్సుకు భారత్‌ను కెనడా ఆహ్వానించదేమో అనే చర్చ జరుగుతున్న తరుణంలో మోదీ అభిమానులు గట్టిగా బల్లగుద్ది ఒక విషయాన్ని చెప్పారు. కెనడా పిలిచినా మోదీ అక్కడికి వెళ్లరని భీషణ ప్రతిజ్ఞలు చేశారు. అయితే ఎప్పటిలాగే వాళ్లందరి మాటలను మోదీ వమ్ము చేశారు. ఆయన నిజస్వరూపం బయటపడిందని జైరాం రమేశ్ విమర్శించారు.


## ఇజ్రాయెల్ పిఎం నెతన్యాహు కుమారుడి పెళ్లి వాయిదా



**టెల్‌అవీవ్, జూన్ 15:** ఇజ్రాయెల్–ఇరాన్ దేశాల మధ్య పరస్పర దాడులతో పశ్చిమాసియా రగిలిపోతోంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ ప్రధాని జెంజమిన్ నెతన్యాహు తన కుమారుడి వివాహం విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన వివాహ వేడుకను వాయిదా వేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నెతన్యాహు కుమారుడు అవ్‌నర్, అమిత్ యార్దేనీల వివాహం సోమవారం జరగాల్సి ఉంది. ఈ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఆయన కుటుంబం సిద్ధమైంది. కానీ ఇరాన్‌లో సైనిక స్థావరాలు, అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తున్నాయి. వీటికి ప్రతీకారంగా ఇరాన్ కూడా తిరిగి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తోంది. దాంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ స్థితిలో ఇంట్లో వేడుకలు చేసుకోవడం కరెక్టు కాదని నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న నాటి నుంచే నెతన్యాహు కుమారుడి వివాహం అంశం వివాదాస్పదంగా మారింది. ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే ప్రధాని ఇంట వేడుకలు నిర్వహిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఇంతలో ఇరాన్‌తో ఘర్షణలు మొదలయ్యాయి. అందుకే ఆయన కుమారుడి వివాహాన్ని వాయిదా వేశారు.

# ఎయిరిండియా ప్రమాద మృతుల్లో 31 మందికి డిఎన్ఎ పరీక్షలు

## మృతదేహాలు కుటుంబ సభ్యులకు అప్పగింత



**అహ్మదాబాద్, జూన్ 15:** అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన 31 మృతదేహాలను డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించామని బీజే వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రజనీశ్ పటేల్ పేర్కొన్నారు. 12 మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ సరిపోలిక ప్రక్రియ కూడా జరిగిందని, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. మూడ్రోజుల క్రితం అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన ఎయిరిండియా బోయింగ్ విమానం కొన్ని నిమిషాలకే సమీపంలోని బీజే వైద్యకళాశాలపై కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లు, 10 మంది సిబ్బంది సహా 241 మంది మృతి చెందారు. ప్రమాదం నుంచి ఒకే ఒక ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డారు. డీఎన్ఏను సరిపోల్చే ప్రక్రియ చాలా జాగ్రత్తగా చేయాలని రజనీశ్ పటేల్ పేర్కొన్నారు. ఇందులో చట్టపరమైన, వైద్యపరమైన చిక్కులున్నా యన్నారు. కాబట్టి, తొందరపాటు పనికిరాదని అభిప్రాయపడ్డారు. ప్రమాదం నుంచి బయటపడిన ఒకే ఒక్క వ్యక్తి అయిన విశ్వాస్‌కుమార్ రమేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన 11 మంది విదేశీయుల కుటుంబాలను సంప్రదించినట్లు గుజరాత్ రెవెన్యూ కార్యదర్శి అలోక్‌పాండే స్పష్టం చేశారు. కాగా, 274 మంది దుర్మరణానికి కారణమైన ఈ ప్రమాదంలో చాలా మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా తయారయ్యాయి. డీఎన్ఏ పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన ఎనిమిది మంది మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబీకులకు అప్పగించారు. వీలైనంత వరకు ఇతర మృతుల డీఎన్ఏను గుర్తించేందుకు అధికారులు ప్రయత్ని స్తున్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళిగా అహ్మదాబాద్‌లండన్ మార్గంలో నడిచే విమాన నంబర్లు ఎఐ171 ను ఎయిర్ ఇండియా రద్దు చేసింది. బదులుగా కొత్త విమాన నంబర్లు ఎఐ159/ఎఐ 160గా మార్చింది. ఈ కొత్త నెంబర్లు జూన్ 17 నుంచి అహ్మదాబాద్‌లండన్ మార్గంలో నడిచే విమానాలకు అమలులోకి వస్తాయని ఎయిర్ ఇండియా పేర్కొంది.

## మాజీ సిఎం రూపానీ మృతదేహం గుర్తింపు

### డిఎన్ఎ పరీక్షల తర్వాత కుటుంబీకులకు అప్పగింత

**అహ్మదాబాద్, జూన్ 15:** అహ్మదాబాద్‌లో మూడు రోజుల క్రితం జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహాన్ని గుర్తించారు. రూపానీ రక్తసంబంధీకుల డీఎన్ఏతో ఘటనా స్థలంలో సేకరించిన శరీర భాగాల డీఎన్ఏ మ్యాచ్ అయ్యింది. ఆదివారం మధ్యాహ్నం 11.10 గంటలకు డీఎన్ఏ టెస్టుకు సంబంధించిన ఫలితాలు వచ్చాయి. రూపానీ మృతదేహం గుర్తించిన అధికారులు ఆదివారం మధ్యాహ్నం ఆయన కుటుంబసభ్యులకు అప్పగించారు. రాజ్‌కోట్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రూపానీ అంత్యక్రియలు జరగనున్నాయి.

## ఇరాన్‌పై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు బ్రిటన్ మద్దతు



**లండన్, జూన్ 15:** ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ ఒంటరి పోరాటం చేస్తోంది. అగ్ర దేశాలు మొత్తం ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఇజ్రాయెల్‌కు తన మద్దతు ప్రకటించారు. ఇరాన్‌కు హెచ్చరికలు సైతం జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్ ఓ కీలక ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సైనిక స్థావరాలు, వారి యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. ఇరాన్ బెదిరింపులను బ్రిటన్ లెక్కచేయలేదు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచేందుకు రంగంలోకి దిగింది. మిలటరీ బలగాలను మిడిల్ ఈస్ట్‌కు తరలిస్తున్నట్లు యుకె ప్రకటించింది. ఈ విషయాన్ని బ్రిటన్ ప్రధానమంత్రి కైర్ స్టార్మర్ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నేను యుకెకు ఏది మంచో అదే చేస్తాను. మిడిల్ ఈస్ట్‌కు మిలటరీ బలగాలను తరలిస్తున్నాం. ఏదైనా అత్యవసర పరిస్థితి రావచ్చొని ఈ నిర్ణయం తీసుకున్నాను' అని అన్నారు.

# కూలిన ఎయిరిండియా బోయింగ్‌కు మేం సర్వీస్ చేయలేదు

## టర్కీ సంస్థ టర్కిస్ టెక్నిక్ వెల్లడి



**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జూన్ 12న కూలిన ఎయిర్ ఇండియా డ్రీమ్ లైనర్ విమానం నిర్వహణలో తమ సంస్థకు సంబంధం లేదని టర్కీ తెలిపింది. ఈ ప్రమాదంపై వస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. టేకాఫ్ సమయంలో కూలిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 7878 విమానం నిర్వహణను టర్కిష్ టెక్నికల్‌సంస్థ చేపట్టినట్లుగా వస్తున్న ఆరోపణలు అబద్ధమని తెలిపింది. టర్కీ, భారత్ మధ్య సంబంధాలపై ప్రజల్లో దురాభిప్రాయం కలిగించే తప్పుడు సమాచారమని ఆరోపించింది. కాగా, ఎయిర్ ఇండియా, టర్కిష్ టెక్నిక్ మధ్య 2024–2025లో జరిగిన ఒప్పందాల ప్రకారం బీ777 వైడ్ బాడీ విమానాలకు ప్రత్యేకంగా నిర్వహణ సేవలు అందిస్తున్నట్లు టర్కీ ప్రభుత్వం తెలిపింది. అయితే ప్రమాదానికి గురైన బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. ఈ రోజు వరకు టర్కిష్ టెక్నిక్ ఈ రకమైన ఏ ఎయిర్ ఇండియా విమానానికి నిర్వహణ బాధ్యత నిర్వహించలేదని పేర్కొంది. మరో వైపు కూలిన ఎయిర్ ఇండియా విమానానికి ఏ కంపెనీ చివరిగా సర్వీస్ చేసిందో అన్నది తమకు తెలుసని టర్కీ తెలిపింది. అయితే విమాన ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలో మరిన్ని ఊహాగానాలను నివారించ డానికి ఆ సంస్థ పేరును వెల్లడించడంలేదని టర్కీ చెప్పింది. విషాదకరమైన విమాన ప్రమాదంపై భారత ప్రజల దుఃఖాన్ని టర్కీ ప్రజలు హృదయపూర్వకంగా పంచుకుంటున్నారని పేర్కొంది.

# బోకోహారాం మిలిటెంట్ల భారీ దాడులు

## ఈశాన్యనైజీరియాలో 100 మందికి పైగా పౌరులు మృతి

**అబూజా(నైజీరియా), జూన్ 15:** ఆఫ్రికా దేశం నైజీరియాలోని ఈశాన్యప్రాంతంలో బోకోహారాం మిలిటెంట్లు ఒక మార్కెట్‌పై జరిపిన విచ్చలవిడి కాల్పుల్లో సుమారు వందమందికిపైగా చనిపోయారు. మార్కెట్‌తోపాటు, ఇళ్లలో ప్రార్థనలు చేసుకుంటున్నవారిని మరీ కాల్చిచంపారు. 2009 నుంచి కూడా బోకోహారాం మిలిటెంట్లు నైజీరియాలోనే కాకుండా ఇతర ఆఫ్రికాదేశాల్లో విచ్చలవిడి ఉగ్రవాదాన్ని అమలుచేస్తున్నారు. తాజా దాడిలో సుమారు 50 మంది ఉగ్రవాదులు మోటారు సైకిళ్లపై వచ్చి తర్మువా కౌన్సిల్‌ప్రాంతంలోకి వచ్చీరాగానే కాల్పులు ప్రారంభించారు. కొన్ని ఇళ్లను దగ్ధంచేసినట్లు యోబే పోలీస్ ప్రతినిధి డంగస్ అబ్దుల్‌కరీమ్ తెలిపారు. 2009నుంచి కూడా బోకోహారాం ఇలాంటి కల్లోలాన్ని సృష్టిస్తోందని, ఇస్లామిక్ షరియా రాజ్య స్థాపన లక్ష్యంగా ఈ దాడులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సుమారు 35 వేలమందికిపైగా ఇప్పటివరకూ చనిపోయారు. 20 లక్షలమందికిపైగా నిరాశ్రయులయినట్లు అధికారులు చెపుతున్నారు. విదేశీ సాయంకోసం ఈ దేశ ప్రజలు తహతహలాడుతున్నారు. మానవతా సంక్షోభం కూడా పెరిగిందని ఆందోళనగా ఉంది. ఈ ఒక్క ఏడాదిలోనే 1500 మందిని బోకో హారాం మిలిటెంట్లు చంపివేసారు. సాయుధులుగా వచ్చిన దుండగులు ఈ ఘాతుకాలకు పాల్పడుతున్నారు. ఆదివారం జరిగిన దాడిలో కేవలం 34 మంది మాత్రమేచనిపోయారని యోబే డిప్యూటి గవర్నర్ ఇడి బరేడ్ గుబానా తక్కువచేసి చెప్పినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. వాస్తవానికి వంద మందికిపైగా చనిపోయినట్లు స్థానికులు చెపుతున్నారు. ప్రభుత్వ సెక్యూరిటీ దళాలకు తమ సమాచారాన్ని చేరవేస్తున్నందుకే ఈ గ్రామస్తులను కాల్చివేసినట్లు బోకోహారామ్ సభ్యులు చెపుతున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం వల్లనే మా సభ్యులు అనేకమంది చనిపోయారని అందువల్లనే వారిని మందలించాలని నిర్ణయించి ఈచర్యకు పాల్పడినట్లు బోకోహారామ్ వెల్లడించింది. నైజీరియా ప్రభుత్వ దళాలు మాత్రమే అక్కడకువెళ్లగలుగుతున్నారు. అయినా ప్రజల్లో భయాలు కొనసాగుతూనే ఉన్నాయి. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు మాట్లాడుతూ తన హయాంలోనే బోకోహారాంతో ఉన్న వివాదానికి ముగింపు చెపుతామని చెప్పినతర్వాత నుంచే ఉగ్రసంస్థ దాడులు మరింతపెంచింది.




తమ్మారెడ్డి భరద్వాజకు ఎక్స్‌రే శ్రీశ్రీ అవార్డు ప్రదానం చేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్. సింగపల్లి, బొడి ఆంజనేయులు తదితరులు

## తమ్మారెడ్డి భరద్వాజకు ఎక్స్‌రే శ్రీశ్రీ అవార్డు ప్రదానం

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్త ప్రతినిధి:** సమకాలీన సమస్యలకు దర్పణంగా సామాన్యుల జీవితాల్లో చైతన్యం తీసుకువచ్చేలా కవిత్వం ఉండాలని తెలుగు భాషోద్యమ రథసారథి, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అద్వర్యంలో ఘంటసాల సంగీత నృత్య కళాశాల వేదికపై మహాకవి శ్రీశ్రీ 42వ వర్థంతి సందర్భంగా ప్రముఖ సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ కు ఎక్స్ రే శ్రీశ్రీ అవార్డు ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిధి గా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ ప్రసంగం కొనసాగిస్తూ శ్రీశ్రీ కవిత్వం చదువుతుంటే ఉత్సాహం, ఊపు వస్తాయని పోరాడే శక్తిని ఇస్తుందని అన్నారు. జాతిజనులు పాడుకునే గీతంలా తన కవిత్వాన్ని మలిచిన మహాకవి శ్రీశ్రీ నేటి కవులకు మార్గదర్శకులు అని మండలి బుద్ధప్రనాద్ అన్నారు. నిర్భయంగా, నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వెల్లడించి చలనచిత్ర రంగ సంక్షేమానికి కృషిచేసి వ్యక్తి తమ్మారెడ్డి భరద్వాజ అని ప్రశంసించారు. ఈ సభలో ప్రముఖ సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ కు ఎక్స్ రే శ్రీశ్రీ అవార్డు బహుకరణ శాసన సభ్యులు, అతిధుల చే జరిగింది. అనంతరం తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ శ్రమ జీవుల పక్షాన నిలిచి వారిని చైతన్య పరచిన మహాకవి శ్రీశ్రీ అవార్డు గ్రహించడం అదృష్టమన్నారు. సినీ పరిశ్రమలో అన్ని వర్గాల సంక్షేమానికి తాను కృషిచేసినట్లు తెలిపారు. జ్యోతిప్రజ్వలన చేసిన డిప్యూటి కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి లాభాపేక్ష లేకుండా మంచి సందేశాత్మక చిత్రాలను నిర్మించిన తమ్మారెడ్డి భరద్వాజ అభినందనీయులు అన్నారు. శ్రీశ్రీ సాహిత్య నిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్ అవార్డు గ్రహీతకు తన రచనతో అభినందనపత్రం చదివారు. సభా ప్రారంభానికి ముందు కె నిత్య వర్షిని, టి యోగ్యతా లక్ష్మీ దుర్గ ల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

తొలుత సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలుకుతూ మహాకవి శ్రీశ్రీ మనలో నిద్రాణమైన శక్తిని మేల్కొలిపి పోరాడే శక్తులుగా మనల్ని నిలిపాడని అన్నారు. చివరిగా కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేసారు.



## వీఆర్ హైస్కూల్లో అడ్మిషన్లు ప్రారంభం

### నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్యను అందించడమే లక్ష్యం: మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు వీఆర్ హైస్కూల్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల కళ్ళల్లో అవధులు లేని ఆనందం కనిపించింది. ఇందుకు కారణం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మహా సంకల్పంతో నిరుపేద విద్యార్థులకు అధునాతన సాంకేతికతతో డిజిటల్ విద్యను అందించేలా రూపుదిద్దిన వీఆర్ హైస్కూల్లో అడ్మిషన్ల ప్రారంభం మొదలు కావడమే. వీఆర్ హైస్కూల్లో మంత్రి నారాయణ అడ్మిషన్ల ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. దీంతో అడ్మిషన్లు పొందిన అడ్మిషన్ల కోసం వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులతో వీఆర్ హైస్కూల్ కిటకిటలాడింది. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ గొప్ప చరిత్ర ఉన్న స్కూల్‌ని వైఎస్సార్‌సీపీ హయాంలో మూత పడేసిందని, మా ప్రభుత్వంలో వీఆర్ హైస్కూల్లో నర్సరీ నుంచి 9వ తరగతి వరకు ఉంటుందని, వచ్చే సంవత్సరం ఇంటర్మీడియట్ వరకు నిరుపేద బిడ్డలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించబోతున్నట్లు తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రవాణా సౌకర్యాలతో పూర్తి ఉచితంగా విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన అందుతుందన్నారు. అన్ని రకాల క్రీడా పరికరాలతో క్రీడా మైదానం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌తో పాటు కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, 44 డివిజన్ అధ్యక్షుడు ఏడుకొండలు, క్లష్టర్ ఇన్‌చార్జ్ పుట్ట అజయ్, 45 డివిజన్ అధ్యక్షుడు సుజన్, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని కొనసాగించాలి

**విజయవాడ, జూన్ 15, ప్రభాతవార్త :** రేషనలైజ్ పేరిట విఆర్‌వో పోస్టులు తగ్గించడం అన్యాయమని, పాత పద్ధతి ప్రకారం ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ రెవెన్యూ అధికారిని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్రాధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే తలకు మించిన పనిభారంతో పనిచేస్తున్న తమకు ఈరేషనలైజేషన్ ప్రక్రియతో మరింత పనిభారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న 15వేల మంది గ్రేడ్1,2 విఆర్‌వోలను రేషనలైజేషన్ చేసి సుమారు 7వేలమంది ని మిగులు ఉద్యోగులుగా చూపారని, రేషనలైజేషన్‌తో సంబంధం లేకుండా ప్రతిగ్రామానికి ఒక విఆర్‌ఓ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పలు కారణాలతో నిలిపేసిన విఆర్‌వోలకు బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పనివత్తిడి ఎక్కువగా వున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్టులు పునరుద్ధరించి అర్హులైన విఆర్‌ఓలకు ప్రమోషన్లివ్వాలని కోరారు.

**స్పెషల్ ఛీఫ్ సెక్రటరీకి కృతజ్ఞతలు:** రేషనలైజేషన్లో విఆర్‌ఓ గ్రేడ్ 1, 2 ల క్యాడర్ స్ట్రెంత్ తగ్గకుండా చూడాలని, గ్రామాల్లో రెవెన్యూలో విఆర్‌ఓలు పాత్ర కీలకమని, దీనికోసం గ్రామ రెవెన్యూ అధికారులను ఈ గ్రామ, వార్డు రేషనలైజేషన్ నుండి మినహాయించాలని మెమో జారీ చేసిన 19-9-2025న సిసిఎల్ఎ, స్పెషల్ ఛీఫ్ సెక్రటరీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్రాధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలనాయుడులు కృతజ్ఞతలు తెలిపారు.

## కేరళలో అత్యవసర లాండింగ్ చేసిన బ్రిటన్ ఎఫ్-35 జెట్‌ఫైటర్!

**తిరువనంతపురం, జూన్ 15:** బ్రిటన్‌కు చెందిన ఎఫ్-35బి రకం యుద్ధ విమానం కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్‌చేసింది. హిందూ మహాసముద్రంపై ప్రయాణిస్తున్న సమయంలో అందులో ఇంధనం తగ్గిపోవడమే కారణమని తెలుస్తోంది. ఐదో తరానికి చెందినీ ఫైటర్‌జెట్ యుకెకు చెందిన హెచ్‌ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్‌వేల్స్ క్యారియర్ స్ట్రైక్‌గ్రూప్‌లో భాగం. ప్రస్తుతం ఇండో పసిఫిక్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తోంది. భారత నావికాదళంతో కలిసి యుద్ధ విన్యాసాలు కూడా చేసింది. ఎఫ్-35బి జెట్ ఈప్రాంతంలో ల్యాండింగ్ కావడం అరుదైన సంఘటన అయినా ఇదేమీ అసాధారణ సంఘటన కాదని ఎయిర్‌ఫోర్స్ నిపుణులు చెపుతున్నారు. ఎఫ్-35బి వేరియంట్‌ను స్వల్పదూరంలోనే టే కాఫ్, వర్టికల్ ల్యాండింగ్ కోసం రూపొందించారు. విమాన వాహకనౌకలపై పనిచేసేందుకు వీలుగా ఉంటుంది. ఈ యుద్ధ విమానం సామర్థ్యం, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌సిస్టమ్స్, డేటా షేరింగ్ మౌలిక సదుపాయాల వల్లనే అమెరికా, యుకె, ఇజ్రాయెల్, నాటో వైమానికదళాల్లో అత్యంత కీలకమైనదిగా మారింది. అయితే రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి మాత్రం ఎలాంటి సమాచారం లేదు.



# సినిమా షోకు కోసం దొంగతనం

### రూ.17 లక్షల బంగారు, వెండి నగలు రికవరీ

### చిత్తూరులో బంగారు నగల దుకాణం చోరీ కేసును ఛేదించిన పోలీసులు



ఆదివారం బంగారు నగల దుకాణంలో నగలు దొంగతనం చేసిన నిందితుడిని అరెస్టు చేసి వివరాలు వీడియాకు వెల్లడిస్తున్న ఎఎస్పీ రాజశేఖర్‌రాజు

**చిత్తూరు, జూన్ 15 ప్రభాతవార్త:** సినిమాలు తీసి ఆదాయం గడించాలని భావించిన ఒకతను దొంగతనాలకు పాల్పడి కటకటాలపాలయ్యారు. చిత్తూరు జెండామానువీధిలో ఈ నెల 4వ తేదీ రాత్రి శరవణ బంగారు, వెండి నగల దుకాణంలో జరిగిన చోరీ కేసును చిత్తూరు టుటౌన్ పోలీసులు ఛేధించి దొంగతనానికి పాల్పడిన ఆనంద్(30)ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు పోలీసు గెస్ట్ హౌస్‌లో ఆదివారం అడిషన్ ఎఎస్పీ రాజశేఖర్‌రాజు విలేకరులకు శరవణ బంగారు నగల దుకాణంలో జరిగిన చోరీ చేసిన దొంగ ఆనంద్‌ను అరెస్టు చేసి అతని వద్ద 17 లక్షల రూపాయల విలువైన బంగారు, వెండి నగలతో పాటు ఒక వాహనంను స్వాధీనం చేసుకుని వివరాలు వెల్లడించారు. చిత్తూరులోని జెండామానువీధిలో వున్న శరవణ బంగారు నగల షాపులో ఈ నెల 4వ తేదీ రాత్రి 12 లక్షల రూపాయల విలువైన 131.5 గ్రాముల బంగారు నగలు, 2 లక్షల రూపాయల విలువైన 2.57 కేజీల వెండి నగలు దొంగతనానికి గురయ్యాయి. దీనిపై టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో ఆసక్తికర విషయాలు బహిర్గతం అయ్యాయి. కర్నాటక రాష్ట్రం ఎంఆర్ఎస్ పాళ్య, నంది దుర్గా రోడ్‌కు చెందిన ఆనంద్‌కు సినిమాల పిచ్చి ఎక్కువగా వుండేది. ఎలాగైనా సినిమాలు తీసి బాగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించిన ఆనంద్ సినిమాలు తీసే క్రమంలో తన దగ్గర వున్న డబ్బులు మొత్తం పోగొట్టుకున్నాడు. ఆనంద్ 2020 సంవత్సరంలో కన్నడ భాషలో కీచకుడు అనే సినిమా నిర్మించాలని నిర్ణయించి ప్రారంభించాడు. ఈ సినిమా నిర్మించే క్రమంలో కొన్ని కారణాల వల్ల ఆ సినిమా సగంలోనే ఆగిపోయింది. సినిమా తీయడానికి తన వద్ద వున్న డబ్బులను పెట్టుబడిగా పెట్టిన ఆనంద్ సినిమా పూర్తి స్థాయిలో తీయకపోవడంతో అప్పుల పాలయ్యాడు. ఈ అప్పులను తీర్చడానికి ఆనంద్ దొంగతనాలకు పాల్పడేవాడు. ఇతనిపై ఇప్పటికే కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు పోలీసు స్టేషన్లలో 23 కేసులు వున్నాయి. ఈ క్రమంలో మరోసాని సినిమా నిర్మించి తన అదృష్టం పరీక్షించుకోవాలని నిర్ణయించిన ఆనంద్ 'ఆనంద్ రిటర్న్స్' షార్ట్ ఫిల్మ్ నిర్మించాలని నిర్ణయించాడు. ఈ సినిమా నిర్మాణానికి ఎక్కడైనా పెద్ద ఎత్తున దొంగతనం చేయాలని నిర్ణయించి పక్కాగా ప్లాన్ చేసి చిత్తూరు జెండామానువీధిలోని శరవణ బంగారు, వెండి నగల దుకాణంలో చోరీకి పథకం పన్నాడు. పక్కా ప్లాన్‌లో శరవణ బంగారు నగల షాపులో చోరీకి పాల్పడిన ఆనంద్ నగలతో ఉడాయించాడు. ఈ మేరకు నగల షాపు యాజమాని శరవణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో రంగంలోకి దిగిన టుటౌన్ పోలీసులు ఈ కేసును విచారించారు. అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకుని పక్కా ప్లాన్‌లో ఆనంద్ ఈ దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించిన పోలీసులు శనివారం సాయంత్రం 3.45 గంటలకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యకు అందిన సమాచారం మేరకు బెంగళూరు-చెన్నై బైపాస్ రోడ్డులో వున్న శృతి మిల్క్ డైరీ ఆవరణలో ఆనంద్‌ను పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడు ఆనంద్ నుండి 12 లక్షల రూపాయల విలువైన 131.5 గ్రాముల బంగారు నగలు, 3 లక్షల రూపాయల విలువైన 2.57 కేజీల వెండి నగలు, దొంగతనంకు ఉపయోగించిన 2 లక్షల రూపాయల విలువైన ఒక వాహనంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారు నగల దుకాణంలో జరిగిన చోరీని చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న టుటౌన్ పోలీసులను అడిషనల్ ఎస్పీ అభినందించారు.

# సంస్కరణలు సఫలం: సామాన్యులకు సంకటం

### శ్రీకాళహస్తీశ్వరాలయంలో గందరగోళం




గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భకక్తుల రద్దీ

**శ్రీకాళహస్తి,జూన్ 15 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భకక్తులకు సుదర్శనం, సత్వర దర్శనం కోసం ఆలయాధికారులు సవాలక్ష నిబంధనలను అమలు చేస్తున్నారు. అయితే అక్రమార్కులకు అధికారులు ఏ నిబంధనలు అమలు చేసినా మాకేంటి లెక్క అన్నట్లు మారింది. ఆదివారం ఆలయం భక్తులతో కిట కిటలాడింది. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు సుమారు 30వేలు మంది దర్శించుకున్నారు. రాహుకేతుదోష నివారణ పూజలు ఆరువేలు జరిగాయి. అభిషేకాలు 116 జరిగినట్లు ప్రత్యేక దర్శనం టికెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు సుమారు9వేల మంది ఉన్నారు. అయితే ఆలయంలో అమలు చేస్తున్న సంస్కరణలు సత్ఫలితాల నిస్తున్నాయి. కానీ ఆచరణలో అమలు జరపటంలో సిబ్బంది విఫలమౌతున్నారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద అదే జరిగింది. ఇక్కడ సరైన సెక్యూరిటి వ్యవస్థ లేదు. అధికారుల ఆదేశాలను అమలు చేయటంలో విఫలమౌతున్నారు. ఆలయంలో అంతరాలయ దర్శనానికి రూ.500ల టిక్కెట్లను అమలు చేసారు. దాంతో అతిధులు టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు. అయితే రద్దీ దినాల్లో దర్శనాలకు తిప్పలు తప్పటం లేదు. ఇక సామాన్యభక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలుచేసిన భక్తులను గురుదక్షిణామూర్తి ఆలయం పక్కనుంచి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసారు. అలాగే రూ.200ల లైన్, రూ.50ల లైన్ ఉచిత దర్శనం భక్తులను అనుమతిస్తున్నారు. దాంతో అక్కడ సరైన సెక్యూరిటి వ్యవస్థలేనందువల్ల గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది.

**భక్తుల గొడవ : గందరగోళ:** ఆదివారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద అన్ని క్యూలైన్లనుకలపటంతో కొందరు ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు గొడవకు దిగారు. ఒకరిని నొకరు తోసుకోవటంతో ఏం జరుగుతుందో అనే ఉత్కంఠత చోటు చేసుకుంది. ఇక్కడ సరైన సెక్యూరిటి కానీ భక్తులు అధికంగా ఉన్నపుడు పర్యవేక్షణకు సిబ్బంది కానీ లేదు. ఏదైనా జరిగితే బయట ఉన్న అధికారులు పరుగులు తీయాల్సి వస్తుంది. ఆదివారం ఆదే జరిగింది. భక్తులు తోసులాడుకుంటే ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, సూరింటెండెంట్ నాగభూషణం యాదవ్‌లు పరుగులు తీసారు. గొడవలను సరి చేసారు. అంతరాలయ దర్శనానికి ప్రత్యేకంగా టిక్కెట్లు ఖరారు చేసినపుడు అధికారులు అందుకు ప్రత్యేక సమయం కేటాయిస్తే బాగుంటుంది. అధికారుల నిర్ణయాలు సామాన్యభక్తులకు సంకటంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యలను గుర్తించాలి. ఇక గర్భగుడి వద్ద కూడా తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంటుంది. ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు అంతరాలయ దర్శనం ఏర్పాటుచేసారు. ఈ ముసుగులో కొందరు దళారులు కూడా తమ పబ్బం గడుపుకుంటున్నారు. దాంతో సామాన్య భక్తులకు రెప్పపాటు దర్శనం కూడా లభించటం లేదు.

# దుర్గమ్మవారి ఆలయానికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచాలి

### అధికారులకు ఇఓ ఆదేశం




కృష్ణమ్మకు పంచహారతులు నిర్వహిస్తున్న పండితులు, విద్యుత్ వినియోగం రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఇఓ, నృత్య నీరాజనమర్పిస్తున్న కళాకారులు



**ఇంద్రకీలాద్రి, జూన్ 15, ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మవారి ఆలయానికి సంబంధించిన సోలార్ పవర్ ఉత్పత్తిని పెంచాలని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాన ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పాతపాడు గ్రామంలో వున్న దుర్గమ్మవారి ఆలయ భూములను పరిశీలించిన అనంతరం అక్కడ వున్న దేవస్థానం సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా 5ఎకరాల, 85 సెంట్లలో నెడ్‌క్యాప్ నోడల్ ఏజన్సీగా వ్యవహరించగా, 1 మెగావాట్ విద్యుదుత్పత్తి లక్ష్యంతో ప్లాంట్ 2022 నాటికి పూర్తయ్యి ఉత్పత్తి మొదలైందని సిబ్బంది ఇఓకు వివరించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ నెలకు 1లక్ష 20వేల యూనిట్లను ఉత్పతి చేస్తోందని, ఇంద్రకీలాద్రిపై ప్రస్తుతం 1లక్ష యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని, 20వేల యూనిట్ల మిగులు వుందని తెలిపారు. దీనిపై ఇఓ స్పందిస్తూ మెరుగైన నిర్వహణ పాటిస్తే మరింత మిగులు విద్యుత్ పెరుగుతుందని దీనిపై నోడల్ ఏజన్సీలకు లేఖ రాయాలని ఆదేశించారు. అలాగే ఎప్పటికప్పుడు రిజస్టర్లలో విద్యుత్‌ఉత్పత్తి వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిఇఇ కోటేశ్వరరావు, ఎఇఇ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగ కృష్ణమ్మకు పంచహారతులు:** దుర్గాఘాట్లో పవిత్ర కృష్ణమ్మవారికి ఆదివారం పంచహారతులను వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా పవిత్ర కృష్ణమ్మవారికి ఇఓ వికె శీనానాయక్ పలు వర్ణమయ పుష్పాలను, పసుపు, కుంకుమ, వస్త్రాలను సమర్పించారు. పంచహారతులతో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న పవిత్ర కృష్ణమ్మను భక్తులు ఆసక్తితో తిలకించారు.

**దుర్గమ్మవారి సన్నిథిలో అలరించిన ఆనందతాండవం:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం అనకాపల్లికి చెందిన శ్రీ వేంకట సాయిడాన్స్ అకాడమి నృత్యాచార్య కె శిరీష నేతృత్వంలో 24మంది విద్యార్థులు అద్భుతంగా కూచిపూడి నృత్యప్రదర్శనలందించి భక్తులను ఆకట్టుకున్నారు. ప్రదర్శన అనంతరం దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, వారికి ప్రసాదాలు, మెమొంటోలు అందించారు.

# నీట్‌లో తెలుగోడి సత్తా!

### తెలుగు రాష్ట్రాల నుండి ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఒకేఒక్కడు



**హైదరాబాద్ జూన్ 15 ప్రభాతవార్త:** నీట్ (యూజీ) 2025 ఫలితాలు విడుదలైయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుండి కాకర్ల జీవన్ సాయి కుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు సాధించి తెలుగోడి సత్తా చాటాడు. అలాగే సౌతిండియాలో ఫస్ట్ మార్క్ సాధించి సంచలనం సృష్టించాడు. ఇతర పోటీ పరీక్షలాగా కాకుండా నీటి ఎంతో కఠోర శ్రమ అవసరం. అలాగే సాధించాలన్న సంకల్పం, విషయ నైపుణ్యం అన్నింటినీ మించి ప్రతి విషయంపై స్పష్టత అవసరం. అప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరువ అవుతారు. అలా అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి నారాయణ మార్గదర్శిగా నిలిచిందని జీవన్ సాయికుమార్ పేర్కొన్నాడు.

**విశ్లేషిస్తూ చదివితే విజయం**

ఈ ఏడాది నీట్ పరీక్ష ఎంతో సంక్లిష్టంగా ఉంది. అందులో 720 మార్కులకు గాను 670 మార్కులు దాటారంటే మామూలు విషయం కాదు. మూడు సబ్జెక్టులనూ ఆపోశన పడితేకానీ అది సాధ్యం కాదు. ఎంతో కష్టపడి చదివి 670 మార్కుల మార్కుని అందుకున్న హైదరాబాద్ కుర్రాడు కాకర్ల జీవన్ సాయి కుమార్ నీట్‌లో ప్రతి ప్రశ్ననూ ఎదొర్కొ నేంత విషయపరిజ్ఞానం రావాలంటున్నాడు. అదే తనకు ఆలిండియా 18వ ర్యాంకు తెచ్చిపెట్టిందంటూ తను సన్నద్ధమైన తీరుని ఇలా చెప్పుకొచ్చాడు. మేము ఉండేది హైదరాబాద్‌మా స్వగ్రామం దేవరపల్లి మండలం, దుద్దుకూరు. నాన్న ప్రొఫెసర్ గంగాధర నాగకుమార్, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్, అమ్మ నళినీదేవి గృహిణి. నా చదువంతా హైదరాబాద్‌లోనే సాగింది. 6వ తరగతి నుండి నారాయణ సిఓ స్కూల్లో సిబిఎస్ఈ ఎల్ టెన్త్‌లో90 శాతం, ప్లస్‌టూ మాదాపూర్ నారాయణ కాలేజీలో 98 శాతం మార్కులొచ్చాయి. అక్కడే నీట్ శిక్షణ కూడా తీసుకున్నాను. చిన్నతనం నుంచే వైద్యరంగమంటే ఇష్టం. దానికి నా తల్లిదండ్రులే ప్రేరణ. చిన్ననాటి నుండే ఈ రంగానికి రావాలనే ఆలోచనకు బీజం పడింది. ఆ వైపు అడుగు లేసేందుకే బైపిసి తీసుకున్నాను. ఆ తర్వాత నీటికి సన్నద్ధమయ్యాను. ఆలిండియా ర్యాంకు కోసం అహర్నిశలు కష్టపడ్డాను. అందుకు తగ్గట్టే ఆలిండియా 18వ ర్యాంకు సాధించాను. సాధారణంగా స్టడీస్ నేను సగటు విద్యార్థినే. కానీ వైద్యరంగంపై మక్కు వతో చదివాను, ఆఖరికి సాధించాను.

**నారాయణ గైడెన్స్‌తో సాధించాను:** నీట్ కు సన్నద్ధమవ్వాలంటే ఏ విషయమైనా పరీక్షలు, ప్రశ్నలు అనే కోణంలో కాకుండా దానిపై పూర్తి అవగాహన వచ్చేలా విశ్లేషిస్తూ చదవాలి. ప్రతి అంశాన్నీ విశ్లేషించి అవగాహనతో ముందుకు తీసుకుపోయే ప్రణాళిక ఉండాలి ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో ముందుకు వెళితేనే ఆత్మవిశ్వాసం బలపడుతుంది. దీనికి నారాయణ పరీక్షా విధానం, మార్కుల విశ్లేషణ, సందేహాల నివృత్తి, మైక్రోషెడ్యూల్, ఎర్రర్ లిస్ట్, రివిజన్ ప్రోగ్రామ్ ఎంతగానో సహాయపడింది.

## అమేథిలో ఘోరప్రమాదం

### పికప్‌వాన్‌ను ఢీకొన్న అంబులెన్స్

### ఐదుగురు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

**అమేథి, జూన్ 15:** ఉత్తరప్రదేశ్‌లోని అమేథిలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో ఐదుగురు చనిపోయారు. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై జరిగిన ఈ ప్రమాదంలో మరొ కరు గాయపడ్డారు. లక్నోనుంచి ఘాజి పూర్ బీహార్‌కు మృత దేహాలను తీసు కెళుతున్న ఒక అంబులెన్స్ వాహ నం ఈ ప్రమాదానికి గురయింది. షుకుల్ బజార్‌పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయిన వారిని ఆసుపత్రులకు తరలించారు. అంబులెన్స్ వాహనం ఒక పికప్ వ్యాన్‌ను ఢీకొనడం వల్లనే ఈ ప్రమాదం సంభవించింది. అం బులెన్స్ డ్రైవర్‌తో పాటు వాహనంలో ఉనన ఐదుగురు చనిపోయారు. మృతులు రాజ్‌కుమార్‌శర్మ, అలియాస్ సతీశ్‌శర్మ, రవిశర్మ, సర్ఫరాజ్, అబిద్, ఫూలోశర్మలుగా గుర్తించినట్లు ఎస్ఐ అభినేష్‌కుమార్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన శంభురాయ్‌ను కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లోచేర్చినట్లు తెలిపారు. అమేథి ప్రమాదంపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన సంతాపంప్రకటించారు. బాధితులకు తక్షణమే వైద్యసాయం అందించాలని వారు సత్వరమే కోలుకోవాలని ఆకాక్షిస్తున్నట్లు తెలిపారు. గత మే 31వ తేదీ కూడా ఒక పెళ్లికి వెళ్లి తిరిగివస్తున్న సందర్భంగా జరిగిన ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు చనిపోయారు. హర్దోయి జిల్లాలో తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది.

## విమానప్రమాద మృతులకు 'నైటా' సంతాపం

### ప్రమాదాల నివారణకు ఎయిర్ ఇండియా చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** అహ్మదాబాద్ దుర్ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యూయార్క్ తెలంగాణ తెలుగు అసోసియేషన్ (నైటా) తీవ్ర సంతాపం ప్రకటించింది. న్యూయార్క్ లో జరిగిన ఒక కార్యక్రమంలో నైటా అధ్యక్షురాలు వాణి అనుగు, కార్యవర్గం, సభ్యులు మృతులకు నివాళులు అర్పించి, మౌనం పాటించారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం ఎన్ఆర్ఐలుగా తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయుల సంఖ్య భారీగా పెరిగిందని, వారంతా భారతదేశం రాకపోకలకు తరచుగా ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించేందుకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఎన్ఆర్ఐల్లో ఆత్మవిశ్వాసం నింపాలంటే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నైటా కార్యవర్గం భారత ప్రభుత్వాన్ని కోరింది.

# కృష్ణా రిజర్వాయర్లకు జలకళ

## జూరాల, సుంకేశుల జలాశయాలకు వరద ప్రవాహం

## నిలకడగా సాగుతున్న గోదావరి

## మధ్యతరహా ప్రాజెక్టుల్లో అధికంగా నీటి నిల్వలు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలకు ప్రాణధారమైన కృష్ణానదిలో జలప్రవాహం పెరిగితే గోదావరి నది మందగమనంతో ప్రవహిస్తున్నది. సంగమేశ్వర దేవాలయం ముంపుకు గురైంది. కృష్ణాగోదావరి నదులపై ఉన్న జలాశయాల్లో 289.52టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. గత ఏడాది కంటే 81.46టిఎంసిల అధికస్థాయి నీరు జలాశయాల్లో ఉంది.పోయిన ఏడాది జూన్ 15న 207.06టిఎంసిల నీరు మాత్రమే జలాశయాల్లో ఉంది. తెలంగాణతో పాటు ఎగువన ఇతర రాష్ట్రాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ, ముసురు వర్షాలకు జూరాల జలాశయానికి వరద వస్తోంది. కృష్ణానదిలో రోజురోజుకూ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. జూరాల, సుంకేసుల జలాశయం నుంచి వస్తున్న వరదజలాల ప్రవాహంతో మండలంలోని మంచాలకట్ట, జటప్రోల్, మల్లేశ్వరం, కొల్లాపూర్ మండలంలోని సోమశిల, అమరగిరి తదితర గ్రామాల్లో కృష్ణానది నీటి మట్టం పెరిగింది. కృష్ణానదికి వరద పెరగడంతో నదిలో చేపలు పట్టడానికి మత్స్యకారులు ఎవరూ వెళ్ల రాదని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఉండే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులను అధికారులు హెచ్చరిస్తున్నారు. గోదావరి కృష్ణనదులపై ఉన్న జలశయాల్లో గత ఏడాదితో పోల్చితే నీరు సంతృప్తికరంగానే ఉంది. వ్యవసాయ పనులు ప్రారంభించడానికి వీలుగా నీరు ఉంది. లాల్‌బహదూర్ శాస్త్రి అలమట్టి ప్రాజెక్టులో గత ఏడాది 26.96 టిఎంసిల నీరు ఉంటే ఈ యేడాది65.95టిఎంసిల నీరు ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్ట జలాశయంలో ఉంది. నారాయణపూర్‌లో 31.47 టిఎంసిలు ప్రస్తుతం నీరు ఉండగా గత ఏడాది ఇదే రోజు 24.92 టిఎంసిలు ఉంది.ఉజ్జయినిలో 87.4టిఎంసిలు ప్రస్తుతం ఉండగా గత ఏడాది 36.98 టిఎంసిలు ఉంది. జూరాలలో గత ఏడాది కంటే 1.73 టిఎంసిలు తక్కువ నీరు ఉంది. గత ఏడాది 7.89టిఎంసిలు ఉంటే ఈ ఏడాది 6.16 టిఎంసిలు మాత్రమే ఉంది. ఐతే పై నుంచి నీటి వరద వస్తున్నది. తుంగభద్రలో 26.87టిఎంసిలు ఉంటే గత ఏడాది 6.02టిఎంసిలు నీరు ఉంది.శ్రీశైలంలో గత ఏడాదితో పోల్చితే 25టిఎంసిలు నీరు అధికంగా జలాశయంలో ఉంది.పోయిన ఏడాది 34.79 టిఎంసిలు ఉంటే ఈయేడాది 60.46టిఎంసిలు అందులో ఉంది. నాగార్జునసాగర్‌లో కూడా 14.48టిఎంసిలు అధికంగా నీరు ఉంది గత ఏడాది 122.69 టిఎంసిల నీరు ఎస్ఎస్‌పిలో ఉండగా ప్రస్తుతం అందులో 137.17టిఎంసిల నీరు అందులో ఉంది. పులిచింతలలో 24.63 టిఎంసిలు ఉంది గతజూన్ 15న ఇక్కడ 0.75టిఎంసిల నీరుమాత్రమే నిల్వ ఉండేది. కృష్ణ డెల్టాలో కూడా పోయిన ఏడాదితో పోల్చితే ఒక టిఎంసి అధికంగా ఉంది. అధికంగా ఉంది 3.07 టిఎంసిలు ప్రస్తుత నీటినిల్వ అని అధికారులు తెలిపారు.గోదావరిలో కూడా నీరు గత ఏడాదితో పోల్చితే ఎక్కువగానే ఉంది.గైక్వార్డ్ ప్రాజెక్టులో 48.9 టిఎంసిలునీరు ఉంది. గత ఏడాది ఇదే రోజు ఇక్కడ 30.4 టిఎంసిల నీరు ఉంది. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామసాగర్‌లో గత ఏడాది కంటే 6టిఎంసిలు అధికంగా నీరు ఉంది. శ్రీరామసాగర్‌లో 13.83టిఎంసిలు ఉంది. సింగూరులో 19.31 టిఎంసిలు, నిజామ్‌సాగర్‌లో 6.06 మిడ్‌మానేరులో 6.92 టిఎంసిలు, లోయర్‌మానేరులో 6.47, కడెంలో .065టిఎంసిలు,శ్రీపాద ఎల్లంపల్లిలో 8.7గోదావరి డెల్టా3.01 టిఎంసిలు నీరు ఉంది. తెలంగాణలోని గోదావరి బేసిన్‌లోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో గరిష్టనిల్వ 46658 ఎంసిఎఫ్‌టి కాగా ప్రస్తుతం 17989 ఎంసిఎఫ్‌టి నీరు ఉంది. కృష్ణాబేసిన్‌లోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో 7674 ఎంసిఎఫ్‌టి నీరు నిల్వఉంది. మొత్తంగా మధ్యతరహాప్రాజెక్టుల్లో గత యేడాది కంటే నీరు అధికంగానే ఉంది.తెలంగాణలో మధ్యతరహా ప్రాజెక్టులు మొత్తం గరిష్టంగా 62126 ఎంసిఎఫ్‌టి నిల్వ నీరు సామర్థ్యం కలిగి ఉంటే ప్రస్తుతం అందులో 25660 టిఎంసిల నీరు నిలిచి ఉంది. గోదావరి బేసిన్‌లోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో 1059 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉండగా కృష్ణా బేసిన్‌లో 720 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉంది. మొత్తంగా రెండు బేసిన్‌లలో 1779 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఉంది.

# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్రపతి, పిఎం జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి కింది స్థాయి నుంచి ఎదిగిన నాయకుడని కొనియాడారు. బొగ్గు, గనుల రంగాన్ని ఆయన బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశ స్వయం సమృద్ధికి ఇది ఎంతో ముఖ్యమని వివరించారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఎక్స్ వేదికగా ప్రధాని పోస్ట్ చేయగా, దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రధానికి కేంద్రమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మీ దార్శనిక నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. వికసిత భారత్ నిర్మాణంలో మీ ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధాని మంత్రి నరేంద్రమోడీతోపాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫోన్ చేసిన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రైతు సంక్షేమానికి రూ.78 వేల కోట్లు ఖర్చు

## నేడు రైతులతో సిఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర లోనే రైతు సంక్షేమానికి 78 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొనున్న ముఖ్యమంత్రి రేవంతరెడ్డి రైతులతో ముఖాముఖీలో పాల్గొంటారన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం రైతు నేస్తం ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం చేతుల మీదుగా రాష్ట్రంలోని 1,034 రైతు వేదికల్లో కొత్తగా రైతునేస్తం కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,600 రైతువేదికలలో ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 566 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి ప్రతీ మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 6.35 లక్షల మంది రైతుల ప్రతీ మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడమే కాకుండా, వివిధ రైతుల అనుభవాలను తెలుసుకొన్నారని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# 20న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల బంద్‌కు మావోయిస్టుల పిలుపు

### మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** దేశంలో భారతీయ జనాతా పార్టీ హిందూత్వ, ఫాసిస్టు కగార్ ఆపరేషన్ దాడులను ఖండిస్తూ ఈ నెల 20వ తేదిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలు బంద్ పాటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఆదివారం పత్రికలకు విడుదల చేసిన ఒక సుదీర్ఘ ప్రకటనలో పిలుపునిచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మావోయిస్టు పార్టీలో 45ఏళ్ల పాటు సుదీర్ఘ విప్లవోద్యమం అనుభవం కల్గిన రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ టిఎల్ఎన్ఎస్ చలం అలియాస్ ఆనంద్, సుధాకర్, గౌతం 30ఏళ్లపాటు విప్లవోద్యమంలో అనుభవం కల్గిన నేత అతనితో పాటు మైలారపు ఆడేల్లు అలియాస్ భాస్కర్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు ఏడుగురిని పాలకప్రభుత్వాలు క్రూరంగా హత్య చేసిన దమనకాండను నిరసిస్తూ బంద్ పిలుపునిచ్చినట్లు జగన్ తన లేఖలో పేర్కొన్నారు.

కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ హిందూత్వ, ఫాసిస్టు ప్రభుత్వం 2026 మార్చి 31నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని ఇప్పటికి పలుమార్లు ప్రకటించడం జరిగింది. 2024 జనవరి నుండి అపరేషన్ కగార్ పేరుతో దేశంలోను మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలన్నింటిలోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తూ, ఎదురుకాల్పుల పేరుతో నరసంహారం కావిస్తుందని, ఆదివాసీలకు చెందిన అటవి సంపదన, ఖనిజ సంపదన కార్పోరేట్ శక్తులకు అందించే ఏకైక లక్ష్యంతో అటవి ప్రాంతాల్లోని ఆదివాసీలపై దమనకాండ కొనసాగిస్తూ, వారికి అండగా ఉండే మావోయిస్టు పార్టీపై వరుసగా దాడులు చేస్తూ ఇప్పటికే 550మందికి పైగా మావోయిస్టులను హత్య చేసిందని జగన్ తన లేఖలో పేర్కొన్నారు. మే నెల 21న మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరి కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బస్వారాజ్‌లతో పాటు 27మంది మావోయిస్టులను పొట్టన పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ 3 నుండి నేషనల్ అటవి ప్రాంతాన్ని చుట్టుముట్టి దాడిచేసి ఏడుగురు కామ్రేడ్స్‌ను హత్యచేసిందని మావోయిస్టు నేత జగన్ తన లేఖలో తీవ్రంగా దుయ్యబట్టారు.




హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు సన్మానిస్తున్న ఫెడ్ అధ్యక్షుడు గంగారం తదితరులు

# కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు

**హైదరాబాద్ (మలక్‌పేట), జూన్ 15, ప్రభాతవార్త:** కమ్యూనిటీ మీడియషన్ సెంటర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ డిసేబుల్డ్ సంస్థ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర న్యాయ సేవాసంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన యూనివర్సల్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించడానికి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు కృషి చేస్తాయని తెలిపారు. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్స్‌లో శిక్షణ పొందిన మీడియేటర్లను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. హైకోర్టు తాత్కాలిక చీఫ్‌జస్టిస్ సుజయ్‌పాల్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్స్‌ను రాష్ట్రంలో ప్రారంభించారని వివరించారు. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్స్‌లో ఉచితంగా సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ కార్యదర్శి పంచాక్షరి మాట్లాడుతూ రాష్ట్రంలో 30 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పద్ధతి ప్రకారం మధ్యవర్తిత్వం చేసి వివాదాలను పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా న్యాయ సేవా కార్యదర్శి కిరణ్మయి, న్యాయ సేవ పరిపాలన అధిక రాజు, శిక్షణ పొందిన మీడియేటర్ అబ్దుల్ లతీఫ్ అహ్మద్, ఫెడ్ అధ్యక్షులు గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, ఆసిఫ్, రాకేష్, సురేష్, గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

## గాంధీభవన్‌లో కేక్ కట్‌చేసి రక్తదానం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

## డిప్యూటీ సిఎంకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రులు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినాన్ని ఆదివారం గాంధీభన్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనం గా జరుపు కున్నారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు సిఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మంత్రులు కూడా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ట్విట్టర్ లో భట్టికి జన్మదిన శుభాకాంక్షలు



తెలియజేస్తూ సామాజిక న్యాయం కోసం పాటుపడే ఉపముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో నిరంతరం ప్రజాసేవలో యువ రాజకీయవేత్తలకు మార్గదర్శిగా ఉండాలని ఆకాంక్షించారు. స్వశక్తివంతుడైన దేవుడు మీకు నిరంతరం విజయం, సేవగుణంతో ముందుకు నడిచే శక్తి ఇవ్వాలని మహేష్ కోరుకున్నారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'భట్టి విక్రమార్క గారి నాయకత్వం వర్ధిల్లాలి,కాంగ్రెస్ పార్టీ జిందాబాద్' అంటూ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు వేణు గౌడ్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి కాంగ్రెస్‌పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చారని కొనియాడారు. యావత్ తెలంగాణ ప్రజానీకం తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రజల కోసం నిరంతరం శ్రమించే నేత భట్టి విక్రమార్క అని ఆయన కొనియాడారు. ఆయన ప్రజాసేవకు అంకితభావం అందరికీ ఆదర్శమని అందుకే ఆయన జన్మదిన రోజు అన్నీ దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది చేస్తున్నామని అన్నారు. భట్టి జన్మదినం ఎందరికో ఇది ప్రాణదానం కావాలని ఆశిస్తున్నామని తెలిపారు.. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్గ సభ్యులు రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తున్నారని అన్నారు.

# దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ఆపరేషన్ కగార్

## 23న చలో రాజ్‌భవన్ కార్యక్రమం

## ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** దేశంలోని సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకే ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి మండిపడింది. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసిందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఛత్తీస్‌గడ్‌లోని మావోయిస్టులు, అమాయక గిరిజనులపై క్రూర దాడులు జరిపి భయానక నరమేధాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుంది. ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని ఏఐవైఎఫ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం హిమాయత్ నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయం(సత్య నారాయణరెడ్డిభవన్)లో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ మావో యిస్టులతో కేంద్రం చర్చలు జరపాలన్నారు.

అటవీ సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని.. అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అని విమర్శించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జరిపిన మావోయిస్టుల హత్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తుందని మండిపడ్డారు. మావోయిస్టులను అంతం చేయడానికి డెడ్‌లైన్ విధించి, ఆ సంస్థలను అంతం చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం వెనుక ఆర్ఎస్ఎస్ రహస్య అజెండాను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని మండిపడ్డారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు.

మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ఉగ్రవాదుల సమస్య పరిష్కారానికి పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరుపుతున్న మోడీ ప్రభుత్వం.. రాజకీయ సమస్య పరిష్కారానికి మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23న అడవుల్లోని ఖనిజ సంపదను, వనరు లను కార్పొరేట్లకు దోచిపెట్టే ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ చలో రాజ్‌భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా సరిత

## అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## సరితకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు

## మహిళా సాధికారత దిశగా ఆర్‌టిసి పయనం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ఆర్‌టిసి)లో తొలి మహిళా డ్రైవర్ బాధ్యతలు చేపట్టారు. తొలి మహిళా డ్రైవర్‌గా ఒక గిరిజన మహిళ చేరారు. తొలి మహిళా డ్రైవర్‌గా బాధ్యతలు చేపట్టిన సరితను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించగా.. రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సిత్య తండాకు చెందిన వి సరిత మిర్యాలగూడ డిపోలో జెబిఎం సంస్థ నుండి ఆర్‌టిసి ఎలక్ట్రిక్ బస్సు మహిళా డ్రైవర్‌గా విధుల్లో చేరారు. సరిత హైదరాబాద్ టూ మిర్యాలగూడ బస్సును నడుపుతున్నారు. గతంలో ఢిల్లీలో రవాణా సంస్థలో 10 సంవత్సరాలు డ్రైవర్‌గా విధులు నిర్వహించారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తనకు స్వస్థలంలో డ్రైవర్‌గా అవకాశం ఇవ్వాలని ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన సరిత మంత్రికి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి అధికారులతో జెబిఎం సంస్థ ప్రతినిధులతో మాట్లాడి మిర్యాలగూడ డిపో నుండి నియమించారు. తనకు అవకాశం ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మహిళా డ్రైవర్ సరిత ధన్యవాదాలు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తుందని ఇప్పటికే మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు చేపట్టా మని.. తాజాగా ఆర్‌టిసిలో మహిళా డ్రైవర్‌గా అవకాశం ఇవ్వడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలు పురుషులతో సమా నంగా అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

**సరితకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు**

ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా చేరిన వాంకుడోతు సరితకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అవకాశాలు వస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపించారని ప్రశంసించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసిన సరితకి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం ఆర్‌టిసి బస్సులకు మహిళలనే యజమానులుగా చేస్తున్న సందర్భంలో, మహిళా డ్రైవర్ నియామకం ఒక కీలక ముందడుగని పేర్కొన్నారు. మహిళలు విద్య, విజ్ఞానం, వృత్తి, వ్యాపారం, క్రీడలు, సైన్యం వంటి అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని చెప్పారు. గృహ బాధ్యతలు, సమాజ నిర్మాణంలోనూ మహిళల పాత్ర అపూర్వమైనదిగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ, అడ్డంకులను అధిగమించి మహిళలు విజయాల బాటలో ముందుకెళ్తున్నారని, ఈ క్రమంలో సరిత అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలకు సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు ప్రారంభించిందని సిఎం గుర్తుచేశారు. కోటి మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధన కోసం ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

**ఆర్‌టిసిలో శాశ్వత డ్రైవర్‌గా ఉద్యోగం కల్పించాలి**

తెలంగాణ ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్ అయిన సరితకు ఆర్‌టిసిలో పర్మినెంట్ డ్రైవర్‌గా ఉద్యోగం కల్పించి ఆమెకు గౌరవం కల్పించేలా చూడాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి, ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌కు స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. డ్రైవర్ సరితను ఆర్‌టిసిలో నియమించకుండా ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీ అయిన జెబిఎం సంస్థలో, అది కూడా మంత్రి సహకారంతో తాత్కాలిక ఉద్యోగం కల్పించి ఆమెకు సరైన గౌరవం కల్పించక పోవడం, పైగా జెబిఎం సంస్థలో ఉద్యోగం ఇప్పించడమే గొప్పపని అన్నట్లు పత్రికలకు ప్రకటన విడుదల చేయడం అత్యంత బాధాకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావ్ అన్నారు.

# గోదావరిలో ఐదుగురు మృతికి మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి

### కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో స్నానం చేస్తూ ఐదుగురు యువకుల మృతి చెందడం పట్ల బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కి చెందిన కుటుంబం బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చి ఆదివారం ఉదయం గోదావరిలో స్నానానికి వెళ్లగా ఐదుగురు యువకులు గల్లంతై మృతి చెందిన ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల వద్దకు, నదుల వద్దకు వెళ్ళినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని అందరికీ సూచించారు. ఈ ఏడాది జనవరిలో కొండపోచమ్మ సాగర్‌లో ఐదుగురు యువకులు, వారం రోజుల క్రితం మేడిగడ్డ ప్రాజెక్ట్‌లో పడి ఆరుగురు యువకులు మృతి చెందదారని.. ఇలాంటి ఘటనలు జరగకుండా తల్లిదండ్రులు వారి పిల్లలను నదులు, కాలువలు ప్రాజెక్టుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టులు, కాలువల వద్ద లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రేపటి మంచి భవిష్యత్ కలిగిన యువకులు ఇలా చనిపోవడం బాధాకరమని.. వారి కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. బాసర గోదావరి నదిలో మృతి చెందిన ఐదుగురు యువకులకు సంతాపాన్ని వ్యక్తం చేస్తూ.. వారి కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# బాసర ఘటనతో హైదరాబాద్‌లోని మూసారాంబాగ్, చింతల్‌లో విషాద ఛాయలు

**హైదరాబాద్(మలక్‌పేట, జూన్ 15, ప్రభాతవార్త :** ప్రభాతవార్తబాసర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించింది కానీ వెళ్లిన ఐదుగురు యువకులు నీటమునిగి మరణించడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజస్థాన్ రాష్ట్రం నుంచి జీవనోపాధికై నగరానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన బంధువులు, నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లిన వారి పిల్లలు ఐదుగురు గోదావరిలో నీట మునిగి చనిపోవడంతో శోకసంద్రంలో మునిగిపోయాయి. వివరాల్లోకి వెళ్తే రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కిరాణా వ్యాపారి ప్రవీణ్, వారి బంధువుల కుటుంబాలు కొన్నేళ్ల క్రితం జీవనోపాధికై నగరానికి వచ్చి వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ప్రవీణ్, అతని బంధువు మోహన్ కుటుంబం మూసారాంబాగ్ డివిజన్ శాలివాహనగర్లో నివాసం ఉంటుండగా, రాకేష్ (20),మదన్ (18), భరత్ (16)ల కుటుంబాలు చింతల్ డివిజన్ చంద్రా నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రవీణ్ ప్రతాప్ నగర్ భాష్యం స్కూల్ చౌరస్తా వద్ద కిరాణా షాప్ నిర్వహిస్తుండగా, అతని తమ్ముడు రితిక్ (22) కూడా అందులోనే పనిచేస్తున్నాడు. కాగా అతని బంధువు వరుసకు తమ్ముడైన మోహన్ (19), చింతల్ డివిజన్ చంద్రానగర్ కాలనీకు చెందిన వారి బంధువులు రాకేష్(20), మదన్(18), భరత్ (16) లు కలిసి బాసర వద్ద గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లారు. అయితే గోదావరి నదిలో వీరు దిగినచోట లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి గల్లంతయ్యారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చేపట్టగా, వారి మృత దేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పిల్లల మరణ వార్తను మృతుల కుటుంబాలకు సమాచారం అందించడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. గుండె లవిసేలా రోదిస్తూ వెంటనే బాసరకు బయలుదేరి వెళ్లారు. దాంతో శాలివాహనగర్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.




# లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదరింపు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** జర్మనీ దేశం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చేందుకు టేకాఫ్ అయిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ఎల్‌హెచ్752 విమానంలో బాంబు అమర్చినట్లు ఆదివారం రాత్రి దుండగులు బెదిరింపు కాల్ చేశారు. దీంతో విమాన సిబ్బంది అప్రమత్తమై అక్కడే తిరిగి ప్రయాణమై ఫ్రాంక్‌ఫోర్టు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేసినట్లు విమానయాన సిబ్బంది తెలిపారు. అనంతరం భద్రతసిబ్బంది విమానాన్ని అణువణువు తనిఖీ చేశారు.

# విద్యుత్ తీగలు తెగిపడి ఇద్దరు వ్యక్తులు సజీవదహనం

### వీధిశునకం కూడా మృతి

**హైదరాబాద్ (మన్సూరాబాద్), జూన్ 15, ప్రభాతవార్త:** 11 కెవి విద్యుత్ తీగలు తెగిపడి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపై పడిపోవడంతో పాటు ఓ శునకంపై పడడంతో సజీవ దహనమైన సంఘటన ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఎల్‌బినగర్‌లోని సాగర్ రింగ్‌రోడ్డు చౌరస్తా వద్ద ఉన్న బాబాయి హోటల్ పక్కనే రేణుకా దేవాలయం ఉంది. దేవాలయం ఫుట్‌పాత్‌పై ఇద్దరు గుర్తుతెలియని యాచకులు నిద్రిస్తున్నారు. వారితో పాటు ఓ వీధి శునకం కూడా ఉంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అక్కడి నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లే 11 కెవి హైటెన్షన్ వైరు తెగి అక్కడ నిద్రిస్తున్న వారిపై పడిపోవడంతో పాటు శునకంపై పడింది. దీంతో ఆ వ్యక్తులతో పాటు శునకం సజీవ దహనం అయ్యింది. దీనిని గమనించిన స్థానికులు ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు అక్కడి పరి స్థితిని పరిశీలించి 11 కెవి విద్యుత్ తీగలు బాధితులపై పడ్డట్లు నిర్ధారించారు. మృతి చెందిన వారిలో ఒక ఆడ, ఒక మగ వ్యక్తి ఉన్నట్లు గుర్తించారు. అయితే వారి వివరాలు తెలియలేదు. మృతి చెందిన వారు ఉదయం పూట చెత్త ఏరుకుని జీవనం సాగిస్తున్నట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసును నమోదు చేశారు. పోలీసులతోపాటు చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు చేపట్టారు. కేసును ఎల్‌బినగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# '8 వసంతాలు' ప్యూర్ లవ్ స్టోరీ

## హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్



పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన '8 వసంతాలు' ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్ సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ సినిమా ప్రమోషన్స్ మెటీరియల్ చూస్తుంటే ఈ కథంతా మీ చుట్టూనే ఉంటుందనిపిస్తుంది?**

ఇది విమెన్‌కి సంబంధించిన కథ. కథలో అమ్మాయి పాత్ర కీలకం అయినప్పటికీ మిగతా పాత్రలన్నిటికీ సమానంగా ప్రాముఖ్యత వుంది. ప్రతి క్యారెక్టర్ ఇంపార్టెంట్. ప్రతి క్యారెక్టర్ కి లేయర్స్ ఉంటాయి.

**మ్యాడ్ తర్వాత ఈ సినిమాని ఎంచుకోవడానికి కారణం?**

మంచి కథ కోసం వెయిట్ చేశాను. ఈ కథలో నేను కోరుకున్న ప్రతిదీ ఉంది. నాకు యాక్షన్, బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చేయాలని ఉండేది. అవన్నీ కూడా ఈ కథలోనే కుదిరాయి. ఫర్ఫార్మెన్స్ చేయడానికి చాలా మంచి స్కోప్ ఉండే క్యారెక్టర్. కథ చదివినప్పుడు చాలా కనెక్ట్ అయ్యాను. నేను శుద్ధి యోగ్య పాత్రలో కనిపిస్తాను. తను ఒక రచయిత అలాగే తనకి మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం కూడా ఉంటుంది.

**ఈ ప్రేమ కథలో ప్రత్యేకత ఏమిటి ?**

చాలా ప్యూర్ లవ్ స్టోరీ ఇది. రియల్ ఒక జీవితాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. అన్ని ఏజ్ గ్రూప్స్ కి రిలేట్ అవుతుంది.

**ఈ సినిమా కోసం ఎలా ప్రిపేర్ అయ్యారు?**

నాకు బ్లాక్ బెల్ట్ వచ్చు. ఈ సినిమా కోసం కళరి ఫైట్ నేర్చుకున్నాను. అలాగే వింగ్ చున్ అనే చైనీస్ ఆర్ట్ ఫామ్‌ని కూడా నేర్చుకున్నాను. దాని కోసం మూడు నెలలు అంజి మాస్టర్ దగ్గర ట్రైనింగ్ తీసుకున్నాను.

**మిగతా నటీనటుల గురించి?**

హను రెడ్డి వెరీ గుడ్ యాక్టర్. చాలా ఫాస్ట్‌గా నేర్చుకుంటారు. రవి కూడా చాలామంచి యాక్టర్. ఎంత పెద్ద డైలాగ్ అయినా సులువుగా చెప్పగలరు.

**డైరెక్టర్ ఫణీంద్ర గురించి**

ఫణీంద్ర గారు నాకు గురువు లాంటి వారు. ఈ జర్నీలో ఎన్నో విషయాలు ఆయన నుంచి నేర్చుకున్నాను. ఆయన క్లియర్ విజన్‌తో ఉంటారు. చాలా పాషనేట్ ఫిలిం మేకర్. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్.

**శుద్ధి అయోగ్య అనేది చాలా ఎమోషనల్ క్యారెక్టర్ కదా.. షూట్ తర్వాత ఎలా అనిపించింది?**

ఇంటికి వచ్చిన తర్వాత అద్దం చూసుకుంటే చాలా మిస్సింగ్ ఫీలింగ్ అనిపిస్తుంది. ఆ క్యారెక్టర్, బిహేవియర్ అవన్నీ నాకు గుర్తుచ్చేవి. వెరీ మెమరబుల్ క్యారెక్టర్.

**మైత్రి మూవీ మేకర్స్ గురించి ?**

మైత్రి మూవీ మేకర్స్‌తో వర్క్ చేయడం అద్భుతమైన ఎక్స్ పీరియన్స్. నన్ను బిలీవ్ చేసి ఈ ప్రాజెక్టులో తీసుకున్నందుకు నిర్మాతలకు థాంక్స్ చెప్తున్నాను. ఈ జర్నీలో చాలా సపోర్ట్ చేశారు. ఇలాంటి సినిమాని తీయ డానికి చాలా గట్స్ కావాలి.

**మ్యూజిక్ గురించి?**

హేషమ్ రెండు బ్యూటీ ఫుల్ సాంగ్స్ ఇచ్చారు. రెండు పాటలు ఆడియన్స్‌కి చాలా నచ్చాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంటుంది.

**మీరు యాక్టర్ కాకపో యినా ఇంకేం అయ్యేవారు?**

పొలిటీషియన్ అవ్వాలని ఉంది నా కోరిక. అందుకే లా చదువుతున్నాను. అయితే అది ఇప్పుడు కాదు నాకు ఒక 40 ఏళ్లు వచ్చిన తర్వాత(నవ్వుతూ)

**మీకు డ్రీమ్ రోల్స్ ఉన్నాయా?**

పవర్ఫుల్ అండ్ స్ట్రాంగ్ రోల్స్ చేయడానికి ఇష్టపడతాను

# 'హిట్ 3' బ్యూటీకి క్రేజీ ఛాన్స్

దక్షిణాదిలో మోస్ట్ పాపులర్ హీరోయిన్లలో ఆమె ఒకరు. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు వరుస హిట్స్ ఖాతాలో వేసుకుంటుంది. అంతేకాకుండా ఇప్పుడిప్పుడే తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అవకాశాలు సొంతం చేసుకుంటుంది. తనే హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కేజీఎఫ్ సినిమాతో కన్నడ సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. తొలి చిత్రమే పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ అయ్యింది. ఆ తర్వాత కోబ్రా సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఇక ఇటీవలే హిట్ 3 సినిమాతో మరో విజయాన్ని అందుకుంది. న్యాచురల్ స్టార్ నాని నటించిన ఈ సినిమాతో తెలుగు సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. మరోసారి అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. దీంతో ఇప్పుడు తెలుగులో ఈ బ్యూటీకి మరిన్ని ఆఫర్స్ రానున్నట్లు తెలుస్తోంది. తాజాగా



ఈ అమ్మడుకు మరో క్రేజీ ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. లేటేస్ట్ టాక్ ప్రకారం ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో సినిమాలో ఈ అమ్మడు నటించనున్నట్లు సమాచారం.

తాజాగా కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టికి తమిళంలో భారీ ఛాన్స్ వచ్చింది. అదేంటంటే.. తమిళ్ స్టార్ హీరో అజిత్ త్వరలో నటించనున్న తన 64వ సినిమాలో శ్రీనిధిని ఎంపిక చేశారని టాక్. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. ఇటీవలే గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో హిట్ అందుకున్న అజిత్.. ఇప్పుడు తన నెక్స్ ప్రాజెక్ట్ కోసం రెడీ అవుతున్నారు. విడాముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాల తర్వాత ఇప్పుడు అజిత్ చేయబోయే సినిమాపై మరింత హైప్ నెలకొంది. అజిత్ 64వ చిత్రానికి కూడా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారని నివేదికలు తెలుపుతున్నాయి.

ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నవంబర్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదల చేయనున్నారు. ఇక ఇప్పుడు ఈ సినిమాలో కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి నటించనున్నట్లు టాక్. ఈ సినిమాను పాన్ ఇండియా లెవల్లో రూపొందించనున్నారు

# 'తమ్ముడు' నుంచి ఫస్ట్ లిరికల్ సాంగ్ 17న రిలీజ్..

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న 'తమ్ముడు' సినిమా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'భూ అంటే భూతం..' రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. ఈ నెల 17న సాయంత్రం 5గంటలకు ఈ పాటను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తన మేనకోడలిని ఆడిస్తూ కథానాయకుడు పాడే సందర్భంలో 'భూ అంటే భూతం..' పాటను చిత్రీకరించారు. ఈ పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి ఆకట్టుకునేలా పాడారు.

నటీనటులు నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య, తదితరులు

టెక్నికల్ టీమ్ సినిమాటోగ్రఫీ కేవీ గుహన్, ఎడిటింగ్ ప్రవీణ్ పూడి మ్యూజిక్ అజనీష్ లోకనాథ్, పీఆర్వో వంశీ కాకా, జీఎస్ కే మీడియా, బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, నిర్మాత దిల్ రాజు, శిరీష్, రచన దర్శకత్వం శ్రీరామ్ వేణు




# 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' నుంచి సాంగ్ రిలీజ్



యంగ్ హీరో నరేష్ అగస్త్య, దర్శకుడు విపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై ఉమా దేవి కోట నిర్మించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు సినిమాపై అంచనాలను పెంచాయి. చిత్రంలో రబియా ఖతూన్ కథానాయిక. ఫస్ట్ సింగిల్ 'సౌండ్ ఆఫ్ లవ్' విడుద లతో మేకర్స్ మ్యూజిక్ జర్నీ ప్రారంభిం చారు. జస్టిన్ ప్రభాకరన్ 'సౌండ్ ఆఫ్ లవ్'ని మనసుని కదిలించే సాంగ్‌గా కంపోజ్ చేశారు. అన్నీ సహజమైన శబ్దాలతో ఈ సాంగ్ ని కంపోజ్ చేయడం విశేషం. గొప్ప ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట క్లాసిక్ రొమాంటిక్ మ్యూజిక్ ఎసెన్స్ ని అందించింది,'సౌండ్ ఆఫ్ లవ్'కు రెహ్మాన్ పొయిటిక్ సాహిత్యం ఆకట్టుకుంది. ఎస్పీబీ చరణ్, షాషా తిరుపతి వాయిస్‌లు మ్యాజికల్‌గా వున్నాయి. విజువల్‌గా పాట అద్భు తంగా వుంది. నరేష్ అగస్త్య, రబియా ఖటూన్ కెమిస్ట్రీ హార్ట్ ఫుల్‌గా వుంది. 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' మేకర్స్ ఈ చిత్రాన్ని త్వరలో థియేటర్లలో విడు దల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

# జూలై 5న రానున్న 'లోపలికి రా చెప్తా'

కొన్ని సినిమాలు చిన్నగా స్టార్ట్ అయ్యి, పబ్లిసిటీ పరంగా క్యూరియాసిటి పెంచుతూ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తాయి. అటు మాస్ ఇటు క్లాస్ ప్రేక్షకులను ఆకట్టుకుని సక్సెస్ దిశగా పయనిస్తాయి. ఆ కోవలోని చిత్రమే 'లోపలికి రా చెప్తా'. మాస్ బంక్ మూవీస్ పతాకంపై కొండా వెంకట రాజేంద్ర, మనిషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ హీరో హీరోయిన్లుగా లక్ష్మీ ్మ గణేష్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్న హర్రర్ బేస్డ్ కామెడీ ఎంటర్ టైనర్ చిత్రం'లోపలికి రా చెప్తా'. కొండా వెంకట రాజేంద్ర హీరోగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు విడుదలైన పాటలు, పోస్టర్స్ అన్నింటినీ ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారని తెలుపుతూ.. చిత్ర విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. 'లోపలికి రా చెప్తా' చిత్రం జూలై 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకట రాజేంద్ర మాట్లాడుతూ.. మా చిత్రంలో హీరో క్యారెక్టర్ డెలివరీ బాయ్. అందుకే చిత్రంలోని మొదటి సాంగ్‌ను ఓ డెలివరీ బాయ్‌తో విడుదల చేయించాం. ఆ పాటకు చాలా మంచి స్పందన వచ్చింది. త్వరలోనే ట్రైలర్ రిలీజ్ చేయబోతున్నాం. సెన్సార్ కార్యక్రమాలను పూర్తయ్యాయి. జూలై 5న గ్రాండ్‌గా థియేటర్లలోకి సినిమాను తీసుకు రానున్నాం. ప్రతిష్టాత్మకమైన సరిగమ ఆడియో కంపెనీ ఈ చిత్ర ఆడియో హక్కులు దక్కించుకుంది. అవుట్ ఫుట్ చూసి టీమంతా ఎంతో హ్యాపీగా ఉన్నాం. కచ్చితంగా ప్రేక్షకులను మెప్పించే సినిమాగా 'లోపలికి రా చెప్తా' నిలుస్తుంది. సహకరించిన అందరికీ ధన్యవాదాలు. త్వరలోనే గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కలుసుకుందాం అని అన్నారు. కొండా వెంకట రాజేంద్ర, మనీషా జష్నాని, సుస్మిత ఆనాల, సాంచిరాయ్, అజయ్ కార్తీక్, ప్రవీణ్ కటారి, రమేష్ కైగూరి, వాణి ఐడా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: దేవ్ జాంద్.



# వినూత్న అనుభూతి అందిస్తున్న 'హంటర్ చాప్టర్ 1'



టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటించిన మిస్టరీ థ్రిల్లర్ 'హంటర్ చాప్టర్ 1' థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. నందిత శ్వేతా, తాన్య హోప్ హీరోయిన్స్‌గా నటించిన ఈ సినిమాకు షెరీఫ్ గౌస్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఎ. రాజశేఖర్ సాయి కిరణ్ బత్తుల నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌లు ప్రేక్షకుల్లో మంచి ఉత్సాహాన్ని నెలకొల్పి, సినిమాపై బజ్‌ను పెంచాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని అర్రోల్ కొరెల్లి అందించగా, నిమాటోగ్రఫీని బాలాజీ కె రాజా చేపట్టారు. సస్పెన్స్, థ్రిల్, హై టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు వినూత్న అనుభూతిని అందిస్తోంది. హంటర్ చాప్టర్ 1 దేశవ్యాప్తంగా థియేటర్లలో ప్రదర్శించబడుతోంది.



నభా నటేష్

# 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి శ్రీలీల స్పెషల్ పోస్టర్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీలీల హీరోయిన్‌గా దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో తెరకెక్కిస్తున్న సాలిడ్ పోలీస్ డ్రామా 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్ రీసెంట్ గానే మొదలై జెట్ స్పీడ్‌లో కొనసాగుతుంది. ఇక పవన్ సరసన శ్రీలీల మొదటిసారి నటిస్తుండగా తన పుట్టినరోజు కానుకగా మేకర్స్ ఓ స్పెషల్ బర్త్ డే పోస్టర్ ఇప్పుడు విడుదల చేశారు.

మరి ఇందులో శ్రీలీల కూల్ లుక్స్‌లో చేతిలో కాఫీ కప్‌తో ఓరగా చూస్తూ కనిపిస్తుంది. ఇలా మేకర్స్ తమ బర్త్ విషెస్‌ని ఆమెకి అందించారు. ఇక రీసెంట్ షూటింగ్‌లో పవన్‌తో పాటుగా శ్రీలీల కూడా జాయిన్ అయ్యింది. ప్రస్తుతం వీరి సంబంధిత సన్నివేశాలే తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.



# రాజబాబు స్మృతికి పురస్కారాలతో నివాళి

బొడ్డు రాజబాబు రంగస్థలం , టీవీ , సినిమా రంగంలో సుప్రసిద్ధ కళాకారుడు. ఆయనతో ఒకసారి పరిచయం ఏర్పడితే అది జీవితాంతం మర్చిపోలేం, ఆయన స్మృతికి నివాళిగా మిత్ర బృందం పురస్కారాల కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ చెప్పారు . బొడ్డు రాజబాబు 68వ జయంతి , స్మారక పురస్కారాల కార్యక్రమం ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్లో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిధిగా వచ్చిన గోపాల కృష్ణ మాట్లాడుతూ ... రాజబాబు పేరుతో వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని సత్కరించి పురస్కారాలు అందజేయడం ఎంతో సముచితంగా ఉందని, రాజబాబు మాఅందరికీ ఎంతో స్నేహపాత్రుడని అన్నారు. ఈ కార్యక్రంలో పురస్కారాలు అందుకున్న డి.ఎస్.ఎన్.మూర్తి మా గురువుగారు, భగీరథ ఆత్మీయ మిత్రుడు. ఉగాది రోజు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు భగీరథకి కళా రత్న అవార్డు బహుకరించారు. మేమిద్దరం ఎన్‌టిఆర్ సెంటినరీ కమిటీలో సభ్యులం అని చెప్పారు .భగీరథ శ్రీకృష్ణదేవరాయల ప్రేమ కథను 'నాగలాదేవి' పేరుతో ఒక అద్భుతమైన పుస్తకం వ్రాశారు . ఆ పుస్తకాన్ని అందరూ చదివితీరాలి అని గోపాలకృష్ణ చెప్పారు .సీనియర్ నిర్మాత కె.ఎస్. రా వ గా రా వు మాట్లాడుతూ ప్రభుత్వాలే ప్రతి సంవత్సరం అవార్డులను ప్రదానం చేయలేకపోతున్నాయి. అలాంటిది రాజబాబు పేరుతో ప్రతి సంవత్సరం అవార్డులను అందిస్తున్నందుకు మిత్ర బృందాన్ని అభినందిస్తున్నా. వచ్చే సంవత్సరం నుంచి ఈ కార్యక్రమంలో మరింత మంది సినిమావారు పాల్గొనేలా చూడాలని కోరారు దర్శకుడు వీర శంకర్ మాట్లాడుతూ .. రాజబాబు చనిపోయినా ఇంకా ఆయన మిత్ర బృందం మనస్సులో పదిలంగా వున్నదని, రాజబాబు జన్మదినం సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేసి ఒక వేడుకలా జరపడం, అందులో నన్ను భాగస్వామిని చేయడం సంతోషంగా ఉందని చెప్పారు . సీనియర్ జర్నలిస్ట్ భగీరథ మాట్లాడుతూ .. రాజబాబు మా అందరికీ అంత్యంత ఆప్త మిత్రుడు , నాకు కళారత్న అవార్డు వచ్చిన సందర్భగా సత్కరిస్తున్న మిత్రులందరికీ కృతజ్ఞతలు . నాకోసం గుమ్మడి గోపాలకృష్ణ గారు విజయవాడ నుంచి రావడం నాకెంతో ఆనదాన్నిచ్చిందన్నారు.

నిర్వాహకులలో ఒకరైన కాకాని బ్రహ్మం మాట్లాడుతూ .. రాజబాబుకు మిత్రులంటే ప్రాణం, ఆయన పేరుతో ఇచ్చే ఈ పురస్కారాలకు ఆయన కుమారులు రమేష్, వీరన్న చౌదరిల తోడ్పాటు వుంది. ఈ సంవత్సరం తొమ్మిది మంది ప్రతిభావంతులకు పురస్కారాలను అందిస్తున్నామని చెప్పారు.



# సైబర్ బాధితుల కోసం..



**లాభాల ఆశ చూపించి లక్షలు కాజేశారు... రూ.11 కోట్లు పోగొట్టుకున్న టెకీ... ఆన్‌లైన్ గేమ్ ఆడి అప్పులపాలైన యువకుడు... ఉదయం లేస్తే ఇలాంటి వార్తలు చాలానే వింటున్నాం. డబ్బు పోతే పోయింది. ఆ బాధతో ఆత్మహత్యలు చేసుకునే వారు ఎక్కువవుతున్నారు. అలాంటి వాళ్లందరికీ సాంత్వన కలిగించాలను కుంది 32 ఏళ్ల స్వాతి దాస్.**

'కొవిడ్ తరవాత సోషల్ మీడియాకు బానిసలైన వారి సంఖ్య బాగా పెరిగిపోయింది. ఇలాంటి వారందరినీ లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలు లెక్కలేనన్ని జరుగుతున్నాయి. ఇవి నాణేనికి ఒకవైపు మాత్రమే... ఇంకోవైపు గృహిణులు, వృద్ధులను కూడా టార్గెట్ చేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. దీనివల్ల జరిగే ఆర్థిక, సామాజిక నష్టం నుంచి బయటపడటానికి బాధితులకు చాలా సమయం పడుతుంది. ఈ సమయంలో ఒంటరితనం ఒత్తిడి, ఆందోళన, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసార్డర్(పీటీఎస్‌డి) సమస్యలతో సతమతమవుతారు. అలాంటి వాళ్లని గుర్తించి, తగిన అవగాహన కల్పించి, చికిత్స అందించకపోతే ఆత్మహత్యలకు ప్రయత్నించారు. ఇలా జరగకూడదనే నా ప్రయత్నం అంటారు స్వాతి. ఈమెది ఒడిశాలోని కటక్. యాక్సెంచర్‌లో సీనియర్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో భాగంగా 'సపోర్టింగ్ మెంటల్' కార్యక్రమంలో చేరాను. మానసిక ఒత్తిడిని జయించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అక్కడే విన్నాను.

ఆ సబ్జెక్టు మీద మక్కువతో మరింత లోతుగా అధ్యయనం చేశా. శిక్షకురాలిగానూ మారా అనే స్వాతి మొదట్లో ఒత్తిడికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు మాత్రమే చేసేవారు.

యాదృచ్ఛికంగా.... ఏ మీడియా చూసినా సైబర్ క్రైమ్ మీద చర్చలు పెరిగిన సంవత్సరం 2022. మోసాలు నమోదు అవ్వడం ఒక ఎత్తయితే... బాధితులు ఆత్మహత్యలు మరో ఎత్తు. అందుకే వారికి మైండుఫుల్‌నెస్ టెక్నిక్‌లతో... ధ్యాస మళ్లించి, మానసిక ఒత్తిడి నుంచి బయటపడేలా చేయాలనుకున్నా, భువనేశ్వర్, కటక్, ఒడిశా గ్రామీణ ప్రాంతాల్లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను సంప్రదించి విషయం చెప్పాను. వాళ్ల ప్రోత్సాహం కూడా తోడైంది. కంపెనీ వాళ్లు కూడా అంగీకరించారు. అంటే స్వాతి కమిషనరేట్లలో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న మొదటి మహిళా వాలంటీర్. ఇప్పటిదాకా 1000 మందికి పైనే ఈ సమస్య నుంచి బయట పడేలా చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా పాఠశాలలు, కళాశాలల్లో యువతకు డిజిటల్ నేరాలపై అవగాహా కల్పించింది.




# అందరి కోసం పోర్టబుల్ జెనెటిక్ ల్యాబ్



**25ఏళ్ల అమ్మాయిలు అప్పుడప్పుడే కెరియర్‌లో స్థిరపడుతూ ఉంటారు. అయితే, పావులూరి నాగ పావని అత్యంత కీలకమైన హ్యూమన్ జెనెటిక్స్ మీద పరిశోధనలు చేస్తూ హ్యాండ్ గ్రిప్ పోర్టబుల్ జెనెటిక్ ల్యాబ్‌ను నెలకొల్పింది. రూ.కోట్లలో టర్నోవరూ అందుకుంటోంది. ఆ విశేషాలు తెలుసుకుందాం..**

మాది ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల దగ్గర పావులూరివారిగూడెం. అమ్మ లలితా దేవి గృహిణి. నాన్న లక్ష్మణరావు రైతు. ఇద్దరూ చదువుకోలేదు. అందుకే, నన్నూ, తమ్ముడినీ బాగా చదివించాలనుకున్నారు. 2020లో గుంటూరులో బయోటెక్నాలజీలో బీటెక్ పూర్తిచేశా. రెండో ఏడాదిలో ఉండగానే స్టార్టప్ ఆలోచన వచ్చింది. మా ప్రొఫెసర్ సహకారంతో 'హ్యూమన్ రిసెర్చ్' పరిశోధనాంశంపై చిన్న చిన్న ప్రాజెక్ట్ వర్కులు చేస్తున్నాయి. అలా 2019లో మా ప్రొఫెసర్, మరో స్నేహితుడితో కలిసి '30ఎమ్ జీనోమిక్స్'. కీలకమైన డీఎన్ఏ మాలిక్యులర్ టెస్టింగ్‌పై మా పరిశోధన ప్రారంభించింది.




దీనివల్ల అనేక రకాల వ్యాధులు రాకముందే కనిపెట్టొచ్చు. సరిగ్గా సరిపోతాయో కూడా ఈ సాంకేతికత మనదేశంలో ఉన్నా పెద్ద నగరాలకే పరిమితమైంది.

కంపెనీ ప్రారంభించిన కొద్ది రోజులకే లాక్డౌన్. అప్పుడే ఇంక్యుబేషన్ సెంటర్ల గురించి తెలిసి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రూ.5500 చెల్లించి ఓ బెంచ్‌ను అద్దెకు తీసుకున్నాం. దీని ద్వారా అక్కడ ఉన్న ల్యాబ్ పరికరాలను ఉపయోగించుకునే వెసులుబాటు దొరికింది. కోవిడ్ సమయమంతా హ్యూమన్ జెనెటిక్స్ మీద పనిచేసి, మా మొదటి ఉత్పత్తి 'యాంప్‌రెడీ' డీఎన్ఏ ఎక్స్‌షన్ కిట్‌ను తీసుకొచ్చాం. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి మొదటి గ్రాంట్ రూ.7లక్షలు అందుకోవడం... మాకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. క్రమంగా బెంచ్ నుంచి ఓ చిన్న ల్యాబ్‌కి మారాం. టెస్టింగ్‌కి కావాల్సిన పరికరాలు, రసాయనాలు మేమే తయారుచేసుకోగలిగాం. తాజాగా పోర్టబుల్ జెనెటిక్ ల్యాబ్ తయారుచేశాం. ఇప్పటికే ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీ ల్యాబొరేటరీలు, ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లలో మా ల్యాబ్‌ను ఇన్‌స్టాల్ చేశాం. ఇప్పుడు కూకట్‌పల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ని సొంతంగా నిర్మించుకున్నాం. ఐవీడీ సర్టిఫికేషన్ కోసం ప్రయత్నిస్తున్నా. వస్తే డయాగ్నస్టిక్స్ సేవల్లోకి అడుగు పెడతాం. ఇప్పుడు మన విజయ ఆలోచన విలువ సుమారు రూ.20కోట్లు, రూ.5కోట్ల వరకు టర్నోవర్ అందుతోంది. సంస్థ ప్రారంభించిన తొలినాళ్లు కష్టంగానే గడిచిపోయాయి. నా స్నేహితులందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నాకేమో ఎలాంటి ఆదాయం రాలేదు. కారణమేమో! కానీ అమ్మానాన్నలు నచ్చింది చేయమని ప్రోత్సహించారు. ఒకటి రెండు నెలల కంటేఎక్కువ రోజులు కంపెనీని నడపలేం. అనుకునే పరిస్థితులూ వచ్చాయి. కానీ అవన్నీ ఇంకోసారి ప్రయత్నించాలనే కసిని పెంచాయే తప్ప ఆగిపోవాలనుకోలేదు. ఆ ఆలోచననే ఈ విజయానికి కారణమేమో!

# తేనీటితో బరువు తగ్గొచ్చా?

**సాధారణంగా బరువు తగ్గడానికి భోజనాన్ని తగ్గించడమో, వ్యాయామం చేయడమో** చేస్తుంటాం. కానీ, ఈ మధ్య కొన్నిరకాల టీలు తాగితే కూడా వెయిట్ తగ్గొచ్చనే ప్రచారం పెరిగింది. అయితే ఇది పూర్తిగా నిజం కాదంటారు నిపుణులు. సాధారణంగా భోజనానికి ముందో, తరవాతో ద్రవ పదార్థాలను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల మనం తినాలనుకున్న ఆహార పరిమానం తగ్గుతుంది. ఇలా కొన్ని రోజులు చేస్తే కొంత బరువు తగ్గినట్లే కనిపిస్తుంది. కానీ, శరీరంలోని కొవ్వు నిల్వవలు కలిగినట్లు కాదట. అలానే, కౌచ్ గ్రాస్, బుచు, డాండలైన్, ఉవార్సి, బ్రూమ్ వంటి కొన్ని రకాల టీలలోని పోషకాలు.. ఒంట్లోని అదనపు నీటిని మూత్రం రూపంలో బయటకుపంపిస్తాయి. దీనివల్ల సన్నబడ్డామేమో అనిపిస్తుంది. అయితే, గ్రీన్, బ్లాక్, ఉలాంగ్ టీలలో ఉండేకొన్నిరకాల సమ్మేళనాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు సాయపడతాయి. అయితే, తక్కువ కాలంలో బరువు తగ్గడానికి మాత్రం పనికిరావు. సమతులాహారాన్ని తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, కనీసం రోజూ ఓ గంటైనా వ్యాయామం చేయడం వంటివి చేస్తూనే ఈ టీలు తాగితే ఆరోగ్యకరంగా బరువుని తగ్గించుకోవచ్చుట.



# సౌకర్యంగా ఉన్నాయా?

ఈ దుస్తుల మీదకు నప్పుతాయి. ఇది కొత్త ట్రెండ్ అంటూ కోరి కోరి షూ, చెప్పులను ఎంచుకుంటాం. తీరా వేసుకున్నాక ఇబ్బందిపడే సందర్భాలెన్నో. ఒక్కోసారి పాదాల నొప్పులూ మొదలవుతాయి. అలాగని పట్టించుకోకపోతే ఆర్థరైటిస్ సహా ఎన్నో సమస్యలు ఇబ్బంది పెడతాయి కాబట్టి... చెప్పుల విషయంలో ఆకర్షణీయంగా ఉండటం ఒక్కటే ప్రామాణికం కాకూడదు. డిజైన్ బాగుంటే చాలని ఎప్పుడూ తీసుకోకూడదు. వాటి నాణ్యత కూడా గమనించు కోవాలి. కాలికి సరిపోయిందా లేదా అనేకాదు. నడిచేప్పుడు సౌకర్యంగా ఉన్నాయా అన్నదీ గమనించు కోవాలి. ఏమాత్రం అసౌకర్యం కలిగించినా, ఇబ్బంది పెట్టినా 'తర్వాత సర్దుకుంటాయి' అని కూర్చోక దూరం పెట్టడమే మేలు. ఎక్కువసేపు నిలబడడం, వాకింగ్, షాపింగ్.. ఇలా బోలెడు అవసరాలు ఉంటాయి. వాటికీ సౌకర్యంగా ఉండాలి. కాబట్టి, ఫ్యాషన్‌ని మాత్రమే కాకుండా సౌకర్యంగా ఉందా అనేదీ చూసుకోండి. నాలుగు అడుగులు అలా వేసి కాక, కొద్దిసేపు గమనించి చూడండి. అప్పుడే అవెంతవరకూ మీకు సరిపోతాయో తెలుస్తుంది. ఒక్కో డ్రెస్ మీదకి ఒక్కో పాదరక్షలు కొంటూ పోతే ఎలా? మ్యాచింగ్ కావాలి కానీ ఇలా అన్నీ కొనుక్కుంటూ పోయినా వృథానే. కాబట్టి కాస్త క్లాస్‌గా ఉండే రంగులను ఎంచుకునే ప్రయత్నం చేయండి. ఇవి ఎటువంటి డ్రెస్సులు, చీరలు, కుర్తీల మీదకు అయినా ఇట్టే నప్పుతాయి. ఇక వెస్ట్రన్ మేర్‌కు షూస్ అయితే మేలు. ఈ రోజుల్లో చీరల మీదకీ షూ వాడుతున్న వారూ ఉన్నారు. మీదీ అదే కోవ అయితే వైట్, బ్లాక్, క్రీమ్ వంటి రంగు తీసుకుంటేకొంచెం టెండీగా ఉంటాయి.



# పిల్లల కోసం..

**ఇంట్లో పసిపిల్లలు న్నారా? అయితే మీకు బాగా** అర్థమవుతుంది. వాళ్లకోసం పెట్టే కొద్దిపాటి ఆహారాన్ని మళ్లీ మళ్లీ వేడి చేయడం ఎంత కష్టమో! ఆ చిన్న పొట్టకి కావాల్సిన ఆహారాన్ని పెద్ద గిన్నెల్లో వేడిచేయలేం. వేడిచేసినా అందులోని పోషకాలు తరిగిపోయే ప్రమాదమే ఎక్కువ. ఇలా కాకుండా ఉండటానికే మార్కెట్లో 'లిల్లీపాట్స్' పేరుతో ప్రత్యేకమైన పాత్రలు దొరుకుతున్నాయి. చూడ్డానికి ఇడ్లీ పాత్రలా ఉండే వీటిల్లో ఫ్రిజ్‌లోంచి తీసిన క్యారెట్ గుజ్జు, బంగాళా దుంప గుజ్జు వంటివాటిని వేడిచేసుకోవడం తేలిక. ఇవి ఆవిరిమీద ఉడుకుతాయి. కాబట్టి పోషకాలు పోయే ప్రమాదం తక్కువ.



# బడికెళ్లేటప్పుడు క్లిప్పులు..







బడులు తెరిచారు. బుజ్జాయిలు బడికెళ్లడం మొదలుపెట్టారు. స్కూల్ అంటే చక్కగా ఆడుకునే చోటు అనే భావన నుంచి తరవాతి తరగతిలోకి అడుగుపెట్టే చిన్నారుల కోసం ప్రత్యేకంగా మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ 'బ్యాక్ టు స్కూల్ హెయిర్ క్లిప్స్' అవేంటో చూద్దామా!

అక్షరాలు, అంకెలతో... బొమ్మలతో ఆడటంతోపాటు అక్షరాలు దిద్దే వయసులోకి అడుగుపెడుతున్న వారికి ఈ హెయిర్ క్లిప్పులు ప్రత్యేకం. అక్షరాల డిజైన్‌తో రంగురంగుల రిబ్బన్, మధ్యలో పలకా బలపం, దానిపై ఎబిసిలుండటంతో వీటిని అలంకరించుకోవడానికి చిన్నారులు ముచ్చటపడటం ఖాయం. క్లిప్పులు మధ్యలో వారి మనసుకు నచ్చే కార్టూన్ బొమ్మ, చివరలో అలకరణగా వారి పేరు, అలాగే క్లిప్ మధ్యలో పెన్సిళ్లు, స్కూల్ బస్సువంటి బొమ్మల డిజైన్లు చిన్నారుల మనసును దోచేస్తాయి.

**బొమ్మలతో...** ఈ క్లిప్పులకు రిబ్బన్‌తో తయారుచేసిన అందమైన బొమ్మలు ఒద్దికగా అంటుకుని ఉంటాయి. రాకుమారి, ఫైటర్, నర్సు సహా కార్టూన్ బొమ్మలవంటి పలురకాల డిజైన్లతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కొనినంటికైతే బార్బీడాల్స్‌లాంటి ముద్దుగా చిన్నచిన్న బొమ్మలు అటాచ్ చేసి ఉండటంతో చిన్నారులు తెగ ముచ్చటపడతారు. వాటిని అలంకరించుకుని మరీ స్కూల్‌కు బయలుదేరతారు. చూడటానికి భలేగున్న ఈ క్లిప్పులు మీ బుజ్జాయిలకూ కావాలి కదూ..













ఆధ్యాత్మికం

# శివుని ఆజ్ఞ

**సీతాపరహరణం తర్వాత** రామలక్ష్మణులు దండకారణ్యంలో సంచరిస్తుంటే.. వాళ్లకో మనోహరమైన ప్రాంతం కనిపించింది. సీతమ్మ వారి జాడ తెలిసేవరకూ అక్కడే నివసించాలనుకున్నాడు శ్రీరాముడు. అతడి సంకల్పాన్ని బలపరిచాడు లక్ష్మణుడు. సోదరా! నాతో ఏకీభవించినందుకు సంతోషం. అయితే ఇదెవరిదో తెలుసుకోవాలి. వారి అనుమతి లేకండా ఉండటం భావ్యం కాదు కదా! కనుక చుట్టుపక్కల ఎవరైన ఉన్నారేమో చూడు, వారితో మాట్లాడుదాం అన్నాడు రాముడు. వెంటనే లక్ష్మణుడు పరిసరాలను పరిశీలిస్తూ కొంత దూరం వెళ్లగా.. ఉసిరి మారేడు చెట్ల మధ్యన శివాలయం కనిపించింది. కాని అక్కడెవరు లేరు. తిరిగొచ్చి సంగతి తెలియజేశాడు. అయితే ఈ ప్రాంతానికి పరమ శివుడే అధిపతి అయ్యాండు. అనుమతి తీసుకో లక్ష్మణా అన్నాడు రాముడు. లక్ష్మణుడు శివాలయం వద్దకు వెళ్లి, శివుడి ఆజ్ఞకై అర్థించాడు. వెంటనే శివలింగం నుంచి ఉజ్వలంగా ఉన్న మూర్తి వెలువడి, అద్భుతంగా నృత్యం చేసి అదృశ్యమైంది. అలా ఎందుకు జరిగిందో దాని భావం ఏమిటో లక్ష్మణుడికి అర్థం కాలేదు. సోదరుడి వద్దకు వచ్చి విషయం చెప్పాడు. రాముడు చిన్నగా నవ్వి. సోదరా శివుడి ఆజ్ఞ లభించింది. కుటీరం నిర్మించు అన్నారు. ఆజ్ఞ ఎప్పుడు లభించింది ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మణుడు. లక్ష్మణా మితిమీరిన స్వార్థం, జివ్హా చాపల్యం, కామ వికారాలే కష్టాలకు మూలం. వీటిని గనుక నియంత్రించుకోగలిగితే.. ఇక్కడే కాదు ఎక్కడైనా సుఖంగా జీవించవచ్చు. ఈ మూడింటినీ మనం నిగ్రహించు కోగలమని పరమశివుడు గ్రహించాడు. కనుకనే నృత్యభంగిమలో దర్శనమిచ్చి తన అంగీకారాన్ని తెలియజేశాడు అంటూ వివరించాడు శ్రీరాముడు.

# స్నేహం దూరమైందా?

**ప్రాణానికి ప్రాణంగా కలిసి బతికిన,** మన అనుకున్న వాళ్లే ఒక్కోసారి దూరమైపోతుంటారు.. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవడం కష్టమే! బ్రేకప్.. ప్రేమికుల మధ్యే కాదు.. ఒక్కోసారి ప్రాణ స్నేహితుల మధ్య సహజమే..! మరి ఇలాంటి పరిస్థితులలో ఆ బాధ నుంచి ఎలా బయటపడాలి?

**రియలైజ్ అవ్వాలి!....** అనుమతి ఎంతసేపూ బాధపడుతూ కూర్చుంటే స్నేహబంధం విడిపోవడానికి అసలు కారణమేంటో గుర్తించలేం. కాబట్టి ఇద్దరూ విడిపోవడానికి తప్పు మీదా? లేదంటే మీ స్నేహితురాలా? అన్న విషయం ముందుగా తెలుసుకోవాలి. ఈ క్రమంలో ఒకవేళ తప్పు మీవైపు ఉంటే.. క్షమాపణ కోరి.. బంధాన్ని తిరిగి నిలబెట్టుకోవడం ఓ పద్ధతి! లేదు.. తప్పు తన వైపు ఉంది.. అయినా మీ నుంచి విడిపోదామనే కోరుకుంటే మాత్రం మీరు బతిమాలాల్సిన పని లేదంటున్నారు నిపుణులు. ఈ పరిశీలన గ్రహించి.. తప్పు తన వైపు పెట్టుకొని నన్నే దోషిని చేస్తున్నప్పుడు నేనెందుకు తన గురించి ఆలోచించాలి..? అని మీ మనసుకు చెప్పుకోండి. ఇలా అసలు విషయం గ్రహించిన మరుక్షణం నుంచి మీలో మార్పు మొదలవడం మీరు గుర్తించవచ్చు. ఈ మార్పు మీ బాధను దూరం చేసి సంతోషాన్ని దగ్గరకు చేస్తుంది.

వాటిని డిలీట్ చేయండి! .. ఎంత వద్దనుకున్నా ఒక్కోసారి చేదు జ్ఞాపకాలన్నీ గుర్తుకు రావడం సహజం. ఇలాంటప్పుడు చాలామంది చేసే పని.. ఆ జ్ఞాపకాల తాలూకు ఫొటోలు, వీడియోలు చూడడం, సందేశాలు చదవడం..! నిజానికి దీనివల్ల బాధ రెట్టింపవడం తప్ప మరే ప్రయోజనం లేదు. అందుకే వాటిని ఇంకా అట్టే పెట్టు కోకుండా తొలగించడం వల్ల కొంత ప్రయోజనం ఉంటుంది. అలాగే మనసుకు బాధ కలిగినప్పుడు ఒంటరిగా ఉండకుండా మీ ఇంట్లో వాళ్లతో మీ బాధను పంచుకోవడం, వాళ్లతో కాస్త సమయం గడపడం వల్ల.. మరింత కుంగిపోకుండా జాగ్రత్తపడచ్చు.

**ఇలా చేయ చ్చు!....** స్వీయ ప్రేమ ఎలాంటి బాధ నుంచైనా మనల్ని బయటపడేయ గలదని చెబుతున్నారు. నిపుణులు. అందుకే ఒంటరిగా ఫీలవ కుండా మనకంటూ కాస్త సమయం కేటాయించుకోవడం, నచ్చిన పనులపై దృష్టి పెట్టడం వల్ల కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. మనసు బాగోలేనప్పుడు మనపై మనకే కోపమొస్తుంటుంది. అలాంటప్పుడు వ్యాయామం చేయడం వల్ల శరీరంలో ఫీల్డ్ హార్మోన్లు విడుదలై మానసిక ప్రశాంతతను అందిస్తాయని ఓ అధ్యయనంలో రుజువైంది. బ్రేకప్ బాధ నుంచి విముక్తి పొందాలంటే వ్యాయామం అందుకే చక్కటి ఔషధం అంటున్నారు నిపుణులు. ఫ్రెండ్షిప్‌లో ఒక్కసారి విడిపోయినంత మాత్రాన ఇంకొకరితో స్నేహం చేయకూడదనుకోవడం పొరపాటు అంటున్నారు నిపుణులు.



# తరిగేద్దాం.. తేలిగ్గా !

కాయగూరలు ఒక పద్ధతిలో కోస్తే కూర చూడ్డానికి బాగుంటుంది. అలా చేయాలంటే మన కటింగ్ స్కిల్స్ బాగుండాలి. అంత తీరిక కూడా ఉండాలి. మనలో చాలా మందికి ఆఫీసు టైం అవుతోంది అనే తొందరలోనే పని చేస్తాం. అందుకే తక్కువ సమయంలో పని తేలిగ్గా అయ్యేందుకు ఉపకరించే పరికరమే ఈ రొటేటింగ్ వెజిటబుల్ కట్టర్. క్యారట్, బీట్‌రూట్ వంటి ఎక్కువ సమయం పట్టే కాయగూరల్ని కూడా ఇందులో తేలిగ్గా తరిగేయొచ్చు. నాలుగు రకాల బ్లేడులు మార్చుకొనే అవకాశం ఉంది. దీన్నికున్న ప్రత్యేకమైన ఆకృతివల్ల చేతివేళ్లకి గాయం అవుతుందన్న భయం లేకుండా వేగంగా పని పూర్తిచేసుకోవచ్చు.



ఆట

# రెండు విడతలుగా రంజీ ట్రోఫీ

## షెడ్యూల్ వెల్లడించిన భారత్ క్రికెట్ బోర్డు




**న్యూఢిల్లీ:** దేశవాళీ క్రికెట్ కొత్త సీజన్‌కు షెడ్యూల్ ఖరారైంది. దీనికి సంబంధించిన వివరాలను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) విడుదల చేసింది. విరామం లేకుండా మ్యాచ్‌ల నిర్వహణపై క్రికెటర్లు ఫిర్యాదు నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. లీగ్‌ను రెండు దశలుగా నిర్వహించాలని బీసీసీఐ తీర్మానించింది. అక్టోబర్ 15 నుంచి ఫిబ్రవరి 28 మధ్యలో రంజీ ట్రోఫీ నిర్వహిస్తామని భారత బోర్డు తెలిపింది. దులీప్ ట్రోఫీతో దేశవాళీ సీజన్ 2025-26 ప్రారంభం కానుంది. ఆగస్టు 28 ను మొదలయ్యే ఈ టోర్నీ సెప్టెంబర్ 15న ముగుస్తుంది. ఆ తర్వాత ఇరానీ కప్ అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకూ జరగనుంది. ఇందులోరంజీ విజేత డిఫెండింగ్ ఛాంపియన్ రెస్ట్ ఆఫ్ ఇండియా ట్రోఫీ కోసం పోటీ పడనుంది. తదనంతరం రంజీ ట్రోఫీ షురూ అవుతుంది. అంతేకాదు ఈసారి రంజీ ట్రోఫీ సరికొత్తగా ఉండనుంది. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఒక జట్టు ప్రమోట్ అవుతుంది. మరొక జట్టు 2026-27 సీజన్‌కు అర్హత సాధిస్తుంది. ఫిబ్రవరి 6 నుంచి 28 వరకూ నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయి.

### ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో..

# నిశాంత్ రెండో విజయం

## జోసు సిల్వాపై 60-54 తేడా



**న్యూఢిల్లీ:** భారత్ బాక్సర్ నిశాంత్ దేవ్ తన రెండవ ప్రొఫెషనల్ విజయాన్ని నమోదు చేశాడు. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తన అజేయ పరంపరను కొనసాగిస్తూ నిశాంత్ దేవ్ 60-54తో జోసుయే సిల్వాను ఓడించి ఏకగ్రీవ విజయాన్ని నమోదు చేశాడు. ఆదివారం మాడిసన్ స్క్వేర్ గార్డెన్ థియేటర్‌లో జరిగిన రిచర్డ్‌సన్ హిచిన్స్ వర్సెస్ జార్జ్ కాంబోసోస్ పోరాటంలో అండర్ కార్డ్ బౌట్‌లో పోటీ పడుతున్న 24 ఏళ్ల నిశాంత్, ఆరు రౌండ్ల లైట్ మిడిల్ వెయిట్ బౌట్‌లో 60-54 తేడాతో విజయాన్ని నమోదు చేయడంతో ప్రారంభం నుండి ముగింపు వరకు పూర్తి నియంత్రణలో ఉన్నాడు. 2024 పారిస్ ఒలింపియన్ నిశాంత్ వేగం, చురుకుదనంతో పాటు అతని ఖచ్చితత్వం ప్రత్యేకంగా నిలిచాయి. మరింత అనుభవజ్ఞుడైన నిశాంత్ భారతీయుడితో పోటీ పడటానికి ఇబ్బంది పడ్డాడు. గత సంవత్సరం 2024 పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయిన తర్వాత నిషాంత్ ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రొఫెషనల్‌గా మారాడు. జనవరిలో ఆల్టన్ విగ్గిన్స్‌తో జరిగిన తన ప్రొఫెషనల్ అరంగేట్రంలోనే అతను మొదటి రౌండ్‌లోనే నాకౌట్ విజయాన్ని నమోదు చేశాడు. అని నిషాంత్ అన్నాడు. నిశాంత్ తదుపరి జూలై 19న డల్లాస్‌లో జరిగే అండర్ కార్డ్ ఫైట్‌లో పాల్గొంటాడు.



### క్వీన్స్ క్లబ్ టోర్నీలో..

# మారియా సంచలనం

## ఓడిన మాడిసన్ కీస్, క్విన్వెన్

**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్-2025 టోర్నమెంట్ సెమీ ఫైనల్లో సంచలన విజయాలు చోట చేసుకున్నాయి. ఆదివారం జరిగిన ఈ టోర్నీలో మాజీ వింబుల్డన్ సెమీఫైనలిస్ట్ అయిన 86వ ర్యాంక్ క్రీడాకారిణి మరియా, 8వ ర్యాంక్ క్రీడాకారిణి కీస్‌ను ఓడించింది. ఆమె 10 ఏస్‌లు కొట్టినప్పటికీ ఫలితం పొందలేకపోయింది. అలాగే 2వ ర్యాంక్ క్రీడాకారిణి కీస్, 1వ ర్యాంక్ క్రీడాకారిణి జెంగ్ క్విన్వెన్‌తో నిష్క్రమించింది. ఆమె యుఎస్‌కు చెందిన 8వ ర్యాంక్ క్రీడాకారిణి అమండా అనిసిమోవా చేతిలో 6-2, 4-6, 6-4 తేడాతో ఓడిపోయింది. క్వీన్ క్లబ్ టోర్నీ సెమీ ఫైనల్లో 37 ఏళ్ల క్వాలిఫయర్ టాట్జానా మారియా చేతిలో మాడిసన్ కిస్ వరుస సెట్లలో ఓడిపోయింది. కాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్‌తో జరిగిన నాలుగు రౌండ్లలో మారియా 6-3,7-6 (3) తేడాతో ఓడించి తన కెరీర్‌లో తొలి విజయం సాధించింది.

# క్రికెట్ నుండి ఆరుగురు ఔట్

## పలు ఫార్మాట్లకు గుడ్ బై.. ఒకే నెలలో స్టార్ ప్లేయర్ల నిర్ణయం

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో మొదలైన స్టార్ ఆటగాళ్ల వీడ్కోలు ఒకే నెలలో ఆగురురికి చేరింది. మే నుంచి జూన్ నెల మధ్యలో మొత్తం ఆరుగురు స్టార్ క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లోని పలు ఫార్మాట్ లకు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. మే 7న టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించాడు. ఇప్పటికే టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడు ఇకపై వన్డేలో మాత్రమే టీమిండియాకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించిన వారం వ్యవధిలోనే మరో భారత స్టార్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తాను టెస్ట్ క్రికెట్ గుడ్ బై చెప్పాడు. అయితే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతానని చెప్పాడు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ హెన్రిక్ క్లాసెన్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. తన కుటుంబంతో సమయం గడపాలని నిర్ణయం తీసుకున్న అతడు క్రికెట్‌లోని అన్ని ఫార్మట్‌లకు వీడ్కోలు పలికాడు. రాబోయే రోజుల్లో టీ20లో మాత్రమే



వారిలో కొందరు కొన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికగా, మరికొందరు అన్ని రకాల ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పి వెళ్లిపోయారు. ఈ విధంగా, గత నెలలో రిటైర్మెంట్ ప్రకటించిన ఆటగాళ్ల జాబితాలో టీమిండియా నుంచి ఇద్దరు క్రికెటర్లు ఉండగా, నలుగు విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొట్టమెదటగా అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ఆటగాడు భారత స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ. రోహిత్ గత నుంచి తప్పుకుంటున్నట్టు మే 12న తెలిపాడు. అయితే టీ20 వరల్డ్ కప్ తర్వాత షార్ట్‌ఫామ్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన కోహ్లీ ఇకపై వన్డేలో మాత్రమే ఆడనున్నాడు. తదుపరి మరో విదేశీ ఆటగాడు శ్రీలంక స్టార్ ఆల్ రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్, జట్టులో కీలక ఆటగాడు గ్లెన్ మాక్స్వెల్ కూడా తాజాగా వన్డే క్రికెట్‌కు ఆడనున్నారు. వెస్టిండీస్ వికెట్ కీపర్‌బ్యాట్స్ మాన్ నికోలస్ పూరన్ కూడా అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే, ఇందరులో ఆశ్చర్యపడాల్సిన విషయం ఏమిటంటే కేవలం 29 ఏళ్ల వయస్సులోనే పూరన్ అన్ని అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించడం. అయితే, పూరన్ ఇకపై టి20 మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్నాడు.

# భారత్ జూ.మహిళల విక్టరీ

## యూరప్ పర్యటనలో వరుసగా నాల్గవ విజయం

## 2-1 తేడాతో ఆస్ట్రేలియా పరాజయం



**న్యూఢిల్లీ:** యూరప్ పర్యటనలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు తమ అజేయ పరుగును కొనసాగించింది, ఈ పర్యటనలో ఆదివారం తమ నాల్గవ మరియు చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 2-1 తేడాతో ఉత్కంఠభరితమైన విజయం సాధించింది. ఆతిథ్య బెల్జియంపై ఇప్పటికే వరుసగా మూడు విజయాలు సాధించిన భారత జట్టు, బలమైన ఆస్ట్రేలియా జట్టును ఓడించడానికి తమ దృఢత్వం మరియు పోరాట పటిమను ప్రదర్శించింది. జోసీ లాటన్ (5వ నిముషంలో) పెనాల్టీ కార్నర్‌ను కచ్చితత్వంతో గోల్‌గా మలిచి భారత్‌ను వెనుకబడిపోయేలా చేయడంతో ఆస్ట్రేలియా ఆరంభంలో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, భారత జట్టు దాదాపు వెంటనే స్పందించింది. కేవలం మూడు నిమిషాల తర్వాత, నందిని (8వ నిముషంలో) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేసింది. మొదటి క్వార్టర్ ముగిసే సమయానికి జట్టు వైస్ కెప్టెన్ హీనా బానో (14వ నిముషంలో) మరో పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన జట్టును 2-1తో ఆధిక్యంలోకి తీసుకెళ్లడంతో, ఆట వేగం భారత్ వైపు పూర్తిగా మారిపోయింది. మిగిలిన మూడు క్వార్టర్లలో ఇరు జట్లు అనేక అవకాశాలు సృష్టించినప్పటికీ, ఏ జట్టూ స్కోరును పెంచలేకపోయింది. భారత జట్టు తమ రక్షణాత్మక నిర్మాణాన్ని బాగా నిలబెట్టుకుని, ఆస్ట్రేలియన్ దాడిని ఎదుర్కొని పోరాడి విజయాన్ని సాధించింది. ఈ విజయం ఈ పర్యటనలో భారత్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది, మొదటి మూడు ఆటలలో బెల్జియంపై క్లీన్ స్వీప్ చేసిన తర్వాత. జూన్ 17న నెదర్లాండ్స్‌తో యూరప్‌లో జరిగే చివరి మ్యాచ్‌కు సిద్ధమవుతున్నందున, జట్టు ఇప్పుడు పర్యటనను ఘనంగా ముగించాలని చూస్తోంది.

# డ్రైఫ్రూట్స్ మార్కెట్లపై వార్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 15:** ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధ ప్రభావరం మరింతగా ఉండనుంది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై వైమానిక దాడి చేసింది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఇజ్రాయెల్ వైపు 150కి పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తుంది. ముఖ్యంగా డ్రైఫ్రూట్స్ విషయంలో భారతదేశంతో సహా ప్రపంచంలోని అనేక దేశాలలో డ్రై ఫ్రూట్స్, గింజల ధరలు మరింత పెరగవచ్చు. పాకిస్తాన్ ద్వారా దిగుమతులపై నిషేధం విధించనుంది. ఆఫ్ఘనిస్తాన్‌ఇరాన్ నుండి సరఫరా ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత పరిశ్రమకు కొత్త సవాలును తెచ్చిపెట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్రై ఫ్రూట్స్ ఉత్పత్తి చేసే దేశాలలో ఇరాన్ ఒకటి. దీనితో పాటు ఇరాన్ పిస్తాపప్పు ఉత్పత్తి చేసే దేశం. దీనిని భారత దేశం కూడా పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటుంది. అలాగే మజాఫతి, పియారోమ్ వంటి ఇరానియన్ ఖర్జూర రకాలు భారతదేశంలో చాలా ప్రసిద్ధి చెందాయి. ప్రతి సంవత్సరం దాదాపు 2,700 టన్నుల ఇరానియన్ ఖర్జూరాలు భారతదేశానికి దిగుమతి అవు



అంతరాయం కారణంగా ఈ ఉత్పత్తుల ధరలు ఇప్పటికే 15 శాతం నుండి 100 శాతానికి పెరిగాయి. ఇప్పుడు ఈ వివాదం కారణంగా వ్యాపారులు మరింత సంక్షోభాన్ని ఎదుర్కోవలసి రావచ్చు.భారతదేశంలో డ్రై ఫ్రూట్స్‌ను ఎక్కువగా దిగుమతి చేసుకునే దేశాలు ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్. ఈ దేశాల నుండి వచ్చే పిస్తా, ఖర్జూరం, ఎండు ద్రాక్షలకు ప్రతి సంవత్సరం డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా రంజాన్, ఇతర పండుగల సమయంలో వాటి డిమాండ్ గరిష్టంగా ఉంటుంది. ఇరాన్ ద్వారా ఆఫ్ఘన్ మూలానికి చెందిన డ్రై ఫ్రూట్స్ దిగుమతిపై విధించే సుంకంపై స్పష్టత ఇవ్వాలని వ్యాపారులు ఇటీవల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కానీ ఇప్పుడు తాయి. ఇరానియన్ ఎండుద్రాక్షలు, ముఖ్యంగా కాశ్మీరీ రకానికి చెందిన బంగారు, ఆకుపచ్చ ఎండు ద్రాక్షలు భారతీయ వినియోగ దారులలో బాగా ప్రాచుర్యం పొందాయి. 2023 సంవత్సరంలో దాదాపు 1,000 టన్నుల ఎండుద్రాక్షలు ఇరాన్ నుండి దిగుమతి అయ్యాయి. ట్రేడ్ ఎకానమీ వెబ్‌సైట్ ప్రకారం.. భారతదేశం ప్రతి సంవత్సరం దాదాపు 1.47 బిలియన్ల విలువైన డ్రై ఫ్రూట్స్, గింజలను దిగుమతి చేసుకుంటుంది. ఇరాన్, అమెరికా, ఆస్ట్రేలియా దీనికి ప్రధాన ఎగుమతి దారులు. భారతదేశం ఎక్కువగా దిగుమతి చేసుకునే ఉత్పత్తులలో పిస్తాపప్పులు, ఖర్జూరాలు, ఎండుద్రాక్ష, బాదం. వాల్‌నట్‌లున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం ఇరాన్ నుండి సరఫరా నెట్‌వర్క్‌ను ప్రభావితం చేయవచ్చు.

# బోయింగ్ క్రాష్‌తో బీమాకు రూ.1200 కోట్ల భారం..

**న్యూఢిల్లీ, జూన్ 15:** ఒక్క ప్రమాదం 12వందల కోట్ల రూపాయల బీమా క్లెయిమ్‌లకు దారీ తీయనుంది. నిన్న అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా బోయింగ్ 787డ్రీమ్ లైనర్ విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే కూలిపోయిన ఘటనలో 241 మంది మృత్యువాత పడ్డారు. మృతులకు సంబంధించి బీమా క్లెయిమ్స్ చెల్లింపులు ఇన్సూరెన్స్ కంపెనీలపై భారంగా పరిణమించనున్నాయి. ఈ భారం భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీలపై పరిమితంగా ఉండవచ్చు.. యూకే రీఇన్సూరెన్స్ కంపెనీలపై అధిక భారం పడనుంది. ఇన్సూరెన్స్ కంపెనీలు, గ్లోబల్ ఇన్సూరెన్స్ కంపెనీలు 120 మిలియన్ డాలర్ల 150 మిలియన్ డాలర్ల వరకు మన కరెన్సీలో వెయ్యి నుంచి 12వందల కోట్ల రూపాయాలు క్లెయిమ్‌లు ఎదుర్కొననున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రమాదంలో ధ్వంసమైన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం విలువ 75 మిలియన్ డాలర్ల నుంచి 85 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఏవియేషన్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి విమానం మొత్తం నష్టం విలువకు క్లెయిమ్ చేస్తే, అంతే మొత్తం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక




1999లో జరిగిన మాంట్రియల్ కన్వెన్షన్ ప్రకారం, విమాన ప్రయాణీకుల మరణం లేదా గాయం వల్ల కలిగే నష్టానికి అన్ని విమానయాన సంస్థలు ఖచ్చితంగా బాధ్యత వహిస్తాయి. ఫ్లైట్ నష్టం, ప్యాసింజర్, థర్డ్‌పార్టీ చెల్లింపులు గ్లోబల్ ఏవియేషన్ ఇన్సూరెన్స్ సెక్టర్‌పై తీవ్రమైన ప్రభావం చూపనుంది. ఎయిర్ ఇండియా ఫ్లైట్ ప్రమాదంలో భారతీయ ప్రమాదంలో చనిపోయిన ప్రతీ ఒక్క ప్రయాణికుడి కుటుంబానికి చెల్లించాల్సిన కోటి రూపాయలు అదనం. ఈ విధంగా ప్రయాణికుల కుటుం బాలకు చెల్లించాల్సిన మొత్తం రూ.240 కోట్లు అదనంగా ఉంటుంది. విమాన నష్టం, ప్రయాణికులు ఇన్సూరెన్స్ అన్నీ కలిపితే 12వందల కోట్ల భారం తప్పిందంటున్నారు నిపుణులు.

# వాణిజ్యం

# ఫండ్స్ ఇన్వెస్టర్లకు అలర్ట్..

**ముంబై, జూన్ 15:** ఏయూఎం లేదా నిర్వహణలో ఉన్న ఆస్తులు అంటే మ్యూచువల్ ఫండ్ నిర్వహించే మొత్తం డబ్బు విలువ. ఇందులో ప్రజలు పెట్టుబడి పెట్టిన మొత్తం డబ్బు, వడ్డీ, డివిడెండ్‌లు లేదా ఫండ్ పెట్టుబడులలో పెరుగుదల ద్వారా వచ్చే లాభాలు ఉంటాయి. ఉదాహరణకు చాలా మంది వ్యక్తులు ఒక ఫండ్‌లో పెట్టుబడి పెడితే అది కాలక్రమేణా పెరిగితే ఏయూఎం పెరుగుతుంది. ఎంత మంది వ్యక్తులు పెట్టుబడి పెడతారు లేదా ఉపసంహరించుకుంటారు, అలాగే మార్కెట్ ఎలా పనిచేస్తుందనే దానిపై ఆధారపడి ఏయూఎం ప్రతిరోజూ పెరగవచ్చు లేదా తగ్గవచ్చు. సాధారణంగా పెద్ద ఏయూఎం అంటే ఆ ఫండ్ చాలా మంది పెట్టుబడి దారులతో ప్రజాదరణ పొందిందని విశ్వసిస్తారు. అయితే ఆ ఫండ్ ఎల్లప్పుడూ మంచి రాబడిని ఇవ్వదు. కొన్నిసార్లు చిన్న ఫండ్లు పెద్ద వాటి కంటే మెరుగ్గా పని చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి మ్యూచువల్ ఫండ్ పరిమాణాన్ని చూడటానికి ఏయూఎం చాలా మంచి మార్గమని సూచిస్తున్నారు. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులు ఏయూఎంను అర్థం చేసుకోవడం చాలా అవసరం ఎందుకంటే ఇది మ్యూచువల్ ఫండ్‌కు సంబంధించిన అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. మొదట అధిక ఏయూఎం సాధారణంగా పెట్టుబడిదారుల విశ్వాసం, నిధుల స్థిరత్వాన్ని సూచిస్తుంది. పెట్టుబడిదారులు తమ డబ్బును ఇప్పటికే గణనీయమైన మొత్తంలో ఆస్తులను నిర్వహిస్తున్న నిధుల్లో పెట్టుబడి పెట్టడానికి మరింత నమ్మకంగా ఉంటారు. పెద్ద ఏయూఎం ఉన్న నిధులు తరచుగా స్కేల్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవస్థల నుంచి ప్రయోజనం పొందుతాయి. అలాగే కాలక్రమేణా ఖర్చు నిష్పత్తిని తగ్గిస్తాయి. మూడోది ఒక పెద్ద ఏయూఎం మెరుగైన వైవిధ్యాన్ని అందిస్తుంది. అలాగే మరిన్నిఆస్తుల్లో ప్రమాదాన్ని వ్యాపింపజేస్తుంది. అయితే ఇది ఎల్లప్పుడూ మెరుగైన పనితీరుకు సంకేతం కాదు.




కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా స్మాల్‌క్యాప్ లేదా సెక్టోరల్ ఫండ్లలో చాలా పెద్ద ఏయూఎం స్టాక్ ధరలను ప్రభావితం చేయకుండా ఫండ్ మేనేజర్లు డబ్బును సమర్థవంతంగా ఉపయోగించడం కష్టతరం చేస్తుంది. అందువల్ల ఫండ్ మూల్యాంకనంలో ఏయూఎం అనేక అంశాలలో ఒకటిగా ఉండాలి. ఇది ఫండ్‌కు సంబంధించిన స్కేల్, ప్రజాదరణ గురించి మీకు తెలియజేస్తుంది. కానీ తప్పనిసరిగా దాని భవిష్యత్తు పనితీరు గురించి కాదని గుర్తుంచుకోవాలి. పెట్టుబడి నిర్ణయం తీసుకునేటప్పుడు ఎల్లప్పుడూ దానిని ఇతర డేటాతో జత చేయాలి. నగదుతో పాటు నగదు సమానంగా ఉన్న వాటితో ఏయూఎం లెక్కిస్తారు.

# ఏడాదిలోనే ఇన్వెస్టర్లను ధనవంతులను చేసిన పతంజలి..

**ముంబై, జూన్ 15:** బాబా రామ్‌దేవ్ పతంజలి ఫుడ్స్ షేర్లు గత ఒక సంవత్సరంలో విపరీతమైన వృద్ధిని సాధించాయి. ఆ తర్వాత కంపెనీ పెట్టుబడిదారులు ధనవంతులుగా మారారు. బిఎస్ఇ డేటా ప్రకారం.. కంపెనీ షేర్లు దాదాపు 29 శాతం పెరిగాయి. పతంజలి ఫుడ్స్ షేర్లు ఇప్పటివరకు చూసినంత వృద్ధిని అనేక పెద్ద కంపెనీల షేర్లు చూడలేదు. దాదాపు ఒక సంవత్సరం క్రితం కంపెనీ షేర్లు 52 వారాల కనిష్ట స్థాయి రూ. 1300కి చేరుకున్నాయి. ప్రస్తుతం ఇది దాదాపు రూ. 1700కి చేరుకుంది. గత ఒక సంవత్సరంలో స్టాక్ మార్కెట్లో పతంజలి షేర్ల గణాంకాలు ఎలా ఉన్నాయో చూద్దాం. గత ఏడాది కాలంలో పతంజలి షేర్లు దాదాపు 29 శాతం పెరిగాయి. జూన్ 24, 2024న, పతంజలి షేర్లు 52 వారాల కనిష్ట స్థాయి రూ.1,302.2కి చేరుకున్నాయి. అప్పటి నుండి కంపెనీ స్టాక్ రూ.373.3 పెరిగింది. డేటాను పరిశీలిస్తే.. జూన్ 11న బిఎస్ఇలో కంపెనీ స్టాక్ రూ.1,675.50 వద్ద ముగిసింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రాబోయే రోజుల్లో కంపెనీ షేర్లు మంచి పెరుగుదలను చూసే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్లో పతంజలి షేర్లు పెరగడం వల్ల కంపెనీ షేర్లలో పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారులు చాలా సంపాదించారు. ఎవరైనా ఏడాది క్రితం కంపెనీ షేర్లలో రూ.1,302.2 విలువైన రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే ఆ సమయంలో ఆ పెట్టుబడిదారుడికి దాదాపు 77 షేర్లు వచ్చేవి. ప్రస్తుతం దీని విలువ రూ.1.29 లక్షలు ఉండేది. అంటే పెట్టుబడిదారులు లక్ష రూపాయల పెట్టుబడిపై దాదాపు 29 వేల రూపాయల లాభం పొంది ఉండేవారు.

# ఐటి రిటర్న్ జాప్యానికి జరిమానాల ఝలక్

**న్యూఢిల్లీ, జూన్ 15:** ఆదాయపు పన్ను రిటర్న్ లేదా ఐటీఆర్ అనేది ఒక నిర్దిష్ట ఆర్థిక సంవత్సరానికి మీ స్థూల పన్ను విధించదగిన ఆదాయాన్ని చూపించే ఫారమ్. పన్ను చెల్లింపు దారులు తమ ఆదాయం, తగ్గింపులు, మినహాయింపులు చెల్లించిన పన్నులను అధికారికంగా వెల్లడించడానికి ఈ ఫారమ్‌ను ఉపయోగిస్తారు. ఫలితంగా ఇది ఇచ్చిన ఆర్థిక సంవత్సరానికి మీ నికర ఆదాయ పన్ను బాధ్యతను నిర్ణయిస్తుంది. పన్ను ఆడిట్‌కు బాధ్యత వహించని వ్యక్తుల కోసం ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి గడువు తేదీ తదుపరి ఆర్థిక సంవత్సరం జూలై 31గా ఉంటుంది. అయితే ఈ గడువు తేదీలోపు మీ ఐటీఆర్‌ను దాఖలు చేయకపోతే, సెక్షన్ 234 ఎఫ్ కింద మీకు రూ. 5,000 ఆలస్య రుసుము విధించే అవకాశం ఉంటుంది. అయితే మీ వార్షిక ఆదాయం రూ. 5 లక్షల కంటే తక్కువ ఉంటే ఆలస్య ఖర్చులు రూ. 1000 కి పరిమితం చేశారు. సెక్షన్ 234ఏ ప్రకారం, మీరు పన్నులు చెల్లించకపోతే మీరు బకాయి ఉన్న పన్ను మొత్తంపై ప్రతి నెలా 1 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. ఈ వడ్డీని మీరు సంబంధిత ఆర్థిక సంవత్సరానికి రిటర్న్ దాఖలు చేసిన రోజు నుండి గడువు తేదీ వరకు లెక్కిస్తారు. రూ. 25,000 దాటిన ఆదాయపు పన్ను బకాయిదారులకు కనీసం 6 నెలలు నుండి 7 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష, అలాగే జరిమానా విధించవచ్చు. రూ.25,000 కంటే తక్కువ ఉంటే కనీసం మూడు నెలలు, గరిష్టంగా రెండు సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష, అలాగే జరిమానా విధించవచ్చు. మీరు గడువు తేదీకి ముందు లేదా గడువు తేదీలోపు మీ ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేస్తే మీరు నష్టాలను తదుపరి సంవత్సరాలకు బదిలీ చేయడానికి అనుమతి ఇస్తారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.